RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 12 | సంచిక : 271 | ఆదిలాబాద్ | గురువారం, మార్చి 20, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12













## రాష్ట్ర బడ్జెట్ రూ.రూ.3,04,965 కోట్లు...

హైదరాబాద్ : శాసనభలో పద్దును ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మండలిలో ప్రతిపాదించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు - వివిధ రంగాలకు కేటాయింపులిలా..

పంచాయతీరాజ్ శాఖ- రూ.31,605 కోట్లు వ్యవసాయశాఖ- రూ.24,439 కోట్లు విద్యాశాఖ- రూ.23,108కోట్లు మహిళా శిశు సంక్షేమశాఖ- రూ.2,862 కోట్లు పశు సంవర్ధకశాఖ- రూ.1,674 కోట్లు పౌరసరఫరాల శాఖ- రూ.5,734కోట్లు కార్మికశాఖ- రూ.900 కోట్లు ఎస్సీ సంక్షేమం: రూ40,232 కోట్లు ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు బీసీ సంక్షేమం- 11,405 కోట్లు చేనేత రంగానికి- రూ.371 కోట్లు మైనార్టీ సంక్షేమశాఖ- రూ.3,591 కోట్లు

పరిశ్రమలశాఖ- రూ.3,527 కోట్లు ఐటీ రంగం- రూ.774 కోట్లు

విద్యుత్ రంగం- రూ.21,221 కోట్లు వైద్య రంగం- రూ.12,393 కోట్లు పురపాలక రంగం- రూ.17,677 కోట్లు నీటి పారుదలశాఖ- రూ.23,373 కోట్లు రోడ్లు, భవనాల శాఖ- రూ.5,907 కోట్లు

పర్యాటక రంగం - రూ.775 కోట్లు క్రీడలు- రూ.465 కోట్లు అటవీ, పర్యావరణం- రూ.1,023 కోట్లు దేవాదాయశాఖ- రూ.190 కోట్లు ఆరు గ్యారంటీలు- రూ.56,084 కోట్లు రైతు భరోసా- రూ.18వేల కోట్లు చేయూత పింఛన్లు రూ.14,861 కోట్లు ఇందిరమ్మ ఇళు రూ.12,571 కోట్లు మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు గృహజ్యోతి- రూ.2,080 కోట్లు సన్నాలకు బోనస్ రూ.1,800 కోట్లు రాజీవ్ ఆరోగ్యశ్రీ- రూ.1,143 కోట్లు గ్యాస్ సిలిండర్ రాయితీ- రూ.723 కోట్లు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా- రూ.600 కోట్లు

రాజీవ్ యువ వికాసం- రూ.6వేలకోట్లు

ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు

## సంక్షేమం, అభివృద్ధి అనేవి

# జోడెడ్లు..

- వాటిని మరింత పరుగులు పెట్టిస్తాం
- మాది జవాబుదారీతనంతో కూడిన పాలన
- ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం
- బడ్జెట్ ప్రసంగంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క





హైదరాబాద్ : సంక్షేమం, అభివృద్ధి అనేవి తమ ప్రభుత్వ రథానికి జోడెడ్లలాంటివని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. వాటిని రానున్న రోజుల్లో మరింత పరుగులు పెట్టిస్తామని ఆయన తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నట్టు చెప్పారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 సూచించారు.

బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీలో ఆయన బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ... 'తెలంగాణ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ పాలన సాగిస్తున్నాం. గత ప్రభుత్వ పాలనలో ఛిద్రమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనిచేస్తున్నాం. కొందరు దుష్ప్రచారమే పనిగా పెట్టుకున్నారు. ప్రభుత్వ ప్రతి చర్యనూ నిందిస్తూ ఆరోపణలు చేస్తున్నారు. గత ప్రభుత్వం 2 పడక గదుల ఇళ్లు ఇస్తామని ప్రజలకు నిరాశ మిగిల్చిందని వాపోయారు. రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించాం. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేళ్లలో ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నాం. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. ప్రతి మండలంలో మహిళలతో రైస్ మిల్లులు, మినీ గోదాములు ఏర్పాటు చేస్తాం. ఐకేపీ కేంద్రాల్లో కొన్న ధాన్యాన్ని మహిళా రైస్ మిల్లుల్లో మిల్లింగ్ చేయిస్తాం. ఆ బియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసే బాధ్యతను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తాం. మండల మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి అద్దెకు 600 బస్సులు కేటాయిస్తాం. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ చట్టాన్ని అమలు చేస్తున్న మొదటి రాష్ట్రం తెలంగాణని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు.




## ప్రవచనాలు ఎక్కువ...

# పైసలు తక్కువ

- అప్పుల విషయంలో కేసీఆర్ పై చేసిన ప్రచారం తప్పని రుజువైంది
- అరకొర కేటాయింపులతో అభివృద్ధి,
- సంక్షేమం ఎలా సాధ్యమవుతుంది ?
- వాస్తవిక అంచనాలతో బడ్జెట్ లేకపోవడం దారుణం

హైదరాబాద్: "కోట్స్ ఎక్కువ ఫాక్స్ తక్కువ.... ప్రవచనాలు ఎక్కువ పైసలు తక్కువ" అన్నట్టుగా బడ్జెట్ ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. చెప్పిన విషయాలనే పదేపదే చెప్పడం తప్ప అందులో వాస్తవాలు ఏమి లేవని తెలిపారు. అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం అరకొరా నిధులు కేటాయించిందని, కొత్త పథకాలు ఏవి కేటాయించలేదని తెలిపారు. వాస్తవిక అంచనాలతో బడ్జెట్ రూపొందించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నాడు ప్రవేశపెట్టిన బడ్జెట్ మీద ఎమ్మెల్సీ కవిత స్పందిస్తూ....తీసుకున్న రుణాలకు గాను ఈ ప్రభుత్వం గత ఏడాది కాలంగా కట్టిన వడ్డీతో సహా తిరిగి చెల్లించిన మొత్తం కేవలం రూ. 30 వేలు మాత్రమే అని బడ్జెట్ లెక్కలు స్పష్టంగా చెబుతున్నాయని, కానీ రూ లక్షా 40 వేల కోట్లు అప్పులు కట్టామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పారని ధ్వజమెత్తారు. కెసిఆర్ గారు రాష్ట్రాన్ని హక్కుల పాలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్దపు ప్రచారం చేసినట్లు బడ్జెట్ పుస్తకాలు నిరూపించాయని ఎండగట్టారు. తెలంగాణ ఏర్పడ్డప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రం చేసిన అప్పులు మొత్తం నాలుగు లక్షల 37 వేల కోట్లు అని ప్రభుత్వమే స్వయంగా బడ్జెట్లో పేర్కొందని, మరి కెసిఆర్ గారు ఏడున్నర లక్షల కోట్లు అప్పు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా ఆరోపిస్తారని నిలదీశారు. ఇప్పటివరకు చేసిన అప్పుల్లో గత ఏడాదికాలంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన అప్పు లక్షా 54 వేల కోట్లు ఉందని ఎండగట్టారు. కాంగ్రెస్ అసమర్థతోనే రాష్ట్రంలో కరువు: ఎమ్మెల్సీ కవిత ఎండల వల్లే రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. గతేడాది వర్షాలు సమృద్ధిగా పండాయని, ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటర్ మేనేజ్‌మెంట్ తెలియకపోవడంతోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా కేసీఆర్ చెరువులు నింపారన్నారు. ఎండిన పంటలతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలి ఆవరణలో కవిత మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆయకట్టు కింద ఉన్న పొలాలు కూడా ఎండిపోతున్నాయన్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృష్ణా నది నుంచి 10 వేల క్యూసెక్కుల నీళ్లు ఎత్తుకుపోతుంటే చూస్తూ ఊరుకుంటున్నారని విమర్శించారు

## బి.సి రిజర్వేషన్లు పెంచడం

# అభినంద నీయం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్మానించిన బి.సి ఉద్యోగుల సంఘం
- బి.సి ఉద్యోగుల సంఘం డైరీని ఆవిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : అసెంబ్లీలో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్ పెంపు బిల్లును రాష్ట్ర శాసనసభ ఏర్పాటు పట్ల రాష్ట్ర బి.సి ఉద్యోగుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యం. చంద్రశేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమాదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ రామరాజు వర్మ, సలహాదారులు సుంకరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నారాయణ, యాదగిరి, సుంకరి కృష్ణ, శేషాచారి, దొంతి ప్రసన్న కుమార్, సీతారాం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి లను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఇదొక చారిత్రాత్మకమైన ఘట్టంగా వారు వర్ణిస్తూ ఇదే నిర్ణయాన్ని దేశ వ్యాప్తంగా అమలు పరిచేలా వత్తిడి తేవాలని వారు కోరారు. ఇవే రిజర్వేషన్లను ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతులలో కుడా అమలు పరచాలని వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు. ఈ సందర్భంగా బి.సి. ఉద్యోగుల సంఘం రూపొందించిన 2025 డైరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇది రైతు పక్షపాత ప్రభుత్వం

- నీటిపారుదల రంగానికి పెద్దపీట
- 23,373 కోట్ల కేటాయింపుతో పటిష్టం కానున్న నీటిపారుదల రంగం
- సంక్షేమరంగానికి పెద్ద ఎత్తున నిధుల కేటాయింపు
- పౌర సరఫరాల శాఖకు 5,734 కోట్ల కేటాయింపు



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని మరోసారి రుజువు అయిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం అభివృద్ధి ప్రజల సంక్షేమాన్ని సమపాళ్లలో రంగరించి రూపొందించిన బడ్జెట్ ఇదని ఆయన అభివర్ణించారు. బుదవారం రాష్ట్ర శాసనసభలో ఆర్థిక, విద్యుత్ శాఖామంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్ ను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వాగతించారు. బడ్జెట్ ప్రసంగం పై ఆయన ఒక ప్రకటనలో స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ సాదికారత, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధి లతో పాటు నీటిపారుదల, పౌర సరఫరాలను పతిష్టవంతంగా మార్చేందుకు ఈ బడ్జెట్ ప్రతిబింబింప చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి రైతాంగంపై మక్కువ ఎక్కువ అని చెప్పడానికి నీటి పారుదల రంగానికి 23 వేల 373 కోట్ల కేటాయింపు నిదర్శనమన్నారు. నల్గొండ జిల్లాలో లక్ష ఎకరాలకు నీరందించేందుకు గాను ఉదయ సముద్రం నుండి బ్రహ్మణ వెళ్ళేంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంతో పాటు నల్లగొండ, యాదాద్రి భోనగిరి జిల్లాలోని 107 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు ఫ్లోరోసిస్ రహిత త్రాగు నీరు అందించే ప్రాజెక్టు పూర్తికి కృషి చేస్తామన్నారు. అంతే గాకుండా మూసి ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలోనీ బునాదిగాని కాలువ పునరుద్ధరణ కోసం 266.65 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ తద్వారా యాదాద్రి జిల్లాలో పంటలు సస్యశ్యామలంగా మారనున్నాయన్నారు. కృష్ణా గోదావరి నదుల నీటి వాటాను తెలంగాణాకు సాదించేందుకు గాను ప్రభుత్వం చేస్తున్న కృషిని అభినందిస్తూనే బి.ఆర్.ఎస్ పాలనలో జరిగిన అక్రమ కేటాయింపులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యహారిస్తూనే బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర హక్కులను బలంగా వాదించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రధానంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు నీటి వనరుల వినియోగాన్ని గుర్తించేందుకు వీలుగా టెలిమెట్రి పరికరాలను అమర్చడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తునే దీని ద్వారా నీటి కేటాయింపులలో పారదర్శకంగా ఉండొచ్చన్నారు. నీటిపారుదల రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి రైతాంగానికి వెన్ను దన్నుగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం అదే సమయంలో సంక్షేమ రంగానికి సైతం బడ్జెట్ కేటాయింపులలో సముచిత స్థానం వేసి ప్రజల సంక్షేమం పట్ల తమకున్న చిత్తశుద్దిని చాటుకుందని ఉత్తమ్ ఈ సందర్భంగా తెలిపారు. అందులో ముఖ్యంగా పేద ప్రజలకు నేరుగా కనెక్టివిటీ ఉన్న పౌర సరఫరాల శాఖకు ఏకంగా 5,734 కోట్లు కేటాయించడం మహాదానందంగా ఉందన్నారు. తద్వారా లక్షలాది కుటుంబాలకు ఆహార భద్రత కల్పించినట్లైందన్నారు. అంతే గాకుండా ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన విదంగా గృహజ్యోతి పథకంలో 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరాకు 1,775.15 కోట్లు కేటాయింపు ప్రభుత్వ దార్శనికతకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పెట్టుకున్న పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాలకు 22,500 కేటాయించిన ప్రభుత్వం పేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న మక్కువను చాటుకుందన్నారు. అభయహస్తం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్ ప్రయాణం, మహాలక్ష్మి పథకం కింద 500 కే గ్యాస్ సిలిండర్ లతో పాటు కొత్తగా తెల్ల రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలు ఆర్థికంగా బలహీన వర్గాల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. అన్నింటికీ మించి సన్నాల ప్రోత్సాహనికి గాను ప్రభుత్వం ప్రకటించిన 500 బోనస్ అద్భుతమైన ఫలితాలు నమోదు చేసిందన్నారు. బోనస్ ప్రకటనతో సన్నాల సాగు 25 లక్షల నుండి 40 లక్షలకు చేరుకోవడం రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ఘనత గా ఆయన అభివర్ణించారు.

# సంపాదకీయం

## ట్రంప్ శాంతి ప్రతిపాదనలు ఏకపక్షమేనా!

ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరి కా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొ నేందుకు రష్యా-చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది. మూడున్నర దశాబ్దాలుగా 'ప్రచ్ఛన్న కాలం' నాటి సోవియట్ యూనియన్‌ను శత్రుదేశంగా పరిగణించే అమెరికా విదేశాంగ విధానంలో మార్పు తీసుకు వచ్చేందుకు ట్రంప్ ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ పరిణామాలు సహజంగానే ఉక్రెయిన్‌కు అశనిపాతంగా మారే అవకాశం ఉంది. అమెరికా అధ్యక్ష పదవిని రెండోసారి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ రెండు నెలల పదవీకాలంలోనే స్వదేశంలో, విదేశాలలో కలకలం సృష్టిస్తున్నారు. ఒకవంక, సంఘర్షణలను ఆపివేసి శాంతిదూతగా పేరు తెచ్చుకునేందుకు మధ్య ఆసియాలో తాను పదవి చేపట్టేలోగా కాల్పుల విరమణ జరగాలని స్పష్టం చేశారు. మరోవంక, ఉక్రెయిన్‌లో సైతం కాల్పుల విరమణకు ప్రతిపాదిస్తూ తాను తలచుకొంటే 24 గంటలలో సాధ్యం అవుతుందంటూ చెప్పుకొచ్చారు. సంఘర్షణలకు ఒకవైపు తాత్కాలిక విరామం లభించేటట్లు ప్రయత్నం చేస్తూ మరోవంక వాణిజ్యపరంగా టారిఫ్ యుద్ధాలకు ఆజ్యం పోస్తున్నారు. టారిఫ్‌లను తగ్గించని పక్షంలో ఎదుటివారెంతగా టారిఫ్‌లు విధిస్తారో తాము కూడా అంతే విధిస్తామంటూ చెబుతున్నారు. స్వదేశంలో సైతం ఉద్యోగులను తొలగించడం, పలు అసాధారణమైన ఉత్తర్వులపై సంతకాలు చేయడం చేస్తున్నారు. రెండు నెలలకే ఇంతగా హడావుడి చేస్తున్నారు, మరో నాలుగేళ్ల వరకు ఎంతగా చెలరేగిపోతారో అంటూ గుసగుసలు బయలుదేరుతున్నాయి. ఆయన చేపట్టిన చర్యలలో చాలావరకు సంచలనాలు కనిపించడమే గాని శాశ్వత పరిష్కారాలు కనిపించడం లేదు. ఆయనకు సైతం అటువంటి ఉద్దేశాలు ఉన్నట్టు లేదు. ఉదాహరణకు మధ్య ఆసియాలో కాల్పుల విరమణతో బందీల మార్పిడి వరకు విజయం సాధిస్తున్నారు. ఇది మొదటి దశ 45 రోజులకు మాత్రమే కావడం గమనార్హం. ఆ తర్వాత ఏమి జరుగుతుందో చూడాల్సి ఉంది. రెండో దశలో గాజా నుండి ఇజ్రాయెల్ సేనలు పూర్తిగా వైదొలగాలి. అటువంటి అవకాశాలు కనిపించడం లేదు. ఇజ్రాయెల్ సైతం తమ బందీలను విడిపించుకోవడం కోసమే కాల్పుల విరమణకు అంగీకరించినట్లు కనిపిస్తున్నది. మూడవ దశలో మొత్తం గాజాను పునర్నిర్మించి, అక్కడున్న పాలస్తీనా ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించి, ట్రంప్ టవర్లు నిర్మిస్తారని వస్తున్న ప్రతిపాదనలు ఎవ్వరికీ ఆమోదయోగ్యం అయ్యే అవకాశం లేదు.సుస్థిరమైన పాలస్తీనా దేశం ఏర్పాటుకు ఇజ్రాయెల్ అంగీకరిస్తుందని భావించలేం. అదే విధంగా చివరకు ఇజ్రాయెల్ ప్రయోజనాలను కాపాడటం మినహా అమెరికా సైతం స్వతంత్రించి నిర్ణయాలు ప్రకటించలేదు. అక్కడున్న సుమారు 23 లక్షల మంది పాలస్తీనా ప్రజలను తరలించి పునరావాసం కల్పించేందుకు అరబ్ దేశాలు ఏవి ముందుకు రావడం లేదు. ప్రస్తుత పరిస్థితులలో అది ఆచరణ యోగ్యమైన పరిష్కారం కూడా కాబోదు. దానితో సుడాన్, సోమాలియా వంటి తూర్పు ఆఫ్రికా దేశాలకు తరలించేందుకు చర్చలు జరుపుతున్నారు. హమాస్ పట్ల కఠినంగా మాట్లాడుతున్న ట్రంప్ వారిని తుదముట్టడించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నది. పాలస్తీనా ప్రజలను అక్కడి నుండి తరలించి, గాజా భూభాగాన్ని తమ ఆధీనంలోకి తెచ్చుకొని, యుద్ధం కారణంగా కకావికలమైన ప్రాంతాన్ని బాగుచేసి, రియల్ ఎస్టేట్ అభివృద్ధి చేయాలని అమెరికా ప్రతిపాదిస్తుంది. ఇదే మాత్రం కార్యరూపం దాలుస్తుందో చెప్పలేం. ఇక ఉక్రెయిన్ విషయానికి వస్తే ఆ దేశాన్ని నట్టేట ముంచే, రష్యాతో చెలిమికి ట్రంప్ ప్రయత్నం చేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు చెబుతున్న శాంతి పరిష్కారం ప్రతిపాదనలు అటు రష్యా, ఇటు అమెరికాలకు ప్రయోజనం కలిగించడమే గాని, ఉక్రెయిన్‌కు ఎటువంటి భరోసా కల్పించే అవకాశం కనిపించడం లేదు. ఈ యుద్ధం ప్రారంభమైనదే ఉక్రెయిన్‌ను నాటోలో సభ్యదేశంగా చేర్చుకునేందుకు అమెరికా, ఐరోపా దేశాలు ప్రయత్నించడంతో. రష్యా మొదటి నుండి పెడుతున్న ప్రధానమైన షరతు నాటోలో చేరబోమని హామీ ఇవ్వాలని. తమ దేశ సరిహద్దుల్లోకి నాటో దళాలను అనుమతించడం రష్యా భద్రతకు ప్రమాదకరం కాగలదు. యుద్ధం ప్రారంభమైన రెండు వారాల్లోనే అటువంటి షరతుకు ఉక్రెయిన్ సుముఖత వ్యక్తం చేస్తూ రాజీకోసం సిద్ధపడుతున్న సమయంలో అమెరికా, ఐరోపా దేశాలు చేరి పడనీయలేదు. ఉక్రెయిన్ భద్రతకు తాము భరోసా అంటూ రెచ్చగొట్టాయి. ఇప్పుడు రాజీకోసం ఉక్రెయిన్ కొంత భూభాగం పోగొట్టుకొనేందుకు సైతం సిద్ధపడాలని ట్రంప్ చెబుతున్నారు. ఉక్రెయిన్‌లోని నాలుగు రాష్ట్రాలు, అంటే 20 శాతం భూభాగం ఇప్పుడు రష్యా అధీనంలో ఉన్నాయి. ఎటువంటి శాంతి ప్రతిపాదనలు సైతం ఆ భూభాగాల నుండి రష్యాను వెనుకకు పంపించే అవకాశాలు కనిపించడం లేదు. మరోవంక, ఉక్రెయిన్‌కు తాము చేసిన సైనిక సహాయానికి బదులుగా ఆ దేశంలోని అత్యంత విలువైన, అరుదైన లోహాలపై తమకు ఆధిపత్యం కల్పించాలని అమెరికా ఒత్తిడి తెస్తున్నది. అమెరికా 500 బిలియన్ డాలర్ల సైనిక సహాయం చేశామని చెబుతున్నది. వాస్తవానికి ఆ మొత్తంలో నేరుగా కేవలం 160 బిలియన్ డాలర్లు మాత్రమే ఉక్రెయిన్‌కు అమెరికా సహాయంగా ఇచ్చింది. మిగిలిన మొత్తాన్ని అమెరికాలోని ఆయుధ కంపెనీలకు అందజేసింది. ఆ విధంగా ఉక్రెయిన్ సహజ వనరులపై అమెరికా కన్నేసింది. మరోవంక, ఐరోపా దేశాల భద్రతకు తాను హామీ ఇవ్వలేనని ట్రంప్ చేతులెత్తేశారు. నాటో ఆర్టికల్ 5 ప్రకారం నాటోలోని ఏ సభ్య దేశంపై యుద్ధం జరిగినా అందులోని మొత్తం 32 సభ్య దేశాలు ఉమ్మడిగా సైనికంగా నిలబడాలి. కానీ ఇప్పుడు అమెరికా తోకాడించడంతో ఐరోపా దేశాలు ఆత్మరక్షణలో పడ్డాయి. దానితో అవి ఇప్పుడు ఉక్రెయిన్ కు సైనిక సహాయం అందించే పరిస్థితుల్లో లేవు. అందుకనే ఇప్పుడు ఫ్రాన్స్, జర్మనీ కలిసి 500 బిలియన్ డాలర్లతో ఉమ్మడి సైనిక వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించుకున్నాయి. అమెరికా ఇంకేమాత్రం తమకు సహాయకారి కాబోదని ఐరోపా గ్రహిస్తున్నది. ఈ పరిణామాలు అన్ని ఐరోపాలో మరింత అనిశ్చితకు అమెరికా ఆజ్యం పోస్తున్నట్లు స్పష్టం చేస్తున్నాయి. ట్రంప్ ప్రపాదిస్తున్న నెల రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదనను సూత్రప్రాయంగా ఆమోదిస్తూ, షరతులు ప్రకటిస్తున్న రష్యా కేవలం ఉక్రెయిన్ స్వాధీనంలోని కీలకమైన కురుస్క్ ప్రాంతాన్ని తిరిగి తమ స్వాధీనంలోకి తెచ్చుకునేందుకు కాలయాపన చేస్తున్నది. ఒక గ్యాస్ పైప్‌లైన్ లోపల కిలోమీటర్లు నడిచి లోపలకు ప్రవేశించి ఉక్రెయిన్ సేనలను రష్యా దళాలు ముట్టడించాయి. ఉక్రెయిన్ ఆగస్టులో కురుస్క్ లోపలకు చొచ్చుకుపోయేందుకు సాహసోపేతంగా సీమాంతర దాడి ప్రారంభించింది. రెండవ ప్రపంచ యుద్ధం దరిమిలా రష్యన్ భూభాగంపైకి అది అతిపెద్ద దాడిగా భావిస్తున్నారు. కొన్ని రోజుల్లోనే ఉక్రెయిన్ దళాలు వ్యూహాత్మక సరిహద్దు పట్టణం సుడ్జాతో సహా వేయి చదరపు కి.మీ భూభాగాన్ని కైవసం చేసుకుని, వందలాది మంది రష్యన్లను యుద్ధ ఖైదీలుగా తీసుకున్నాయి. భవిష్యత్తులో శాంతి చర్చల్లో బేరసారాల్లో లబ్ధి పొందడం, తూర్పు ఉక్రెయిన్‌లో దాడులనుంచి రష్యన్ సైనికులను మళ్లించేలా ఒత్తిడి చేయడం లక్ష్యంగా ఆ దాడి నిర్వహించినట్లు కీవ్ వెల్లడించింది. అయితే, ఉక్రెయిన్‌పై ఆకస్మాత్తుగా దాడి జరపడం ద్వారా ఈ ప్రాంతాన్ని తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడం ద్వారా రష్యా ఉక్రెయిన్‌కు దాదాపుగా కాల్పుల విరమణకు లొంగిపోవడం మినహా, ఎటువంటి బేరసారాలకు పాల్పడే అవకాశం లేకుండా చేస్తున్నది. కురుస్క్ ప్రాంతంలో ఉక్రేనియన్ సైనికులు 'తీవ్ర ఇబ్బందుల్లో' ఉన్నారని, రష్యన్ సైనికులు చుట్టుముట్టారని వెల్లడించిన ట్రంప్ తాను ప్రతిపాదిస్తున్న శాంతి ప్రతిపాదనలకు సంబంధించిన ఎటువంటి వివరాలు వెల్లడించడం లేదు. భూభాగాలు, విద్యుత్ ప్లాంటులు, కొన్ని ఆస్తుల విభజన గురించి ఉండవచ్చంటూ అస్పష్టంగా చెబుతున్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్‌కు కీలకమైన ఐరోపాలోని అతిపెద్ద అణువిద్యుత్ ప్లాంట్ అయిన ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత జపోరిజ్జియాకు తిరిగి ఇచ్చే ప్రతిపాదనలు సైతం కన్పించడం లేదు. శాశ్వత శాంతి ప్రతిపాదనగా రష్యా ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాలను తిరిగి ఇచ్చేసే ఎటువంటి ప్రతిపాదనకు రష్యా సుముఖంగా ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ విషయంలో ట్రంప్ సైతం పట్టుదలతో ఉన్నట్లు లేదు. ఉక్రెయిన్‌కు సైనిక సహాయం నిలిపివేయడం, ఐరోపా దేశాలను సైతం ఉక్రెయిన్‌కు సైనిక సహాయం అందించలేని పరిస్థితులు కల్పించడం ద్వారా ఉక్రెయిన్‌ను నిస్సహాయ పరిస్థితుల్లో నెట్టివేసే ప్రయత్నాలే కనిపిస్తున్నాయి. ట్రంప్ దృష్టి అంతా రష్యాతో చెడిపోయిన అమెరికా సంబంధాలను పునరుద్ధరించుకోవడం పైననే ఉన్నట్లు స్పష్టం అవుతుంది. అందుకోసం రష్యాపై విధించిన ఆంక్షలను తొలగించేందుకు కూడా సిద్ధపడుతున్నట్లు వెల్లడి అవుతుంది. చైనా నుండి ఎదురవుతున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు రష్యా- చైనాల మధ్య కొంత దూరం సృష్టించాలని ఎత్తుగడగా కనిపిస్తున్నది.

# పరీక్షలకే పరీక్ష

ఏడాది కాలంగా విద్యార్థి నేర్చుకున్న జ్ఞానానికి గంట, మూడు గంటల్లో పరీక్షించడం సబబా? ఇది నిజంగా విద్యార్థి ఏడాది కాలంగా నేర్చుకున్న అభ్యసనానుభవాలను అంచనా వేయగలుగుతుందా? విద్యార్థి పరిపూర్ణ మూర్తిమత్వంను ఈ పరీక్షలు ఎంత వరకు కొలమానం? ఏళ్ళుగా వస్తున్న మన పరీక్షా విధానం పైన పలు రకాల సందేహాలు మన విద్యారంగం మేధావులు, నిపుణులు వ్యక్తం చేస్తూ వచ్చారు. బ్రిటీష్ వలసవాదం నుండి వచ్చిన ఈ పరీక్షా విధానం మెకాలేకి నకలని, అశాస్త్రీయమైనదని, సమూలంగా ఈ విధానం మారాలని, విద్యార్థులను ఒత్తిడికి గురిచేయని పరీక్ష విధానం కావాలని కోరుకున్నాం. అందులో భాగంగానే మన పరీక్షా విధానం లోని లోపభూయిష్టతను సరిదిద్ది పరీక్షా సంస్కరణలను తెచ్చుకున్నాం! విద్యాహక్కు చట్టం -2009 కొంతలో కొంతైనా మన అనుమానాలు నివృత్తి పరచగలిగింది. సరికొత్త పరీక్షా సంస్కరణకు అవకాశం కల్పించింది. విద్యాహక్కు చట్టం- 2009, సెక్షన్ 29 (1) హెచ్ ప్రకారం విద్యార్థి ఏడాది కాలంగా పొందిన అభ్యసనానుభవాలు, జ్ఞానసామర్థ్యాలు, ఒత్తిడి లేకుండా పరీక్షించే పరీక్ష విధానం నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) మన నూతన ప్రక్రియ! ఈ పరీక్షా విధానం మౌలిక మార్పులు ఏమంటే నేర్చుకున్న దంతా గంట, మూడు గంటల్లో జవాబులు రూపంలో కక్కేసే కంటే! విద్యార్థి అభ్యసన అనుభవాలతోపాటు, విద్యార్థి విద్యా సామర్థ్య అంచనా పరికరం పరీక్ష కూడా నిరంతర సమగ్ర ప్రక్రియగా ఉండాలి. అది ఏ పాఠశాలలో, ఏ విషయంలో నేర్చుకుంటున్నామో! ఆ ఉపాధ్యాయులు, ఆ అధ్యాపకులే ఎప్పటికప్పుడు నిరంతరం విద్యార్థిని అంచనా వేసుకుంటూ విద్యార్థికి పరీక్షనుండి గమనించిన అంశాలు నిరంతరం సమీక్షించి, సరిచేయడానికి సాధనంగా ఉండాలి. ఆసాధనమే నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) విధానం అని విద్యాహక్కు చట్టం స్పష్టం చేసింది. దీని ప్రకారం నిర్మాణాత్మక మూల్యాంకనం (ఎఫ్ఎ), ఇది నాలుగు దశలుగా సబ్జెక్టును విభజించి, ఆ సబ్జెక్ట్‌లో రాత సామర్థ్యం, పఠనసామర్థ్యం, ప్రాజెక్టు వర్క్ (పని అనుభవం), స్లిప్ టెస్టు (జ్ఞాన అనుభవం) వీటన్నింటినీ తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుడి పర్యవేక్షణలో నిర్వహించబడి ఒక్కో అంశానికి 5 మార్కులు చొప్పున సగటున 20 మార్కుల ఏడాదిలో ఇవ్వబడతాయి.

ఈ నిర్మాణాత్మక పరీక్ష అనేది తరగతి సబ్జెక్టు ఉపాధ్యాయుల వ్యక్తిగత బోధన సరిదిద్దడానికి, ఉపాధ్యాయులు తమ బోధనానుభవాలు సమీక్షకు, విద్యార్థి తాను వెనకబడిన విషయం తనకు తాను తెలుసుకోవడానికి తోడ్పడుతుంది. ఒక విధంగా ఇవి మనం ఎంతోకాలంగా కోరుకున్న మార్పులే! ఇకపోతే సిసిఇలో రెండవ అంశం ఏమంటే సబ్జెక్టు రెండు భాగాలుగా విభజించి ఒక్కో సెమిస్టర్‌కు 40 మార్కుల చొప్పున రెండు సెమిస్టర్‌లు కలిపి 80 మార్కులకు విద్యనేర్చిన పాఠశాలలోనే సంగ్రాహనాత్మక మూల్యాంకనం జరుగుతుంది. ఈ సంగ్రాహ నాత్మక మూల్యాంకనంలో విద్యార్థి పొందిన జ్ఞానంతో పాటు, ఆయా సబ్జక్టులలోని ఆరు అభ్యసన సామర్థ్యాలు పరీక్షించబడతాయి. అంటే విద్యార్థి ఆ వయసులో పొందాల్సిన విద్యా సామర్థ్యాలు ఎంతో కొంత నిజాయితీగా అంచనా వేయగలిగిన విధానం. ఈ మొత్తం విద్యార్థి పొందిన 100 మార్కుల నుండి 3 నుండి 10 వరకు గ్రేడులను ఆయా విద్యార్థులకు పొందిన మార్కులను బట్టి ఇస్తారు. ఈ గ్రేడులే విద్యార్థి సమగ్ర మూల్యాంకనం అంచనాగా భావించి బోధనా లక్ష్యాలు విద్యార్థికి అందేలా ముఖ్యంగా సబ్జక్టు ఉపయోగపడే అంశంపైనే ఈ పరీక్షలు! విద్యార్థి, ఉపాధ్యాయులు చేతిలో నిరంతర సమగ్ర సాధనం అయిన ఈ నిరంతర సమగ్ర మూల్యాంకనం విధానం వచ్చి15 ఏళ్ళుగడిచినా నేటికీ దాన్ని సంపూర్ణంగా అమలు జరిపే ధైర్యం పాలక వర్గాలకు లేదు. ఇటు అర్థం చేసుకొని అనుసరించే స్థితికొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులలో లోపించింది. మన రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా వ్యవస్థ ఒత్తిడి తట్టుకోలేక, మానెటరింగ్ వ్యవస్థ సరిదిద్దుకోలేక, ఇప్పటికే సంగ్రహనాత్మక మూల్యాంకనం వార్షిక పరీక్షగా, పాత వాసనలతో నిర్వహిస్తున్న 80 మార్కులకు గాను, నిర్మాణాత్మక మూల్యాంకనం 20 మార్కులు కలిపి పాత పద్ధతిలో 100మార్కులకు ఎస్ఎస్‌సి పరీక్ష నిర్వహించపూనుకుంది. ఇది ఈ ఏడే అమలు పరచాలని అధికారులు ప్రయత్నించారు కూడా? కానీ, కొన్ని సాంకేతిక సమస్యల వలన మరుసటి ఏడాదికి వాయిదా వేసుకున్నారు. అంతేకాకుండా మరో పరీక్ష మార్పుకు సైతం ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మార్చిలో పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సరైన గ్రేడ్ రాని పక్షంలో మే నెలలోపు మరో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించి ఒకేసారి ఫలితాలు ప్రకటిస్తామని ప్రకటించారు. అంటే పాత సప్లిమెంటరీ పరీక్షలు తిరిగి పునరుద్ధరణ అన్న మాట! అంటే ప్రైవేటు విద్యా వ్యవస్థ కోరికలు తూచా తప్పకుండా అమలు జరపడానికి అధికారులు, పాలకులు సంసిద్ధం అయ్యారనే విషయం సుస్పష్టం అవుతుంది. అభ్యసనానుభవాలు, పాఠ్యాంశాలు అధ్యయనంలో అంతర్లీనంగా, అంతర్భాగంగా జరగాల్సిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సిసిఇ) ప్రక్రియ మన పరీక్ష విధానంలో ఒత్తిడి లేని సులభతరం అయిన విధానాలకు సూచికనై ఉండగా, దాన్ని బలోపేతం చేయకపోగా ఎటు తిరిగీ మన పాత మూల్యాంకనం విధానం వైపు మన విద్యాధికారుల ఆలోచనలు కొనసాగడంలో అంతర్యం ఏమిటో ఒకపట్టాన అర్థం కాదు? మనం చట్టంగా తెచ్చుకున్న సులభం, సరళతరం అయిన పరీక్ష సంస్కరణ ఒత్తిడి లేని నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియకు బదులు దొడ్డిదారిన తెస్తున్న పాత మూల్యాంకనం విధానం ఏ రూపంలో తెచ్చినా అడ్డుకోవాల్సిన అవసరం ఉంది. మనం దీర్ఘకాలిక పోరాటంతో విద్యాహక్కు చట్టంగా తెచ్చుకున్న నిరంతర సమగ్ర మూల్యాంకనం ప్రక్రియ సంపూర్ణంగా అమలు చేయాలనే డిమాండ్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ముందుకు పోవాల్సి ఉంది. ఒత్తిడి, విద్యార్థుల ఆత్మహత్యలు లేని సంపూర్ణ పరీక్షా సంస్కరణ అమలు దిశగా అడుగులు వేద్దాం. మన పాఠశాల పరీక్షా వ్యవస్థలో సరైన మార్పులను మాత్రమే స్వాగతిద్దాం.

# ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



పిచ్చుకలను సంరక్షించాలన్న లక్ష్యంతో ఏటా మార్చి 20వ తేదీని పిచ్చుకల సంరక్షణ దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపు కుంటున్నారు. మొట్టమొదటి ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని 2010లో పాటించారు. అంతర్జాతీయంగా పిచ్చుకల సంరక్షణ కోసం ఈ దినోత్సవాన్ని నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా.. ఫ్రాన్స్‌కు చెందిన ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్, ఇతర జాతీయ, అంతర్జాతీయ సంస్థల తోడ్పాటుతో నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా అంతరించి పోతున్న సహజ జీవవైవిధ్యం, జాతుల సంరక్షణ అవసరాన్ని గుర్తించి, వాటిని కాపాడు కోవడానికి ప్రజలను ఏకం చేయడమే ఈ పిచ్చుకల దినోత్సవ ముఖ్యోద్దేశం.

ఒకప్పుడు సూర్యోదయానికి పూర్వమే, ఆహ్లాద వాతావరణాన్ని కల్పిస్తూ, గూళ్ళల్లో నుండి బయటకు వచ్చి, కళ్లు తెరవగానే కనిపించే ముద్దులొలికే పిట్టల కిచకిచల ధ్వనులు నేడు కరువయ్యాయి. పిచ్చుకలు ఒకనాడు పంట చేలల్లో, పల్లె ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసేవి. నాడు గ్రామాల లోని ఇళ్ల ముంగిట ఇవి గుంపులుగా వాలడం ఏదో అలికిడి అవగానే తుర్రుమని ఎగరడం వంటి దృశ్యాలు సందడిగా చూడముచ్చటగా ఉండేవి. చెట్లపై కట్టుకున్న గూళ్లు చాలా అద్భుతంగా ఉండేవి. జనావాసాలతో మమేకమై జీవిస్తున్న వీటి విషయాలలో ఇవి మెత్తని పీచు వట్టి వాటితో గూడు కట్టడం, గుడ్లను పొదగడం, నోటితో ఆహారాన్ని తెచ్చి పిల్లలకు అందించటం, ఆ పిల్లలు రెక్కలొచ్చి ఎగిరెంత వరకు జాగ్రతగా కాపాడటం మనకు తరచూ కనిపించే దృశ్యాలు, ఈ దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయి.

జీవన శైలిలో పెనువేగంగా వచ్చిన మార్పే 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'గా పరిణమించింది. పిచ్చుక జాతి అంతరించనుంది. శరవేగంగా పట్టణీకరణ, అంతరిస్తున్న పచ్చదనం, రసాయనాలతో పళ్లు, ఆహార ధాన్యాల ఉత్పత్తి. పిచ్చుకలు అంతరించి పోవడానికి కారణాలు. ఒకప్పుడు చైనాలో పిచ్చుకలంటే చీడ పురుగులుగా భావించే వారట. పంటలను నాశనం చేస్తున్నాయని, ఆహార ధాన్యాలను అధికంగా తినేస్తున్నాయనే అపోహతో చైనాలో పిచ్చుకల జాతిని నాశనం చేయడానికి నడుం బిగించి, తగిన చర్యలు తీసుకున్నారట. ఫలితంగా చైనాలో అతి తక్కువ సమయంలో పిచ్చుకలు మొత్తం నశించాయట. వాస్తవానికి పిచ్చుకల ఆహారం పంట పొలాలపై దాడి చేసే చిన్న చిన్న పురుగులు, క్రిమికీటకాలు. ఈ సంగతి గ్రహించని చైనీయులు వాటిని వినాశాన్ని కోరుకున్నారు. పిచ్చుకలు లేని కారణంగా పంటలకు మరింతగా పురుగుపట్టి 1958-61 మధ్య కాలంలో చైనా తీవ్రమైన ఆహార కొరతను అనుభవించిందట. చైనా కమ్యూనిస్టు ప్రభుత్వం ప్రపంచానికి తెలియకుండా రహస్యంగా ఉంచిందని చెపుతుంటారు.

గతంలో ఊర పిచ్చుకలు పల్లెటూర్లల్లో విరివిగా వుండేవి. రైతులు పిచ్చుకల ఆహారం కొరకు వరి కంకులను గుత్తులుగా కట్టి ఇంటి చూరుకు వేలాడదీసే వారు. రైతులు జొన్న, సజ్జ తదితర సంప్రదాయ పంటలను సాగు చేస్తుండేవారు. వాటిని తిని పక్షులు జీవించేవి. అయితే ప్రస్తుతం పత్తి తరహా వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గు చూపిస్తుడడంతో పిచ్చుకలకు ఆహారం కరువైంది. ప్రస్తుతం పంటలు లేక ఆహారం కరువై, పూరిళ్ల స్థానంలో సిమెంట్ గృహాలు, ఇంకా అనేక కారణాల వలన పల్లెల్లో అవి కనబడడం లేదు. పిచ్చుకలో ఇంచుమించు 35 జాతులు ఉంటే, అవి కాలక్రమేణ కనుమరుగు అవుతున్నాయి. పిచ్చుకల ఉనికికి ఏర్పడుతున్న ప్రమాదాల నివారణకు ప్రపంచ దేశాలు ప్రతి సంవత్సరం మార్చి 20 న ప్రపంచ పిచ్చుకల దినోత్సవమును నిర్వహిస్తున్నాయి. అందుకు అవసరమైన కార్యక్రమాలను చేపడుతున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా ఈ బిళ్లను కూడా విడుదల చేసింది.

పర్యావరణాన్ని కాపాడే ఈ పిచ్చుకల జాతిని సంరక్షించుకు నేందుకు అందరూ నడుం బిగించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పల్లెల్లో నివసించే వారు ఊరపిచ్చుకల గూళ్లు కనబడితే వాటిని జాగ్రత్తగా సంరక్షించు కోవాలి. కృత్రిమమైన పిచ్చుకగూళ్లను ఏర్పాటు చేయడం ద్వారా పిచ్చుక జాతిని కొంతవరకు సంరక్షించ వచ్చని శాస్త్రవేత్తల సలహా. పిచ్చుకల సంరక్షణను ప్రోత్సహించేందుకు ఎన్ఎఫ్ఎస్ సంస్థ పిచ్చుకల అవార్డులను కూడా అంద జేస్తున్నది.

# విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన న్యూటన్

అధునిక సైన్సును కొత్త పుంతలు తొక్కించిన మహనీయుడు న్యూటన్. గణిత శాస్త్రంలోనూ అంతటి ప్రతిభాశాలి, ప్రభావశీలి మరొకరు లేరు. ఆయన కాలంలో ఆయనను ప్రకృతి తాత్వికులుగా పిలిచేవారు.

మానవ ప్రపంచానికి విశ్వ రహస్యాలను విడమర్చి చెప్పిన "సర్ ఐజాక్ న్యూటన్" ఒక ఆంగ్ల భౌతిక, గణిత, ఖగోళ శాస్త్రవేత్త. ఆయన ఓ సిద్ధాంత కర్త, తత్వవేత్త కూడా. ప్రకృతి సిద్ధమైన తత్వ శాస్త్రం సైన్సుగా ఎలా పరిణామం చెందిందన్న అంశంపై చేసిన ఎనలేని కృషికిగానూ ఆధునిక ప్రపంచం ఆయనను "సైన్సు పితామహుడు"గా కీర్తించింది. ప్రపంచం లోనే మేటి శాస్త్రవేత్తల్లో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. ఈ రోజు అంతరిక్షంలోకి రాకెట్లలో రివ్వున దూసుకెళ్తున్నామంటే, అందుకే న్యూటన్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే కారణం. విశ్వ రహస్యాలను మానవాళికి విశ్లేషించి చెప్పిన న్యూటన్ జనవరి 4, 1643వ సంవత్సరంలో ఇంగ్లండ్‌కు దగ్గర్లో గల ఉల్‌తోప్ అనే గ్రామంలో ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించారు. న్యూటన్ చిన్నప్పుడు స్కూల్లో చదువుకంటే ఇతర సైన్సు పుస్తకాలు చదవటం, పెద్ద వస్తువుల్ని చూసి వాటినే చిన్న సైజులో తయారు చేయటం లాంటి పనులు చేస్తుండేవారు. అలా చిన్న చిన్న మిషన్లు, నీటి గడియారం, ఎండలో పనిచేసే గడియారం లాంటివి కూడా ఆయన తయారు చేశారు. ఆయన చేతిలో రూపుదిద్దుకున్న ఈ వస్తువులన్నీ ఇప్పటికీ లండన్ రాయల్ సొసైటీ మ్యూజియంలో భద్రంగా ఉన్నాయి. గణితంలో న్యూటన్ పట్ల ఎంతో ఆసక్తి చూసిన ఒక ఉపాధ్యాయుడు, న్యూటన్ ను ఉన్నత విద్యను అభ్యసించడానికి విశ్వ విద్యాలయానికి పంపండని న్యూటన్ తల్లికి గట్టిగా చెప్పారు. ఆ ఉపాధ్యాయుడు న్యూటన్ విద్యకు అయ్యే ఖర్చును భరించటానికి అంగీకరించారు. న్యూటన్ జూన్ 1661 లో ఉన్నత విద్య కోసం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో చేరిన న్యూటన్.. గణిత, భౌతిక, ఖగోళ శాస్త్ర పరిశోధనలపై మక్కువ పెంచుకున్నారు. చిన్నతనంలో చెట్టు నుంచి రాలిన యాపిల్‌ను గమనించిన న్యూటన్ అందుకు కారణాన్ని అన్వేషించే క్రమంలో గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. లైబ్రరీ లో చాలా సమయం అతను పుస్తక పఠనంలో గడిపేవారు. పూర్తి సమయం లెక్కలు మరియు భౌతిక శాస్త్రం అభ్యాసానికే వినియోగించారు. ఒక్కొక్కసారి తిండి నిద్ర కూడా మరిచే వారు. న్యూటన్ యూనివర్సిటీలో గ్రీకు, లాటిన్, హిబ్రు భాషలను, లాజిక్, జ్యామితి మరియు త్రికోణమితి లను ఎంచుకున్నారు. లైబ్రరీలో న్యూటన్ తరచుగా మేధావులైన కెప్లర్ మరియు ఇతరులు రాసిన / తయారు చేసిన గొప్ప ప్రయోగాలపై అధ్యయనం చేసేవారు. ఆ తరువాత అక్కడే ప్రొఫెసర్‌గా నియమితుడైన న్యూటన్, 1667లో పరావర్తన దూరదర్శినిని నిర్మించి సంచలనం సృష్టించారు. ప్రొఫెసర్ న్యూటన్ విశ్లేషణాత్మక జ్యామితి, బీజగణితం, మరియు క్యాల్కులస్ రంగాలమీద తన దృష్టి సారించారు. బైనామినల్ సిద్ధాంతం, అనంతం సిరీస్ విస్తరణ కోసం కొత్త పద్ధతులు, %టశ్రీబఇఱశీఅం% యొక్క ప్రత్యక్ష మరియు విలోమ పద్ధతులు ఇవీ ఆ కాలంలో ఆయన చేసిన ప్రధాన ఆవిష్కరణలు. న్యూటన్ 1665 నుండి 1666 వరకు కాంతి అధ్యయనం మీద దృష్టి



కేంద్రీకరించారు. భూమి, చంద్రుడు, గ్రహాలు, సూర్యుడు సహా విశ్వంలోని వస్తువులపై గురుత్వ శక్తి ఎలా పని చేస్తుందో వివరిస్తూ విశ్వ గురుత్వ నియమాన్ని ప్రతిపాదిస్తూ, గమన సూత్రాలను నిర్వచించారు. గురుత్వాకర్షణ శక్తి గురించి, న్యూటన్ ప్రతిపాదించిన మూడు గమన నియమాల గురించి ప్రస్తావించారు. తరువాతి మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఆయన పరిశోధన ఫలితాలే పునాదిగా ఉన్నాయి. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాల మీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ మరియు గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. దీంతో సూర్య కేంద్రక సిద్ధాంతంపై పూర్తిగా అనుమానం తొలిగి పోవడమే కాకుండా ఆధునిక సైన్సు అభివృద్ధి కొత్త పుంతలు తొక్కింది. విజ్ఞాన శాస్త్ర రంగం మీదకు ఐన్ స్టయిన్ వచ్చేదాకా మూడు దశాబ్దాల పాటు శాస్త్ర సామ్రాజ్యాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మేధావి ఐసాక్ న్యూటన్. ఇప్పటికీ ఆయన చలన సూత్రాలు కొన్ని పరిమితులకు లోబడి సజావుగా పనిచేస్తోనే ఉన్నాయి. (1). మొదటి సూత్రము... "బాహ్యబల ప్రయోగము లేనంత వరకు చలన స్థితిలో ఉన్న వస్తువు చలన స్థితిలోను, నిశ్చల స్థితిలో ఉన్న వస్తువు నిశ్చల స్థితిలోనూ ఉంటుంది". ఈ వస్తు ధర్మాన్ని జడత్వము అంటారు. (2). రెండవ సూత్రము... "ఒక వస్తువు ద్రవ్య వేగంలోని మార్పు ఆ వస్తువు పై ప్రయోగించిన బలానికి అనుపాతముగా ఉంటుంది. మరియు ఆ బలం ప్రయోగించిన దిశలో ఉంటుంది". (3). న్యూటన్ మూడవ నియమం..."చర్యకు ప్రతి చర్య సమనంగా ఉండి వ్యతిరేక దిశలో పనిచేయును". భౌతిక శాస్త్ర భావనలను వివరిస్తూ "ప్రిన్సిపియా మేథమేటికా" అనే గ్రంథాన్ని రచించారు. కాంతిపై న్యూటన్ చేసిన పరిశోధనల ఫలితంగా "దృశాశాస్త్రం" పుట్టింది. మూడు శతాబ్దాల పాటు భౌతిక ప్రపంచానికి సైన్సు దృక్కోణంగా వెలుగొందిన యాంత్రిక శాస్త్రానికి తరువాత ఆధునిక ఇంజనీరింగ్ కూ ఈ గ్రంథమే పునాది. ఏదైనా ఒక వస్తువు యొక్క గమనం, భూమి మీదైనా లేక ఇతర గ్రహాలమీదైనా ఒకే రకమైన నియమాల మీద ఆధారపడి ఉంటుందని నిరూపించారు. దీనికి ఆధారంగా కెప్లర్ నియమాలకూ, గురుత్వాకర్షణ సిద్ధాంతాలకూ గల సామ్యాన్ని దృష్టాంతంగా చూపారు. ఆయనకు 1672లో రాయల్ సొసైటీ ఫెలోషిప్ లభించింది. అప్పటి వరకూ ప్రకృతి శాస్త్రంలో ఒక భాగంగా ఉన్న భౌతిక శాస్త్రాన్ని న్యూటన్ ఆవిష్కరణలు, సిద్ధాంతాల వల్ల ప్రత్యేక శాస్త్రంగా గుర్తించారు. అందుకే న్యూటన్‌ను "భౌతిక శాస్త్ర పితామహుడు" అంటారు. 1705లో బ్రిటిష్ ప్రభుత్వం "సర్" అని బిరుదునిచ్చి సత్కరించింది. ఇక అప్పటి నుంచి ఐజాక్ న్యూటన్ "సర్ ఐజాక్ న్యూటన్"గా పేరెన్నిక గన్నారు. తరువాత కూడా ఎన్నో మైలు రాళ్లను అధిగమించిన న్యూటన్ తన 85 సంవత్సరాల వయస్సులో మార్చి 20, 1727న మరణించారు.

## నోరు మంచిదైతే ఊరు మంచిదే!

ప్రపంచవ్యాప్తంగా 3.5 బిలియన్ల ప్రజలు నోటి సంబంధ అనారోగ్యాలతో సతమతం అవుతున్నారని, దంత సమస్యలు ప్రధానమైనవి తెలుస్తున్నది. నేటి ఆధునిక మానవ జీవితంలో నోటి శుభ్రతకు ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతున్నది. తీవ్రమైన నోటి అపరిశుభ్రత కారణంగా గుండె జబ్బులు, మధుమేహం, శ్వాస సంబంధ వ్యాధులు కలుగుతున్నాయి. దంతాలు, చిగుర్ల ఆరోగ్య సంరక్షణ పట్ల ప్రజలకు అవసరమైన సరళ జీవనశైలి మార్పుల గూర్చి అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 20 మార్చి రోజున "ప్రపంచ నోటి ఆరోగ్య లేదా శుభ్రత దినం (వరల్డ్ ఓరల్ హెల్త్ డే)" నిర్వహించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ నోటి శుభ్రత దినం ఇతివృత్తంగా "ఆనందమయ నోటి శుభ్రతతో సంతోషకరమైన మెదడు (ఏ హ్యాపీ మౌత్ ఈజ్%ూ% ఏ హ్యాపీ మైండ్)" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నోటి శుభ్రతను అశ్రద్ధ చేసినపుడు చిగుర్ల వ్యాధులు, క్యావిటీలు ఏర్పడడం, దంతాలు ఊడిపోవడం జరగడంతో నోటి దుర్వాసన వల్ల నవ్వుతూ మాట్లాడకపోవడం, సమాజంలో భయంతో గడపడం, ఆత్మవిశ్వాసం తగ్గడం, మానసిక ఆరోగ్యానికి అడ్డుపడడం జరుగుతుంది. నోటి అనారోగ్యాలు దీర్ఘకాలం కొనసాగితే ఆందోళన, ఒత్తిడి కలుగుతూ జీవన నాణ్యత కొరవడడం జరుగుతుంది. నోటి ఆరోగ్యంతో దంత వ్యాధుల కట్టడి, గుండె జబ్బులు/మధుమేహం/శ్వాస వ్యాధుల కట్టడి, జీర్ణ క్రియ పెరగడం లాంటి విలువైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. నోటి శుభ్రత కోసం ప్రతి రోజు రెండు సార్లు బ్రష్ చేసుకోవడం, దంతాల్లో ఆహారం ఇరుక్కోకుండా జాగ్రత్త పడడం, తిన్నపుడు లేదా తాగినపుడు మౌత్ వాష్ చేసుకోవడం, చక్కెరలు/అమ్ల ఆహారాలను తగ్గించుకోవడం, సాఫ్ట్ బ్రష్‌లను వాడడం, సదా హైడ్రేట్ కావడం, తరుచుగా దంత వైద్యులను సంప్రదించడా లాంటి దినచర్యను పాటించాలి. ఈ విషయాల గూర్చి ఇతరులకు అవగాహన కల్పించడం వల్ల నోటి ఆరోగ్య భాగ్యాలు సిద్ధించి చిరునవ్వులతో జీవితాలను సుసంపన్నం చేసుకుందాం.

# హరితహారం మొక్కలు అగ్గిపాలు...

## పట్టించుకోని వైద్యాధికారులు.

భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 19 (వుదయం ప్రతినిధి)తెలంగాణ లో గత ప్రభుత్వం చేపట్టిన అటవీకరణ కార్యక్రమం. హరితహారం 2015 జూలై 3న ప్రారంభించబడింది. తెలంగాణలో మొత్తంలో (తెలంగాణ భూభాగంలో 33%) మొక్కలను నాటి, పచ్చదనం కనిపించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని రూపొందించింది. అటవీ ప్రాంతంలోనే కాకుండా రహదారులకు ఇరువైపులా, విద్యాలయాల్లో, పోలీస్ ప్రాంగణాల్లో, మార్కెట్ యార్డుల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో, శ్మశాన వాటికలు, గ్రేవ్ యార్డుల్లో, పరిశ్రమల్లో, పారిశ్రామిక వాడల్లో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాల్లో వంటి అనేక చోట్ల పచ్చదనాన్ని కోరుతూ ప్రభుత్వం కోట్లలో డబ్బులు వెచ్చించి హరితహారం కార్యక్రమాన్ని చేపట్టిన విషయం విధితమే అంతేకాకుండా గ్రామాలలో నర్సరీలను ఏర్పాటు చేసి వివిధ విత్తనాలతో మొక్కలను పెంచుతూ ఎంతో జాగ్రత్తగా వాటిని పర్యవేక్షిస్తూ మొక్కలుగా ఏర్పడిన తర్వాత మొక్కలను నాటి పచ్చదనాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా కొంతమంది నిర్లక్ష్యంతో పచ్చదనంతో ఉండవలసిన మొక్కలు చెట్లు అగ్నిలో ఆహుతి అవుతున్నాగాని పట్టించుకోకపోవడంతో విమర్శలకు తావిస్తున్నాయి వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చండ్రుగొండ గ్రామపంచాయతీ పరిధిలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో వందల సంఖ్యలో చెట్లు మంటల్లో తగలబడి ఆహుతి అయిపోయాయి. ఇంత జరుగుతున్న అక్కడున్న సిబ్బంది పట్టించుకోకపోవడం పై స్థానికులు ఆస్పత్రి సిబ్బందిని ప్రశ్నించగా ఉదయం ఓపి సమయంలో ఆస్పత్రిలో డాక్టర్ తో పాటు అందరూ సిబ్బంది ఉండగానే చెట్లు నిప్పంటుకొని కాలిపోతుంటే ఏ ఒక్కరూ గమనించలేదని చెప్పడం గమనార్ధం. ఏదైనా




చెత్తలో కొంచెం మంట వస్తేనే ఆ చుట్టుపక్కల ప్రదేశం అంతా పొగతో నిండిపోయి ఊపిరాడకుండా అవుతుంది అలాంటిది ఆ ప్రదేశం మొత్తం కాలిపోతున్న వాళ్ల కంట కనబడకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది ప్రభుత్వం కోట్ల రూపాయల సొమ్ము వెచ్చించి పచ్చదనాన్ని పెంచే దిశగా కార్యక్రమాలు చేపడుతుంటే నాటిన చెట్లని కాపాడుకోవాల్సిన ఆస్పత్రి సిబ్బంది ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం స్థానికులు నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రిలో 24 గంటలు మూడు షిఫ్టుల్లో సిబ్బంది ఉండగా ఉదయం సమయంలోనే అన్ని మొక్కలు కాలిపోతున్న చూడని సిబ్బంది రాత్రి సమయాల్లో ఏదైనా ప్రమాదాలు సంభవించిన తమకేమీ పట్టనట్లు ఉంటారేమో అని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఆస్పత్రిలో ఉద్యోగాలు చేసే డాక్టర్లు, సిబ్బంది కూడా ఆసుపత్రికి సరైన సమయానికి రాక రోగులు



చాలాసేపు వేచి ఉండవలసిన పరిస్థితి నెలకొంటుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు .ఇలా ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంతో ఆస్పత్రికి ఆనుకొని ఉన్న చెట్లు మంటల్లో కాలిపోయాయి దురదృష్టవశాత్తు హాస్పిటల్ లో కూడా మంటలు వ్యాపించి ఉంటే చాలా ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరిగి ఉంటే పరిస్థితి ఏంటని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మరియు వైద్య సిబ్బంది సరైన సమయానికి ఆసుపత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

వైద్యాధికారి వివరణ కోరక

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో జరిగిన అగ్ని ప్రమాదం గురించి ఉదయం ప్రతినిధి వైద్యాధికారి వివరణ కోరగా ఉదయం ఓపి సమయంలోనే మంటలు చెలరేగాయని రోగుల సంఖ్య ఎక్కువ ఉండడంతో మేము అంతా గమనించలేదు మేము చూసే లోపే చెట్లు అన్ని కాలిపోయాయని అన్నారు.

## విద్యా వాలంటీర్ల జీతాల కోసం ఆర్థిక సాయం చేసిన సింగిల్ విండో మాజీ చైర్మన్ సంకాపురం రాముడు



అలంపూర్ మార్చి 19 (వుదయం ప్రతినిధి) అయిజ మండలం లోని సంకాపురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో అదనపు ఉపాధ్యాయుల జీతాల కోసం మాజీ సింగిల్ విండో అధ్యక్షులు సంకపురం రాముడు 60వేల రూపాయలు ఆర్థికసాయం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అదనంగా విద్యా వాలంటీర్ల గౌరవ వేతనం కోసం సొంతంగా 60వేల రూపాయలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ చేతికి ఇతర ఉపాధ్యాయుల సమక్షంలో నగదును అందజేశారు. ఉదారంగా మానవీయ కోణంలో విద్యకు ఆర్థిక సాయం చేసిన సంకాపురం రాముడు ను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఛైర్మన్ సరస్వతి మల్లేష్, గోపాల్, ఆనందరెడ్డి, పెద్ద ఈరన్న, కుమ్మరి జయన్న, అన్నమయ్య, ఈశ్వర్, జగదీశ్ గౌడ్, తిమ్మారెడ్డి, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్టు ద్వారా భద్రాచలం రాముల వారి తలంబ్రాలు

### పోస్ట్ మాస్టర్ సూర్యనారాయణ



అలంపూర్ మార్చి 19 (వుదయం ప్రతినిధి) శ్రీరామనవమి సందర్భంగా మన తపాల శాఖ ద్వారా భద్రాచలం శ్రీ రాముల వారి కళ్యాణమును పురస్కరించుకుని అన్ని పోస్టాఫీసులలో భద్రాచలం శ్రీ సీతారామ దేవస్థానంలో జరిగే శ్రీ సీతా రాముల కళ్యాణానికి సంబంధించిన ముత్యాల తలంబ్రాలను అన్ని హెచ్.ఓ/యస్.వో/బ్రాంచ్ పోస్టాఫీస్ లలో ఇంటి వద్దకే స్పీడ్ పోస్ట్ ద్వారా ప్రసాదాలు అందించడానికి తపాలా శాఖ సన్నాహాలు చేసిన విషయం మనకు తెలిసిందే. ఇందుకుగాను అంతరాలయ అర్చన తలంబ్రాలు రూ. 450/- రూపాయలు, ముత్యాల తలంబ్రాలు రూ. 150/- రూపాయలకు స్పీడ్ పోస్ట్ ద్వారా భక్తుల ఇంటి వద్దకి వచ్చే అవకాశాన్ని పోస్టల్ శాఖ రూపొందించిందని తెలిపారు. ఈ సదావకాశాన్ని పోస్ట్ మాస్టర్లు, సబ్ పోస్ట్ మాస్టర్లు, ఎమ్‌ఓ లు, బిపిఎమ్ లు, ఏ బి పి ఎమ్ లు, డాక్ సేవక్ లందరూ ప్రజలకు తెలియ పరచి అధిక మొత్తంలో బుకింగ్స్ నమోదు చేయగలరని తెలిపారు.

భక్తుల వివరాలు పూర్తి పేరు, చరవాణి నెంబర్, చిరునామా, గోత్రనామాలు ఎస్ పి ఎమ్ లకు, బి పి ఎం లకు తెలియజేయగలరని అయిజ సబ్ పోస్ట్ మాస్టర్ సూర్య నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్, పోస్ట్ మాన్ తరుణ్, తేజశ్రీ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయురాలు బి దీప



నారాయణపేట టౌన్ మార్చ్ 19( వుదయం ప్రతినిధి)ఆల్ ఇండియా సివిల్ సర్వీసులో జాతీయ స్థాయి ఖో ఖో పోటీలకు మాగనూరు మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు బి దీప ఎంపికైనట్లు డి ఎస్ ఓ వెంకటేష్ శెట్టి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత జనవరి 23, 24 తేదీలలో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ మహిళా రాష్ట్ర స్థాయి కోకో పోటీలలో పాల్గొని క్రీడా ప్రతిభను క్రీడా నైపుణ్యతను ప్రదర్శించి జాతీయస్థాయి సివిల్ సర్వీసెస్ ఖో ఖో పోటీలకు ఎంపిక అయ్యారని తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఈనెల 21 నుండి 24 వరకు న్యూఢిల్లీలో జరుగు జాతీయ స్థాయి ఖో ఖో పోటీలలో పాల్గొనున్నారు. ఈమె మక్తల్ మండల కేంద్రంలోని (జిపి) ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన మాగనూరు మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు బి దీపను నారాయణపేట జిల్లా క్రీడల అధికారి డిఎస్ఓ వెంకటేష్ శెట్టి ,మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, మాగనూరు,మక్తల్ మండలం ఎంఈఓలు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

## మందక్రిష్ణ మాదిగ పోరాటం వల్లనే వర్గీకరణ జరిగింది....



చండ్రుగొండ, మార్చి19( వుదయం ప్రతినిధి ) ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర అసెంబ్లీలో చట్టబద్ధత పొందటం ఇది కేవలం మందక్రిష్ణ మాదిగ పోరాటం వల్లనే సాధ్యమైందని ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు చాలపమడుగు వెంకటేశ్వర్లు స్పష్టం చేశాడు. బుధవారం ఎంఆర్పిఎస్ మండల కమిటి ఆద్వర్యంలో చండ్రుగొండ ప్రధాన సెంటర్లో మంద క్రిష్ణ మాదిగ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..... రాష్ట్ర అసెంబ్లీలో వర్గీకరణ బిల్లుకు సహకరించిని అన్ని రాజకీయపార్టీలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పోరాడితేనే హక్కులు సాధించవచ్చున్నారు. కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు..

## రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి: గోలి మధుసూదన్ రెడ్డి

### కిసాన్ మోర్చా పొలం బాట కార్యక్రమం.....

### ఎండిన వరి పంట కు ఎకరాకు 30 వేల నష్టపరిహారం ఇవ్వాలి



చిట్యాల మార్చి 19(వుదయం ప్రతినిధి)బీ పిల్లాయిపల్లి,ధర్మారెడ్డి కాలువలను సత్వరమే పూర్తి చేసి సాగునీరు అందించాలి అని బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి అన్నారు. చిట్యాల పరిధిలోని శివనేనిగూడెం గ్రామంలో బుధవారం నాడు ఎండిన వరి పొలాలను బిజెపి కిసాన్ మోర్చా పొలం బాట కార్యక్రమంలో ఆయన పాల్గొని ఎండిన వారి పంట పొలాలను పరిశీలించి అనంతరం మాట్లాడుతూ. గర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు ఎండిపోయి నీళ్లు లేక పంట పొలాలు పూర్తిగా పోయిన అన్నదాతలను గుర్తించి ఎకరానికి 30 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఫసల్ బీమా యోజన పథకం ఈ రాష్ట్రంలో ప్రవేశ పెట్టకపోవడంతో పంటలు పైథాన్ గానికి తీవ్ర నష్టం వాటిలిందని వాపోయారు. ఇప్పటికైనా పసల్ బీమా యోజనను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థాయిలో అధికారులు గ్రామాలలోకి వెళ్లి నష్టపోయిన వరి పంటలను పరిశీలించి అంచనావేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి పట్టణాధ్యక్షుడు గుండాల నరేష్ గౌడ్,నకిరేకల్ అసెంబ్లీ ఇన్చార్జి నకిరికంటి మొదలయ్య, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కన్నబోయిన మహలింగం యాదవ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న కిసాన్,కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్,దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, అంశాల అనిల్ కుమార్, పల్లె వెంకన్న గౌడ్,చంద్రారెడ్డి, రామరాజు నాగరాజు, కన్నెబోయిన మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

### జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి మార్చి 19(వుదయం ప్రతినిధి) ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమైనదని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిదీ అని ఆయన సూచించారు.గత సంవత్సరం నవంబర్ నుండి ఈ నెల 18వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు ఫారం 6 ద్వారా 1040 దరఖాస్తులు రాగా 973 విచారణ పూర్తి చేశారని, 67 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఫారం 7 కు 859 రాగా 791 విచారణ జరిగిందని 68 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. చిరునామా మార్పు కు 950 దరకాస్తులు వచ్చాయని వాటిలో 916 విచారణ పూర్తి కాగా 34 పెండింగ్ ఉన్నాయన్నారు. కరెక్షన్స్ కొరకు 1962 దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఇప్పటి వరకు 1846 విచారణ పూర్తి కాగా 116 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాభితా తయారుకు రిటర్నింగ్ అధికారి ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూతు స్థాయి ఏజెంట్లను నియమించి జాభితా అందచేయాలని సూచించారు. ఫారం 7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్రమే ఓటు హక్కు తొలగించాలని, సుమోటో గా తొలగించడానికి అవకాశం లేదని తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు కాబట్టి, ప్రతి అర్హుడు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, ఇమామ్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి



జయశంకర్ భూపాలపల్లి మార్చి 19(వుదయం ప్రతినిధి) కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలుగుల గ్రామ శాఖ అధ్యక్షుడు మానేం మహేష్ అన్నారు బుధవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే అన్ని వర్గాలకు సంబంధించిన ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతాయని అన్నారు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కులాల వారిగా రిజర్వేషన్లు ప్రకటించారని అన్నారు మళ్లీ ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలోనే రిజర్వేషన్ల శాతం పెంచడం జరుగుతుందని అన్నారు గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న ఎస్సీలకు సంబంధించి పరిష్కారం తోపాటు ఎస్సీలకు ఫలితం కాంగ్రెస్ ప్రభుత్వం లోనే లభించిందని అన్నారు అదేగాక రాష్ట్రంలోని బీసీ ప్రజలను దృష్టిలో పెట్టుకొని వారి అభ్యున్నతి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడం సంతోషకరమైన విషయం అని అన్నారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్ కి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు బీసీ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు పాటు ధన్యవాదాలు తెలిపారు.

## బిసి బిల్లు పై పేటలో పాలాభిషేకం



నారాయణపేట టౌన్ మార్చ్ 19( వుదయం ప్రతినిధి) బీసీ బిల్లు పై నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పాలభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ లకు చట్టసభల్లో ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన సందర్భంగా నారాయణపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ తల్లి సోనియా గాంధీ, జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి చిత్రపటాలకు సత్యనారాయణ చౌరస్తాలో పాలాభిషేకం చేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని ఇందులో భాగంగా నేడు అసెంబ్లీ సమావేశాలలో బీసీ బిల్లులు ఆమోదించడం హర్షించదగ్గ విషయం అన్నారు. నారాయణపేట పట్టణంతోపాటు ధన్వాడ, దామరగిద్ద తదితర మండలాలలో సైతం పాలాభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి, మాజీ చైర్మన్ సరాఫ్ నాగరాజు, బండి వేణు గోపాల్, మాజి కౌన్సిలర్లు బోయ రమేష్, ఎండి సలీం, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షులు ఏ కాంత్ కుమార్ , ఆర్టిఏ సభ్యులు పోషల్ రాజు,గౌస్ లతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లు స్వరాజ్యం జీవితం నేటి మహిళలకు ఆదర్శప్రాయం


### సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య

### ఘనంగా మల్లు స్వరాజ్యం వర్ధంతి



చిట్యాల మార్చి 19(వుదయం ప్రతినిధి)బీ పేదల పక్షాన నిలబడి, నిజాం నవాబు పాలనను సవాల్ చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం నేటి మహిళలకు ఆదర్శం ప్రాయమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య లు అన్నారు. చిట్యాల మండల కేంద్రంలో బుధవారం నాడు స్థానిక మేకల లింగయ్య స్మారక భవనంలో జరిగిన కా, మల్లు స్వరాజ్యం వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. తుంగతుర్తి శాసనసభ నియోజకవర్గం నుండి రెండు పర్యాయాలు యం యల్ ఏ గా, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు గా పని చేసి ఎన్నో హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారని కొనియాడారు. బొబ్బలి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, మండల నాయకులు అరూరి శ్రీను, ఐతరాజు నర్సింహా, యాదయ్య, అక్కెనపల్లి నాగయ్య,జిట్ట స్వామి, గుడిసె లక్ష్మినారాయణ, ఏళ్ల మారయ్య, పాలమాకుల అర్జున్, రుద్రారపు పార్వతమ్మ, కడగంచి అండాలు, నారాయణ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ రంగం జిల్లా నూతన కమిటీ ఎన్నిక





జయశంకర్ భూపాలపల్లి మార్చి 19(వుదయం ప్రతినిధి) బిల్డింగ్ రంగం జిల్లా నూతన కమిటీ ఎన్నిక నిర్వహించినట్లు నూతనంగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎనికైనా కుదుదుల వెంకటేష్ బుధవారం ఒకప్రకటనలో పేర్కొన్నారు టీఎస్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగినట్లు పేర్కొన్నారు జయశంకర్ జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ ఉపాధ్యక్షులు జిల్లపల్లి సతీష్ ఉపాధ్యక్షులు చిలకాని రాజయ్య ఉపాధ్యక్షులు శ్రీపతి అనసూర్య ప్రధాన కార్యదర్శి కుదుదుల వెంకటేష్ సహాయ కార్యదర్శి బల్ల శ్రావణ్ కుమార్ సహాయ కార్యదర్శి బండారి లావణ్య సహాయ కార్యదర్శి లక్ష్మీరాజ్యం కోశాధికారి ఈర్ల రవి కార్యవర్గ సభ్యులు శ్రీపతి మమత కుమ్మరి బాబు భైరవైన ఓదెలు రాణి మేకల సమ్మయ్య కుంచాల రమేష్ మిట్టికాల వీరాంజనేయులు కౌన్సిల్ సభ్యులు జోడే స్వామి శ్రీపతి అనిత కాయిత పద్మ ఉదరగట్టయ్య సూదుల రాజేశ్వరి మొత్తం 21 మందితో కమిటీ ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న బిల్డింగ్ కనెక్షన్ రంగంలో పనిచేస్తున్న కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొన్నారు అని అన్నారు ఈ కమిటీకి సహకరించిన జిల్లా కార్మిక వర్గానికి అధ్యక్ష కార్యదర్శులు ధన్యవాదాలు తెలిపారు.

## నూతన రేషన్ కార్డు లు జారి చేసిన తరువాతనే యువ వికాస్ పథకాన్ని ప్రారంభించాలి



చంద్రుగొండ మార్చి 19 :(వుదయం ప్రతినిధి ) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిన్న అమలులో తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పేరిట నిజమైన అర్హులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీ నాయక్ , బీజేపీ పార్టీ నాయకులు శ్రీనివాస్ నాయక్ లు అన్నారు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం లో రేషన్ కార్డు విషయం లో కొత్తగా పెళ్లి చేసుకున్న జంట వాళ్ళ తల్లి దండ్రుల పాత రేషన్ కార్డు లో పేరు లేకపోతేనే కొత్త రేషన్ కార్డులు వస్తాయి అనగానే అందరూ పాత రేషన్ కార్డు లో వాళ్ళ పేర్లను డిలీట్ చేసుకున్నారు, ఇప్పటి వరకు నూతన రేషన్ కార్డు విషయం లో ప్రభుత్వం నుంచి ఎలాంటి చలనం లేదు ,ఇప్పుడు రేషన్ కార్డు లేకుండా రాజీవ్ యువ కిరణం అప్లికేషన్ అయితలేదు కానీ మాటలు మాత్రం కోటలు దాటుతున్నాయి అని మండి పడ్డారు దాదాపు 80 % చదువుకున్నా నిరుద్యోగ యువకులు అందరూ పెళ్లి చేసుకొని నూతన రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నారు ఇప్పుడేమో రాజీవ్ యువ కిరణం అప్లికేషన్ రేషన్ కార్డు లేకుండా మొదటి లోనే రిజెక్ట్ ఐతుంది రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నూతన రేషన్ కార్డు జారీ చేసిన తరువాతనే రాజీవ్ యువ వికాసం స్కీమ్ ను తీసుకురావాలి లేకపోతే నిజమైన అర్హులుకు అన్యాయం జరిగే అవకాశం ఉందని అన్నారు. ఇలా తలా తోక లేకుండా పథకాలు పెట్టి ప్రజలను, నిరుద్యోగులను ,యువకులను మభ్యపెట్టే కార్యక్రమం మానుకోవాలని సూచించారు ఇలానే జరిగితే త్వరలోనే విద్యార్థి సంఘం నాయకులను ,పార్టీ నేతలు అందరితో జిల్లాల వ్యాప్తంగా ధర్నాలు , రాస్తారోకోలు తప్పవని హెచ్చరించారు..

## వరంగల్ ఫోటో జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శం



హనుమకొండ, మార్చి 19(వుదయం జిల్లా ప్రతినిధి) : వివిధ దినపత్రికల్లో పనిచేస్తున్న వరంగల్ ఫోటో జర్నలిస్టులు తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శమని టియుడబ్ల్యూజె (ఎచ్ -143) హన్మకొండ జిల్లా శాఖ కొనియాడారు. కాంపిటేషన్ ఏదైనా... ఎక్కడైనా... వరంగల్ ఫోటో జర్నలిస్టులు గెలిచి నిలువడం తథ్యమని అన్నారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో బహుమతులు గెలుచుకున్న వరంగల్ ఫోటో జర్నలిస్టులు మరిన్ని విజయాలు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ బషీర్ బాగ్ లోని సురవరం ప్రతాప్ రెడ్డి ఆడిటోరియంలో సోమవారం తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్టుల అవార్డుల కార్యక్రమం జరిగింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవవర్మ చేతుల మీదుగా వరంగల్ జిల్లా ఫొటో జర్నలిస్టులు వీరగోని హరీష్, గొట్టె వెంకన్న, దాసరి శ్రీనివాసులు అవార్డులను అందుకున్నారు. ఈసందర్భంగా టి యు డబ్ల్యూ జె ( ఎచ్. 143) హన్మకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండ బాలసముద్రం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఫొటో జర్నలిస్ట్ లకు శాలువాల తో సత్కరించారు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షకార్యదర్శులు మస్కపురి సుధాకర్, అర్షం రాజ్ కుమార్. ప్రెస్ క్లబ్ కోశాధికారి బోళ్ళ అమర్, ఉపాధ్యక్షులు బొడిగె శ్రీనివాస్, జనగాని ఆంజనేయులు, మాడ నర్సయ్య, రమేష్,దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ బ్యాక్ లాక్ సీట్ల ప్రవేశాలకు ఆహ్వానం




(గద్వాల మార్చి 19 వుదయం ప్రతినిధి)మహాత్మా జ్యోతి బాపూలె తెలంగాణా వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బి.సి. బాలబాలికల పాఠశాలల్లో 2025-26 విద్యా సం?లో 6వ, 7వ, 8వ. మరియు 9వ తరగతి (ఆంగ్ల మీడియం) లో ఖాళీగా ఉన్న బ్యాక్ లాగ్ సీట్లకు ప్రవేశ ప్రకటన వెలువడింది. బి.సి, యస్.సి, యస్.టి, మరియు డి.పి, ఇ.బి.సి లకు చెందిన తెలంగాణకు చెందిన విద్యార్థినీ విద్యార్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గద్వాల స్కూల్ ప్రధానచార్యులు యం. అలివేల ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆన్లైన్లో మార్చి31 లోగా ధరఖాస్తులు చేసుకోవాలి. ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులను కోరడమైనది.

## నేతన్నకు రాష్ట్ర బడ్జెట్లో మొండి చెయ్యి చూపిన కాంగ్రెస్



గుండు వెంకటనర్సు

**చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి**

యాదాద్రి భువనగిరి/మార్చ్ 19 వుదయం పతినిధి :- మోత్కూర్ లో పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ.... ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికులందరికి ఉపాధికల్పిస్తామని, రాష్ట్రంలోని ప్రభుత్వ కార్యాలయలలో సిబ్బందికి కావలసిన బట్టలను చేనేత కార్మికుల ద్వారా ఉత్పత్తి చేయించి మెరుగైన ఆదాయం పొందేలా చర్యలు తీసుకుంటామని వాగ్దానం చేసిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలు గాలికి వదలివేయడంతో ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. చేనేత కార్మికులకు నేతన్న బీమా, నేతన్న భరోసా, నేతన్న పొదుపు, పథకాలను పునర్ ప్రారంభిస్తామని ప్రకటన చేసిన ప్రభుత్వం, సర్వేల పేరుతో కాలయాపన చేసి, కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తూ, లబ్ధిదారులను తగ్గించే కుట్రచేస్తుందని, హామీలు అమలు చేయకుండా ప్రకటనలతో కార్మికులను మభ్యపెట్టడుతుందని అన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి, సంక్షేమ పథకాల అమలు, చేనేత పరిశ్రమ రక్షణకు రాష్ట్ర బడ్జెట్లో 2000 కోట్ల రూపాయలు కేటాయించ వలసిఉండగా కేవలం 371 కోట్లు మాత్రమే కేటాయించి చేనేత కార్మికులను మోసం చేసిందని విమర్శించ్చారు..

## పాలసీలపై జిఎస్టి తొలగించి బోనస్ పెంచాలి

### హుస్నాబాద్ బ్రాంచ్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి



హుస్నాబాద్ మార్చి19(వుదయం ప్రతినిధి): భారతీయ జీవిత బీమా పాలసీలపై కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న జీఎస్టీ ని పూర్తిగా తొలగించి పాలసీదారులకు బోనస్ రేటు పెంచాలని హుస్నాబాద్ బ్రాంచ్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి డిమాండ్ చేశారు. బుధవారం రోజునభారతీయ జీవిత బీమా పాలసీదారులపై విధిస్తున్న జీఎస్టీ ని తొలగించి జీవిత బీమా సంస్థలో ఏజెంట్లుగా పనిచేస్తున్న ఏజెంట్ల న్యాయమైన కోరికలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలోని రామ్ లీలా మైదానం లో జరుగుతున్న శాంతియుత నిరసనకు మద్దతుగా హుస్నాబాద్ లియాఫీ ప్రధాన కార్యదర్శి వేముల వీరస్వామి నేతృత్వంలో పట్టణంలోని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయం ముందు బైఠాయించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా ఎల్ఐసి ఏజెంట్ నాయకులు మాట్లాడుతూ భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఇన్సూరెన్స్ రంగంలో ప్రజల మన్ననలు పొంది దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని, ఎల్ఐసి సంస్థను అన్ని వర్గాల ప్రజలకు చేరువ చేయడంలో ఏజెంట్ల పాత్ర మరువలేనిదని అన్నారు. ఏజెంట్ల న్యాయమైన కోరికలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఏజెంట్లు అన్నాడి మల్లారెడ్డి, వెల్దండి రాజేంద్రప్రసాద్,కక్కర్ల మల్లికార్జున్ గౌడ్, జాగిరి రాజు, వెల్దండి మార్కండేయ, గుండా సంపత్ రెడ్డి, బుర్ర సత్యనారాయణ,దూడం నాగభూషణం, డి తిరుపతి, కే వాసుదేవా చారి, ఎం వెంకటయ్య, ఎం రవీందర్, ఎం రాజేశం, కే తిరుపతి, మావురపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ



యాదాద్రి భువనగిరి/మార్చ్ 19 వుదయం పతినిధి:- మోత్కూర్ జడ్పిహెచ్ఎస్ లో పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, కంపాస్ బాక్సులు పంపిణీ చేశారు. విద్యార్థుల చదువుకు తోడ్పాటుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రూ 10,116, రూ.5,116, రూ. 2,116 నగదు బహుమతులు అందిస్తానని ప్రకటించారు.విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి విజయాలు సాధించాలని, వారి భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలని వారు ఆకాంక్షించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి సహాయాలు విద్యార్థులకు ఎంతో ప్రేరణ కలిగిస్తాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు అరవిందరాయుడు, అంజయ్య, రాంప్రసాద్, బయ్యని రాజు, అనిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు..

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఆదిలాబాద్, మార్చి19(వుదయం ప్రతినిధి): నార్నూరులోని గాంధీ చౌక్ వద్ద బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. బీసీలకు రిజర్వేషన్, ఎస్సీలకు వర్గీకరణలో విజయం సాధించామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దేవురావు, కాంతారావు, మాణికరావు, షేక్ నసీర్, మొహమ్మద్, జాకిర్, దస్తగిరి, అశోక్, రమేష్, ప్రశాంత్, ప్రకాష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘటన స్థలాన్ని పరిశీలించిన గజేందర్

బోథ్, మార్చి19(వుదయం ప్రతినిధి): గుడిహత్నూర్ మండల కేంద్రంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జ్ ఆడే గజేందర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రమాదానికి సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాహనదారులు ప్రధాన రహదారులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుని సమక్షంలో విలేకరుల సమావేశం.



ధర్మసాగర్ మార్చి19(వుదయం ప్రతినిధి): ఈరోజు ధర్మసాగర్ మండలంలోని ధర్మసాగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుర్రం ప్రసాద్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల పరిపాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి సంవత్సర కాలంలో పరిపాలిస్తూ ఉన్న కాంగ్రెస్ పార్టీని నిందించడం సరియైన పద్ధతి కాదని, బిఆర్ఎస్ పార్టీ ఇలాంటి ఆరోపణలు చేయడం సరైనది కాదని అన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఘనపూర్ నియోజకవర్గానికి ఎటువంటి నిధులు తీసుకురాలేదని, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంవత్సర పరిపాలనలో 800 కోట్ల నిధులను మంజూరు చేసి తీసుకురావడం జరిగింది. కాబట్టి పై విషయాన్ని ప్రజలు గమనించి తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు చాకలి దుర్గయ్య, మార్కెటింగ్ చైర్మన్ బొడ్డు ప్రదీప్ కుమార్, కోనూరు రాజు, బొడ్డు లేనిన్, రామ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగరాజు, పాష, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు తీరని అన్యాయం

**బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా తెలంగాణ రాష్ట్ర బడ్జెట్**

**రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు 3.4 శాతం నిధులా ఇదెక్కడి న్యాయం**

**అప్పులేమో బీసీలకు సంపదేమో అగ్రవర్ణాలకా**

**బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్**



నల్గొండ మార్చి 19(వుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందని బీసీ యువజన సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపెందర్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.బుధవారం నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొత్తం 3,04,965 లక్షల కోట్ల బడ్జెట్లో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 11,405 కోట్లు, 3.4 శాతం నిధులు కేటాయించి బీసీల గొంతుకోసి తీరని అన్యాయం చేశారన్నారు. గత సంవత్సరం రాష్ట్ర బడ్జెట్లో బీసీల లెక్కలు లేవనే సాకుతో కేవలం 9,200 కోట్లు కేటాయించిందని కానీ ప్రస్తుతం స్పష్టమైన లెక్క ప్రభుత్వం తేల్చిన తర్వాత కూడా కొత్త సీసాలో పాత చింతకాయ పచ్చడి అన్న చందంగా ప్రస్తుత బడ్జెట్ ఉందని ఎద్దేవాచేశారు. ప్రభుత్వం మారితే బీసీల బ్రతుకులు మారుతాయని ఆశించినా ఫలితం శూన్యంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్తో బీసీలకు ఒరిగిందేమీ లేదని 56 శాతం ఉన్న బీసీలకు కేవలం 3.4 శాతం నిధులు బడ్జెట్లో కేటాయిస్తే ఏవిధంగా బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర సంపద సృష్టించేది, ఉత్పత్తి చేసేది బీసీలని, సగానికిపైగా పన్నులు కట్టేది బీసీలన్నారు. అప్పులేమో బీసీలకు సంపదేమో అగ్రవర్ణాలకా అని ప్రశ్నించారు. ఈ బడ్జెట్ నిధులు రెండున్నర కోట్ల బీసీ జనాభాకు పంచితే చాక్లెట్లు బిస్కెట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. ఇప్పటికే గ్లోబరైజేషన్ లిబరైజేషన్ మార్పుల తర్వాత పెద్ద ఎత్తున యాంత్రీకరణ జరగడంతో పెద్ద పరిశ్రమలు కంపెనీలు రావడంతో చేతివృత్తులు కులవృత్తులు దెబ్బతిన్న కారణంగా బీసీల బ్రతుకులు రోడ్ల పాలవుతున్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని 40 వేల కోట్లు కేటాయించి బీసీలపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. అంతేకాకుండా 50 వేల కోట్ల రూపాయలతో బీసీ సబ్ ప్లాన్ ప్రవేశపెట్టి అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ యలిజాల వెంకటేశ్వర్లు, నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, బీసీ యువజన సంఘం నాయకులు శేరి రవీందర్, జక్కలి సాయి కంబాలపల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో కాంగ్రెస్ సంబరాలు

జనగామ, మార్చి19(వుదయం ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ రిజర్వేషన్ 42% చట్టబద్ధత కల్పించి, టీజీ బీసీ లకు న్యాయం జరిగేలా కృషి చేసి, ఎస్సీ వర్గాల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిన సందర్భంగా పరకాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ సమన్వయకర్త సోదరామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరకాల నియోజకవర్గ పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దేవాలయ అభివృద్ధికి రెండు లక్షల విరాళం అందజేత



కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కాయితి ఆశాదీప్ రెడ్డి కల్వకుర్తి మార్చ్ 19 (వు దయం ప్రతినిధి) ప్రసిద్ధి చెందిన శిరుసనగండ్ల శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ అభివృద్ధి కి కల్వకుర్తి నియోజకవర్గం తాండ్ర గ్రామ వాస్తవ్యులు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ యువనేత కాయితి ఆశాదీప్ రెడ్డి రెండు లక్షల రూపాయలు విరాళం ఆలయ కమిటీ చైర్మన్ కు అందజేశారు ఆలయ అర్చకులు స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు సందర్భంగా ఆశ దీప రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు మండలాలలో దేవాలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేశామని భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తానని పేర్కొన్నారు ఆశాదీప్ రెడ్డి ని నియోజకవర్గ ప్రజలు అభినందించారు

## నారాయణపేటలో మొబైల్ ఫోన్ల రికవరీ బాధితులకు అందజేసిన ఎస్పీ యోగేష్ గౌతమ్




నారాయణపేట టౌన్ మార్చ్ 19( వుదయం ప్రతినిధి) సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 47 మొబైల్ ఫోన్లు రికవారి చేసి బాధితులకు అందచేసినట్లు నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో బుధవారం ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో కానీ సీఈఐఆర్ వెబ్ పోర్టల్ లో కానీ ఫిర్యాదు చేయాలన్నారు.జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఆయన మాట్లాడుతూ గత రెండు నెలల్లో జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 47 మంది బాధితుల మొబైల్ ఫోన్లను కనిపెట్టి వారికి అందజేసినట్లు ఆయన తెలిపారు.నూతన టెక్నాలజీ ఆధారంగా నారాయణపేట జిల్లా పరిధిలో మొత్తం 47 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందని వాటి విలువ సుమారు 07 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. మొబైల్ ఫోన్లను బాధితులకు బుధవారం అందజేసినట్లు తెలిపారు.మొబైల్ దొంగతనం చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ పోలీసు అధికారులకు తెలిపారు. ప్రజలు ఎవరు పాత మొబైల్ ఫోన్ల ను కొనరాదు అని ఎస్పి విజ్ఞప్తి చేశారు. మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా ఉంచుకోవాలని నేరస్తులు దొంగలించిన మొబైల్ ఫోన్లను దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ వెంటనే సి ఈ ఐ ఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు. మొత్తం 47 ఫోన్ లను నూతన టెక్నాలజీ సాయంతో ఐటి కోర్ పోలీసులు ట్రేస్ చేసి పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. అందుకు ఐటి కోర్ కానిస్టేబుల్ రమేష్ ను ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎన్ లింగయ్య, సిఐ లు శివ శంకర్, రాజేందర్ రెడ్డి, రామ్ లాల్, సైదులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, మొబైల్ తీసుకున్న వారు, తదితరులు పాల్గొన్నారు.

## అర్ధనారీశ్వరిగా దర్శనమిచ్చిన శ్రీ దుర్గా భవానీ

నారాయణఖేడ్, మార్చి19(వుదయం ప్రతినిధి): సంగారెడ్డి మండలం ఈశ్వరపురంలో కొలువై ఉన్న శ్రీ దుర్గా భవానీ ఆలయ వార్షికోత్సవాలలో భాగంగా నాల్గవ రోజు బుధవారం అమ్మవారు అర్ధనారీశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య చతుర్వేద స్వాహాకారము, శతచండీ పారాయణము, సామూహిక లక్ష పుష్పార్చన, సహస్ర లింగార్చన వంటి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇవాళ రాత్రి అమ్మవారి కళ్యాణం కమనీయంగా జరుగుతుందని చెప్పారు.

# త్రిపురారం మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీలు

## ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం, తహసిల్దార్ కార్యాలయం,కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



నల్గొండ మార్చి 19(ఉదయం ప్రతినిధి): ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం స్థాయిలో సాధారణ ప్రసవాలను చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టరు, ఓపి రిజిస్టర్, స్టేరిలైజేషన్ రిజిస్టర్ లను పరిశీలించి సిబ్బంది నూటికి నూరు శాతం హాజరు ఉండడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఓపి రోజుకు 40 నుండి 50 మంది వస్తున్నారని తెలుసుకొని ఓపిని పెంచాలని, వచ్చిన ప్రతి పేషెంట్ వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని, ఏలాంటి రోగులు పి హెచ్ సి కి వస్తున్నారని డాక్టర్ రమావత్ శంకర్ ను అడగగా, షుగర్,బి పి పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారని, ఎల్సిడి, జ్వరంతో బాధపడే కేసులు వస్తున్నాయని డాక్టర్ బదులు ఇచ్చారు. గత నవంబర్ నుండి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో సంభవించిన శిశు మరణాల వివరాలు అడుగగా, నవంబర్లో మాత్రమే ఒక కేసు నమోదయిందని, ఇప్పటివరకు ఎలాంటి కేసులు నమోదు కాలేదని డాక్టర్ చెప్పారు. ఎన్ని ప్రసవాలు చేస్తున్నారని ప్రశ్నించగా జనవరి ఫిబ్రవరిలో ప్రసవాలు చేయలేదని తెలుసుకొని పి హెచ్ సి పరిధిలో తప్పనిసరిగా ప్రసవాలు నిర్వహించాలని చెప్పారు. కొత్తగా పెళ్లయిన వారికి, గర్భిణీ స్త్రీలకు వారు తీసుకునే పౌష్టికాహారం పై అవగాహన కల్పించే విధంగా ఆశలకు శిక్షణ ఇవ్వాలన్నారు. త్రిపురారం పిహెచ్ సి పరిధిలో ఎలాంటి మాతా మరణాలు లేవని డాక్టర్ కలెక్టర్ కు తెలిపారు. ఎన్సిడి, పిసిడి కేసులు, అంబులెన్స్ ఇతర సౌకర్యాలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా త్రిపురారం పి హెచ్ సి పాతబడిపోయినందున మరమ్మతులు లేదా కొత్త బిల్డింగ్ మంజూరు చేయాలని వైద్యాధికారి కోరగా తప్పనిసరిగా మంజూరు చేస్తామని తెలిపారు. ఆ తర్వాత జిల్లా కలెక్టర్ తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రేషన్ కార్డుల కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తుల అప్లోడింగ్ ను కంప్యూటర్ ద్వారా ఆన్లైన్లో పరిశీలించారు. 135 దరఖాస్తుల కొత్తగా వచ్చాయని వాటిలో 5 దరఖాస్తులు అప్లోడ్ చేయడం జరిగిందని, 75 దరఖాస్తులు పరిశీలన పూర్తి చేశామని తహసీల్దార్ ప్రమీల జిల్లా కలెక్టర్ కు వివరించారు. గ్రామాలలో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండకపోవడం వల్ల ఆలస్యం అవుతుందని తెలుసుకొని తక్షణమే వారు అందుబాటులో ఉండే విధంగా టామ్ టామ్ చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలో చౌకధర దుకాణాల ఖాళీలు ఉన్నాయని తెలుసుకొని వాటిని భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేజీబీవీలో వంటగదిని, స్టోర్ రూమ్ ను తనిఖీ చేసి వంట సరుకులు, కిచెన్, అన్ని శుభ్రంగా ఉ ఒడడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా వంటామనిషి పోస్ట్ ఖాళీగా ఉందని తెలుసుకుని తాత్కాలికంగా భర్తీ చేస్తామని ఎస్ఓ విజయలక్ష్మి కి తెలిపారు. 8, 10 వ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. హిందీ, గణితం, సైన్స్ సబ్జెక్టులపై వారికి ప్రశ్నలు వేసి జాబులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక పాపులర్ గురించి, చదువు ప్రాముఖ్యత గురించి చెప్పారు. బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇదే మండలం, పెద్దదేవులపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ కూడా సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపి రిజిస్టర్లను తనిఖీ చేశారు. కాగా ప్రతిరోజు పి హెచ్ సి కి 30 నుండి 40 మంది వస్తారని, అక్టోబర్లో 80 మంది వరకు పేషెంట్లు వస్తారని ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం డాక్టర్ ప్రియాంక, డాక్టర్ శిరీష లు జిల్లా కలెక్టర్ కు వివరించగా



ఏఎన్ సీ రిజిస్టర్ మొదటి మూడు నెలల్లో ఏఎన్ సి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో బాలింతలకు ఓ ఆర్ ఎస్ పాకెట్లు ఇచ్చేలా అంగన్వాడీలకు ఇవ్వాలని, పి హెచ్ సి పరిధిలో మాత మరణాల గురించి అడగగా, గత సంవత్సర కాలంలో ఎలాంటి మాత మరణాలు సంభవించలేదని తెలిపారు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నపిల్లలకి పౌష్టికాహారం, యాంటీనాటల్ పరీక్షలు, తదితర అన్ని అంశాలపై ఆశాలతో సమీక్షించాలని అన్నారు. పెద్దదేవులపల్లి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పరిధిలో అబార్షన్ కేసులు ఎక్కువ గా ఉన్నాయని గమనించిన జిల్లా కలెక్టర్ ఒక అబర్షన్ పేసెంటు కే మనిషాతో ఫోన్లో మాట్లాడి రెండుసార్లు అబార్షన్ చేయించుకునేందుకు ఉన్న కారణాలను అడిగి తెలుసుకున్నారు. మరోసారి అబార్షన్ చేయించుకోవద్దని అవసరమైతే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. పి హెచ్ సి పరిధిలో యాంటివీనం, ఏఆర్ వి ,విటమిన్ కె వ్యాక్సిన్ లను అందుబాటులో ఉంచుకోవాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి డాక్టర్లను అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఎంపీడీవో విజయ్ కుమారి, కేజీబీవీ ఎస్ఓ విజయలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకంలో రాజకీయ జోక్యం ఉండొద్దు



కొండపాక మార్చి19(ఉదయం ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంలో భాగంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందించడానికి ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారులఎంపిక ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలే ఎంపిక చేస్తారు అని చెప్పడం సమంజసం కాదన్నారు సిపిఐ(ఎం) కొండపాక మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య. వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకుల జోక్యం లేకుండా కార్పొరేషన్ల అధికారుల ద్వారానే ఈ పథకం అమలు చేయాలని డిమాండ్ చేసారు. ఆయా బ్యాంకులు లబ్ధిదారులకు లేనిపోని మెలికలు పెట్టకుండా అర్హులందరికీ 10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బిఆరెస్ ప్రభుత్వం అమలు చేసిన దళిత బంధు పథకం లో కూడా అసలైన లబ్ధిదారులు నష్టపోయి, అనర్హుల జేబులు నిపింది అప్పటి కెసిఆర్ ప్రభుత్వం అని ద్యుయ్యబట్టారు , గతంలో జరిగిన తప్పులు జరగకూడదు అనుకుంటే రాజకీయ నాయకుల జోక్యం లేకుండా పథకాల అమలు జరపాలని ప్రభుత్వాలను కోరారు. అంతే తప్ప పేరు గొప్ప ఊరు దిబ్బ అనే చందంగా పేరుకు మాత్రమే పథకాలు ప్రవేశపెట్టి చేతులు దులుపుకుంటూ మొద్దు నిద్రను వీడనాడాలని డిమాండ్ చేశాడు బాల్ నరసయ్య.

## వేములవాడ రాజన్న సేవలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్

వేములవాడ, మార్చి19(ఉదయం ప్రతినిధి): తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కాత్యాయని వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఈవో వినోద్ స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ ఇన్స్పెక్టర్ నరేందర్, జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, ఆలయ సిబ్బంది ఉన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ అమలు

### జిల్లా ఎస్పీ టి శ్రీనివాస రావు



గద్వాల మార్చి 19 (ఉదయం ప్రతినిధి) జోగ్యులాంబ గద్వాల్ జిల్లా పరిధిలో జరిగే పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో అయా పరీక్ష కేంద్రాల వద్ద మార్చి 21 నుండి ఏప్రియల్ 4 వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎస్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాస రావు ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 40 పరీక్షా కేంద్రాలలో 7,717 మంది విద్యార్థులు వ్రాసే పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఉరేగింపులు, దర్నలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ గారు తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ ఆంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

## భవిత సెంటర్లలో ప్రత్యేక శిక్షణ

### జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్





వెలికి తీస్తే వారు చాలా ప్రతిభావంతులుగా మారుతారని

నారాయణపేట టౌన్ మార్చ్ 19( ఉదయం ప్రతినిధి) ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం భవిత సెంటర్లలో ప్రత్యేకమైన శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బుధవారం భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ (అలిమ్ కో) సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఏర్పాటు చేసిన ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత సెంటర్ల లో ఇస్తున్న ప్రత్యేక శిక్షణ దివ్యాంగ విద్యార్థుల తల్లితండ్రులు ఉపయోగించుకొని వారికి జీవన నైపుణ్యాలు నేర్పించాలని అన్నారు. భవిత సెంటర్లలో వారానికి ఒకసారి ఫిజియోథెరపీ సేవలు అందిస్తారని దీనిని దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉ పయోగించు కోవాలని

తెలిపారు.దివ్యాంగ విద్యార్థులు ఏ విషయంలో కూడా తక్కువ కాదని వారికి ప్రత్యేకమైనటువంటి నైపుణ్యాలు పుట్టుకతోనే వస్తాయని వారిలో గల సృజనాత్మకతను నైపుణ్యాలను గుర్తించి వెలికి తీస్తే వారు చాలా ప్రతిభావంతులుగా మారుతారని కలెక్టర్ చెప్పారు. అంగ వైకల్యం కలిగిన ఎంతోమంది వారి యొక్క వైకల్యాన్ని జయించి జీవితంలో అత్యున్నత స్థానాలలో స్థిరపడ్డారని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఓపికతో సహనముతో పెంచి పెద్ద చేయాలని కోరారు. ప్రభుత్వం ద్వారా వారికి వచ్చేటటువంటి ప్రోత్సాహకాలను విద్యార్థులకు అందేలా తగు చర్యలు తీసుకొని వారిని సరిగ్గా పోషించాలని సూచించారు. గత ఆగస్టు 24న నిర్వహించిన అసెస్మెంట్ క్యాంపులో నుండి 85 మంది విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన పరికరాలకు కొలతలు తీసుకుని ఎన్నో లక్షల విలువైన ఉ పకరణాలను బుధవారం జిల్లా

కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగిందని సీ ఎం ఓ రాజేందర్ తెలిపారు. కాలిపర్స్, వినికిడి యంత్రములు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, సిపి చైర్స్, ఎంఆర్ కిట్స్ రొలేటర్స్ దివ్యాంగులకు అందించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఉ మాపతి, విద్యా శాఖ అధికారి నాగార్జునరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి బాలాజీ, అలీంకో సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు

## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిది

### చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఎల్ ఓసి అందజేత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కల్వకుర్తి మార్చ్ 19 (ఉ దయం ప్రతినిధి) కల్వకుర్తి మండల పరిధిలోని ఎల్లికట్ట గ్రామానికి చెందిన ఎండి గోరి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఆ గ్రామ మాజీ సర్పంచ్ రాకేష్ కుమార్ కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి ప్రభుత్వం ద్వారా రూ. 2లక్షల రూపాయలు మంజూరు చేయించి బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి. బుధవారం %శ్రీశీ\% ని అందజేశారు కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యులు మైసిగండి శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట నర్సింహా,గ్రామస్థులు భూపాల్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు

## సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



రాయపర్తి మార్చి 19(ఉదయం ప్రతినిధి): మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం దేశంలోనే అత్యంత శాస్త్రీయంగా పారదర్శకంగా కుల గణన చేసి విద్య, ఉద్యోగం రాజకీయాలలో 42% బీసీ రిజర్వేషన్లు కు చట్టబద్ధత కల్పించి, దశాబ్దాలుగా కొనసాగిన ఎస్సీ వర్గీకరణ హేతుబద్ధీకరణ బిల్లుకు సభ ఆమోదం చేసిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి,ఎంమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి,నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి చిత్ర పటాలకు పాలభిషేకం చేసి,రాష్ట్ర ప్రజా ప్రభుత్వానికి, కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపి బాణా సంచా కాల్చి,మిఠాయి లు పంచుకొని స%శీ%బారాలు రాయపర్తి మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ ఎన్నో ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చిందని, విద్య ఉద్యోగం రాజకీయాలలో గ్రామీణ పట్టణ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించే రెండు బిల్లులను రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ భద్రత కల్పించాలని, రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని వర్గాలుగా అభివృద్ధి చెందుతుందని, రానున్న రోజుల్లో మిగిలిన అన్ని పథకాలు అమలు చేస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో తొర్రూర్ బ్లాక్ అధ్యక్షులు జాటోత్ హమ్య నాయక్, మాజీ టీపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ కో కన్వీనర్ కందికట్ల రాజయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొమ్మెర కళ్యాణ్ గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిర్ర మల్లయ్య,మండల పార్టీ ఉపాధ్యక్షులు భూక్యా సమయ్య,వల్లాపు కుమార్ రాయపర్తి పట్టణ అధ్యక్షులు మచ్చ రమేష్ ,ఊళ్లేంగల యాదగిరి,ఊళ్లేంగల నర్సయ్య, కందికట్ల రాజయ్య, మల్యాల నరసింహమూర్తి , గారె బిక్షపతి, కందుకూరి కృష్ణ, నరేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరాగాంధీ చౌరస్తా దగ్గర ఘనంగా పాలాభిషేకం బైక్ ర్యాలీ






మరికల్ మండల మార్చి19(ఉదయం ప్రతినిధి): కేంద్రంలోని బుధవారం ఇందిరాగాంధీ చౌరస్తా దగ్గర ఘనంగా పాలాభిషేకం బైక్ ర్యాలీ నిర్వహించారు బీసీలకు చట్టసభలో మరియు ఉ ద్యోగాలలో 42 శాతం రిజర్వేషన్ ఎస్సీ వర్గీకరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతూ మరికల్ మండల కేంద్రంలో భారీగా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ కరిగే తెలంగాణ తల్లి సోనియా గాంధీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ జిల్లా నాయకులు సూర్య మోహన్ రెడ్డి గొల్ల కృష్ణయ్య మండల అధ్యక్షుడు బెలుగుంది ఈరన్న ఆంజనేయులు హరీష్ పెంటమేని రాఘవేందర్ రామకృష్ణారెడ్డి సూర్య ప్రకాష్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నయ్య ఆనంద్ కుమార్ జంగిడి రవి టైసన్ రఘు తో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ...

### ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ



కోరుట్ల మార్చి 19 (ఉదయం ప్రతినిధి) జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఆదేశాల మేరకు బుధవారం కోరుట్ల ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోన ఈద్గాల్లో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు

అనంతరం అల్లమయ్య గుట్టలోని వాటర్ లీకేజీ పనులను కూడా పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో కమిషనర్ రామకృష్ణ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వం నిర్లక్ష్యానికి గోదావరి ఎండిపోయింది

మంథని, మార్చి19(ఉదయం ప్రతినిధి): : రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కరీంనగర్లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. మాజీ సిఎం కేసీఆర్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఎందరికో జీవనోపాధి లభించిందని, నేడు ఎండిపోయి ఎడారిలా కనిపిస్తుందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యానికి గోదావరిలో నీరు లేక ఎండిపోతుందని మండిపడ్డారు. నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ రామగుండం నుంచి ఎర్రవెల్లి వరకు పాదయాత్ర చేస్తున్నానని అన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన టీచర్

మక్తల్, మార్చి19(ఉదయం ప్రతినిధి): ఆల్ ఇండియా సివిల్ సర్వీసులో జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మాగనూరు మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు బి. దీప ఎంపికైనట్లు డి ఎస్ ఓ వెంకటేష్ శెట్టి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

జనవరి 23, 24 రెండు రోజులు సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్లో జరిగిన ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ మహిళా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొని ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

సంగారెడ్డి, మార్చి19(ఉదయం ప్రతినిధి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్, వర్గీకరణను అసెంబ్లీ ఆమోదించినందుకు సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ ముందు బుధవారం కాంగ్రెస్ పార్టీ వారు సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మల రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జార్జి, మండల అధ్యక్షుడు రాములు, నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ కు సంఘీభావం తెలిపిన వేంసూరు బిజెపి నాయకులు



సత్తుపల్లి /వేంసూరు మార్చ్ 19 (వుదయం ప్రతినిధి) ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 3 దశాబ్దాలపైగా అలుపెరుగని పోరాటం చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో ఎస్సీ వర్గీకరణ పై చారిత్రాత్మక సుప్రీం కోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఆర్డినెన్స్ ద్వారా ఏ బి సి డి వర్గీకరణకు తీర్మానం చేస్తానని చెప్పినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన కొలువుల్లో సైతం వర్గీకరణ అమలు జరగకుండా దాటవేత ధోరణితో కొలువులను భర్తీ చేసే కార్యక్రమం జరుగుచున్న వేళ తక్షణమే వర్గీకరణ జరిపి న్యాయబద్ధంగా వారికి రావలసిన విద్య, ఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరవధిక దీక్షలో భాగంగా వేంసూర్ మండల ఎమ్మార్పీఎస్ మండల శాఖ కలపాల యేసు, కోటా వేంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిర్వహిస్తున్న శిబిరానికి భారతీయ జనతాపార్టీ వేంసూరు మండలశాఖ అధ్యక్షులు గొర్ల ప్రభాకర్ రెడ్డి నేతృత్వంలోని భారతీయ జనతాపార్టీ సంఘీభావం తెలుపుతూ తక్షణమే వర్గీకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవి రమేష్, నియోజకవర్గ కన్వీనర్ వీరంరాజు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మట్టా ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పర్సా రాంబాబు, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు భీమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి, మాదిరాజు శ్రీనివాస్, ఐటి సెల్ కన్వీనర్ నల్లమోతు నాని, ఉబ్బుల కృష్ణ, అప్పారావు, వెంకటరెడ్డి పిచ్చయ్య, బాలస్వామి ,రవి సాడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# దేశ అభివృద్ధి యే మోడీ లక్ష్యం పాలమూరు లో పల్లే పల్లె అభివృద్ధి అరుణమ్మా పంథం

**–జడ్చర్ల నియోజక వర్గం అభివృద్ధి ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి. సంకల్పం**

ఊర్కొండ మార్చి19(వుదయం ప్రతినిధి): పాలమూరు ముద్దు బిడ్డ పెద ప్రజల గుండెల్లో జేజమ్మ గా పేరొందిన మన ఎంపీ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్పంతో ఇవ్వల ఊరుకొండ మండలంలో 80 లక్షల నిధులు C.C రోడ్లు నిర్మించడం కోసం దగ్గర ఉండి ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలనే తపన అనునిత్యం పాటు పడుతూ ఎక్కడ సమస్య ఉన్న నేను ఉన్న అంటూ అభయం ఇస్తూ మా అన్నా ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి ఇవ్వల మన రాంరెడ్డి పల్లి గ్రామానికి అండర్ డ్రైనేజ్ పనుల కోసం 25 లక్షలు మంజూరు చేసి C.C రోడ్లకు 15.లక్షలు మంజూరు చేపించి గ్రామ అభివృద్ధి కి సహకరించిన జనార్ధన్ రెడ్డి గ్రామ ప్రజలు ధన్యవాదాలు



తెలిపారు రాంరెడ్డి పల్లి లో C.C రోడ్లకు శంకుస్థాపన చేశారు వారితో పాటు పాలమూరు కౌన్సిల్ సభ్యులు లక్ష్మారెడ్డి మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్ ఎక్స్ ఎంపీటీసీ గోపాల్ గ్రామ పెద్దలు సుజ్జీవన్ రెడ్డి హరీష్ ఆంజనేయులు శేఖర్ రాములు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు పర్శరములు బ్రహ్మ చారి శివ శంకర్ అశోక్ రెడ్డి వెంకటస్వామి శివ అనిల్ రవి చేంద్రయ్య కృష్ణయ్య గౌడ్ శివ నంద్ శంతయ్య లక్ష్మణ్ తదితరులు పాల్గొనడం జరిగింది

# అనారోగ్యానికి గురైన కార్యకర్త కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం

**సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్**



వెల్దండ మార్చి 19 (వు దయం ప్రతినిధి) మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త,బాదేపల్లి అరుణ్ ముదిరాజ్, తండ్రి బాదేవల్లి నిరంజన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు విషయం తెలుసుకున్న సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ బుధవారం కాంగ్రెస్ కార్యకర్త కుటుంబానికి పరామర్శించి బాధితుడు బాధపెల్లి నిరంజన్ కు 10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు అదేవిధంగా గ్రామానికి చెందిన మారేపల్లి అలివేల అనారోగ్యంతో ఉండడంతో వైద్య ఖర్చులకు గాను 5000 రూపాయలను అందజేశారు సందర్భంగా మట్ట వెంకటయ్య గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, పేద ప్రజలకు అన్ని విధాలకు అండగా ఉంటానని బాధితులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తిరుపతి రెడ్డి,%ఎం% రషీద్,గుద్దటి కిష్టాలు, పుట్ట యాదయ్య, మారేపల్లి శ్రీను, బాధేపెల్లి రామకృష్ణ,తుంగ మల్లేష్, బసవని వెంకటయ్య, అన్యపు రామస్వామి, బసన్నమౌని చంద్రయ్య, రేవెల్లి దర్గయ్య, భరత్, పుట్ట శివ తో పాటు తదితరులు ఉన్నారు

# విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికి తీయాలి



నారాయణపేట టౌన్ మార్చ్ 19( వుదయం ప్రతినిధి)విద్యార్థుల్లో దాగిన ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీయుటకు ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని రిటైర్డ్ విద్యాశాఖ అధికారి జగదీశ్వర్,గ్రామ మాజీ సర్పంచ్ కోట్ల సుగంధమ్మ అన్నారు. జాజాపూర్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భారతి అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రమశిక్షణ అత్యంత కీలకమని అన్నారం. అబ్బుర వ రిచిన నాటికలు.... ఈ కార్యక్రమంలో విద్యార్థులు

స్వీయ అభ్యాసంతో నేర్చి ప్రదర్శించిన సామాజిక నాటికలు, సంప్రదాయ నృత్యాలు,కోలాటం,అడుగుల భజన, పిరమిడ్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వార్షికోత్సవ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి నాగార్జున రెడ్డి, ఏపీఓ సురేష్ కుమార్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మణెమ్మ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు దత్తురావ్, గ్రామ పెద్దలు కోట్ల జగన్మోహన్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయ బృందం

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



వెల్దండ మార్చి 19 (వు దయం ప్రతినిధి) ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పట్ల బుధవారం కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేసిన పోరాటం ఫలితం దక్కిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వీరస్వామి కానుగుల జంగయ్య కాటిక రామస్వామి పోలే రాజు అన్నారు అదేవిధంగా నిన్న అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం పొందడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీ మల్లు రవి లకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు కార్యక్రమంలో గుద్దటి ప్రభాకర్ కొయ్యల పుల్లయ్య, పోలే అశోక్, గుద్దటి కిష్టాల్ ఈదులపల్లి అనిల్ దుబ్బ నాగేష్ కొప్పుగెలవయ్య దాసరి లింగం కొమ్ము అంజయ్య ముదిగొండ రమేష్ గుద్ధటి జనార్ధన్ ఈదులపల్లి శ్రీనివాసులు జంగయ్య జగదీశ్వర్ లక్ష్మణ్ ప్రకాష్ తక్కెళ్ళపల్లి శేఖర్ వెంకటయ్య మొగులయ్య రాజు తదితరులు ఉన్నారు

# మండలంలోని గ్రామ గ్రామంలో ఉపాధి హామీ పనులను జాబ్ కార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో కృష్ణయ్య





ఊర్కొండ మార్చి19(వుదయం ప్రతినిధి): నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు తిమ్మన్నపల్లి, రేవల్లి గ్రామాల్లో రైతు పొలాలకు రోడ్డు వేయు పనులను సందర్శించి, నాణ్యమైన రోడ్డు వేసినట్లయితే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అందరు రైతులు పంటలు సాగుచేసుకుంటారని కూలీలకు తెలియజేయడం జరిగింది. అలాగే ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయాన్నే పనులకు వచ్చి ఇచ్చిన కొలతల ప్రకారం పూర్తి చేసుకొని ఇండ్లకు వెళుటకు సూచనలు చేయడం జరిగింది. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను అనగా నీడ కొరకు షేడ్ నెట్, త్రాగుటకు మంచినీళ్లు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్ సమకూర్చుటకు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి సూచించడం జరిగింది. క్షేత్ర స్థాయి సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ. 300/- ల కూలీ వస్తుందని, ప్రతిరోజు జాబ్ కార్డ్ యందు హాజరు వేయించుకోవాలని కూలీలకు అవగాహన కల్పించడం జరిగింది. తదుపరి రేవల్లి , తిమ్మన్నపల్లి , గ్రామ నర్సరీలను సందర్శించడం జరిగింది. ఈ సందర్శనలో శ్రీ లక్ష్మణ్, ఎంపీఓ, నర్సింహా ఏపీఓ, రేణమ్మ , టి. ఏ., సరిత , పంచాయతీ కార్యదర్శి, శివ, మహేష్ , మేట్స్ పాల్గొనడం జరిగింది. ఎంపీడీఓ ఊర్కొండ.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన నూనె కుమార్




కొండపాక మార్చి19(వుదయం ప్రతినిధి): ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్ లను లబ్ధిదారులైన గుర్రాల చైతన్య కు 27000, ఆత్కూరి సుధాకర్ కు 21000, మారమైన వెంకటయ్యకు 18,000, తాళ్లపల్లి నరసింహులుకు 27,000 బుధవారం అందించారు బిఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు కుమార్ యాదవ్. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు అనారోగ్యాల బారిన పడి,ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురైన సమయం లో వైద్యానికి అయ్యే ఖర్చులకోసం సీఎంఆర్ఎఫ్ గాని, ఎల్ఓసి ద్వారా గాని ప్రభుత్వం నుండి ఆర్థిక సాయం పొందే అవకాశం ఉన్నందున ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఆస్పత్రిలో వైద్యం జరుగుతున్నప్పుడైతే ఎల్ఓసి ద్వారా ఆర్థిక సహకారమందే అవకాశం ఉన్నదని, వైద్యం పూర్తయి డిశ్చార్జ్ అయిన తర్వాత అయితే సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహకారమందే అవకాశం ఉన్నదని, ఆపత్కాలంలో ఈ పథకాల అవసరం పడిన ప్రజలు మమ్ములను సంప్రదిస్తే వారికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. చెక్కులు రావడానికి కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి కి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు నూనె కుమార్ యాదవ్. ఈ కార్యక్రమంలో దుద్దెడ మాజీ ఉప సర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు, యువజన విభాగం అధ్యక్షులు చిక్కుడు భాను ప్రకాష్, ఎస్టి విభాగం అధ్యక్షులు కెమ్మసారం శ్యామ్, మండల యువజన విభాగం నాయకులు తాళ్లపల్లి కిరణ్ కుమార్, కొండపాక స్వామి యాదవ్, పోతుగంటి నర్సింగారావు, గాదగోని రాకేష్ గౌడ్, కెమ్మసారం సంతోష్, మెరుగు శివకుమార్, గుర్రాల నాగయ్య, మారమైన సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చే నేడు విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ



నారాయణపేట టౌన్ మార్చ్ 19( వుదయం ప్రతినిధి) నారాయణపేట ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి చే కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె వ్యక్తిగత సహాయకులు తెలిపారు. అనంతరం 9:30 గంటలకు క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం, 10:00 గంటలకు రూరల్ వాటర్ సప్లై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు వారు తెలిపారు.అంతేకాక 10:30 గంటలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం,11:30 గంటలకు బీసీ లకు చట్టసభల్లో ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ తల్లి సోనియా గాంధీ, జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా చిట్టెం పర్ణిక రెడ్డి లకు అన్ని మండలాల ముఖ్య నాయకుల చేత ధన్యవాద కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.మధ్యాహ్నం 02:00 గంటలకు ధన్వాడ మండల కేంద్రంలో రెస్లింగ్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు వారు

## సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం


జుక్కల్, మార్చి19(వుదయం ప్రతినిధి): బిచ్కుంద మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అసెంబ్లీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, వర్గీకరణ ఏబీసీడీ బిల్లును, ఆమోదించినందున, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుల చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.


# జాతీయ ఉపాధి హామీ పనులను పరిశీలించిన కలెక్టర్ బి.ఎమ్.సంతోష్



గద్వాల మార్చి 19 (వుదయం ప్రతినిధి) మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ బుధవారం పరిశీలించారు. మల్దకల్ మండలంలోని తాటికొండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన ల్యాండ్ డెవలప్మెంట్, హార్టికల్చర్, రోడ్డు ఇరువైపుల మొక్కల నాటిన పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా ఎంతమందికి పని కల్పించబడిందో, ఎంతమంది కూలీలు పనిచేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో కూలీలు ఉదయం నుంచే పనిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పని ప్రదేశంలో నీడ, మంచినీటి వసతి, ఎండ ప్రభావం తగ్గించేందుకు ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పనుల పొడవు, వెడల్పు, లోతు కొలతలు నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఫీల్డ్ అసిస్టెంట్లు వాటిని ఖచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. పూర్తయిన పనుల వివరాలు, కొలతలు, ఖర్చులను మెజర్మెంట్ బుక్ లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. కూలీకి సంబంధించిన చెల్లింపులు బ్యాంకు ఖాతాల్లో సక్రమంగా జమ అవుతున్నాయా? అని తెలుసుకుని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కూలీలకు సూచించారు. అర్హులందరికీ ఉపాధి హామీ పనులు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ స్వయంగా కూలీలకు ఓ ఆర్ ఎస్ పాకెట్లు పంపిణీ చేసి, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు పాటించాలని వారికి సూచించారు. హార్టికల్చర్ సంబందించిన 3 ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన మొసాంబి పండ్ల తోటను పరిశీలించి, అధికారుల నుండి తోట నిర్వహణ, దిగుబడి, సాగు విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మరింత ఆదాయం లభించేందుకు తోటల్లో అంతర్ పంటలు వేసుకోవచ్చని సూచిస్తూ, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా చేసుకునేందుకు డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను అనుసరించాలని తెలిపారు. తాటికొండ స్టేజి నుండి బింగిదొడ్డి వరకు రోడ్డు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి, మొత్తం నాటిన మొక్కల వివరాలు తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో మొక్కలకు తగినంత నీటి సరఫరా చేయడంతో పాటు, సమర్థవంతమైన సంరక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయ రెడ్డి, ఏపీఎం సుజాత, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

# వల్లూరు అడవిలో రెండు ఆవుల కళేబరాలు...!





మెదక్, ( 2025 మార్చ్ 19 వుదయం ప్రతినిధి : నార్సింగి మండల పరిధిలోని వల్లూరు అటవీ ప్రాంతంలో రెండు ఆవుల మృతదేహాలు లభ్యం అయ్యాయి. ఈ ఘటన ఆ ప్రాంతంలో కలకలం రేకెత్తించింది. ఆవులను వధించి మాంసం తీసుకెళ్లి కళేబరాలను అక్కడ వేసినట్టు ఉందని స్థానికులు అనుమానిస్తున్నారు. ఇంకేమైనా వ్యాధితో చనిపోయాయా... ఎక్కడ నుంచి తీసుకొచ్చి పడేశారు. ఇట్టి విషయమై రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ విద్యాసాగర్ ను వివరణ కోరగా... తమ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించడం జరిగింది అన్నారు. అక్కడ ఆవులను ఎవరు వదిలేశారు అనే విషయాన్ని విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. భవిష్యత్తులో అటవీ ప్రాంతంలో చనిపోయిన జంతువులను పడేసేటప్పుడు దొరికిన లేదా ఎంక్వైరీలో తేలిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన ప్రజాసేవ సమితి.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 19 వుదయం ప్రతినిధి: రాజాపేట మండలం చల్లురు ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుల అధ్యక్షతన బుధవారం 10 వ, తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకి వీడ్కోలు నిర్వహించిన సందర్భంగా ప్రజా సేవ సమితి సభ్యులు విద్యార్థులకు అల్ దా బెస్ట్ చెప్పుతూ వారికి వార్షిక పరీక్షలకు అవసరం అయ్యే పరీక్షా సామాగ్రినీ అందజేశారు. ఈ కార్యక్రమం లో సేవా సమితి సభ్యులు మాట్లాడుతు విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి,10/10 జీపీఏ సాధించాలని భవిష్యత్తు లో వారు మంచి ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు పొందాలని సూచించారు. ఉపాధ్యాయులు, ప్రజా సేవ సమితి సభ్యులు, యూత్ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పరీక్షలు జాగ్రత్తగా రాయాలి

మిర్యాలగూడ, మార్చి19(వుదయం ప్రతినిధి): త్రిపురారం మండలంలోని చెన్నైపాలెం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థిని, విద్యార్దులకు పరీక్షల కిట్ ని పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి దానవత్ సాయికుమార్ బుధవారం విద్యార్దులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సైదిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు జాగ్రతగా రాయాలని సూచించారు.

## మెంచు చక్రయ్యగౌడ్ హత్యను సీరియస్ గా తీసుకుంటున్నాం

మునుగోడు, మార్చి19(వుదయం ప్రతినిధి): ప్రత్యర్థుల దాడిలో మిరియాల మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య గౌడ్ మృతి చెందారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను ఐజి సత్యనారాయణ పరామర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. మెంచు చక్రయ్య గౌడ్ ను అత్యంత పాచవికంగా హత్య చేయడం అన్నారు. సొంత బంధువులు ఇలా చేయడం బాధాకరమైన విషయం అని అన్నారు. ఇప్పటివరకు 19 మంది పై వారు కేసు పెట్టడం జరిగిందని ఆయన అన్నారు.

# మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషకం

బోధన్, మార్చి19(వుదయం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీ ఆమోదం తెలిపిన నేపథ్యంలో బుధవారం బోధన్ నియోజకవర్గం రెంజల్ మండలంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికీ పాలాభిషేకం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు లస్సీంగారి భూమయ్య మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కొరకు మందకృష్ణ మాదిగ చేసిన పోరాటాన్ని కొనియాడారు. ఇందులో నాయకులు రమేశ్, మహేశ్, రూపేశ్, సాయిలు, రవి ప్రసాద్, సాయిబాబా, ప్రకాశ్, నరేశ్, చింటు, పులేందర్, ఎల్పీ పోచయ్య, సురేశ్,శ్యామ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం

**అధికారంలోకి రాగానే 42% రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం**
**ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే**
**ఎమ్మెల్సీ,డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్**
**బీసీలకు 42% రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలపడంతో కాంగ్రెస్ సంబరాలు**
**నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ**
**సీఎం రేవంత్ రెడ్డి,మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం**
**స్వీట్లు పంచి, బాణాసంచా పేల్చి సంబరాలు**
**పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



నల్గొండ మార్చి 19(వుదయం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణకు శాసనసభ ఆమోదం తెలపడంతో హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నల్గొండ పట్టణంలో సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమా, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బడుగు,బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. రాహుల్ గాంధీ ఆదేశానుసారం మేం ఎంతో మాకు అంత' అన్న విధంగా బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. దేశంలో మొట్టమొదటిసారి ఎస్సీ వర్గీకరణకు శాసనసభలో ఆమోదం తెలిపిందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు బీసీల రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణపై మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని హామీలను అమలు చేస్తూ ముందుకు పోతుందని పేర్కొన్నారు. శాసనసభలో బీసీల రిజర్వేషన్ 42 శాతం, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంతో ఇకనుంచి ఆ వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించడంతోనే నాలాంటి సామాన్య కార్యకర్తకు ఎమ్మెల్సీగా అవకాశం దక్కిందని ఈ సందర్భంగా శంకర్ నాయక్ తెలిపారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య మాట్లాడుతూ శాసనసభలో ఈ రెండు బిల్లులకు ఆమోదం తెలపడంతో అణగారిన వర్గాలకు న్యాయం జరిగిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రత్యేక చొరవ తీసుకొని బిల్లులు ఆమోదింప చేశారని అన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, దామోదరం రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోద స్వామి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు గండి చెరువు వెంకన్న గౌడ్, ప్రాంతీయ రవాణా శాఖ డైరెక్టర్ కూసుకుంట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు దుబ్బ అశోక్ సుందర్, కత్తుల కోటి, పోలే జయ కుమార్, యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, నియోజకవర్గ అధ్యక్షుడు మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్ రెడ్డి, పాదం అనిల్, కంచర్లకుంట్ల వెంకటరెడ్డి, పిల్లి రమేష్ యాదవ్, పెరిక హరిప్రసాద్, వజ్జ రమేష్ యాదవ్, నాగేశ్వర్ రావు, కిన్నర్ అంజి, తోల కొప్పుల గిరి, సైదిరెడ్డి, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఓయూలో బడ్జెట్ ప్రతులను తగలబెట్టిన బీఆర్ఎస్వి విద్యార్థులు

అంబర్‌పేట, మార్చి19(వుదయం ప్రతినిధి): ఉస్మానియా విశ్వవిద్యాలయం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రాష్ట్ర బడ్జెట్ లో విద్యా రంగానికి 7. 57 శాతం కేటాయించడాన్ని నిరసిస్తూ ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బడ్జెట్ పేపర్స్ ను తగల పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ సమయంలో 15 శాతం విద్యా రంగానికి ఇస్తానని చెప్పి అధికారంలోకి రాగానే గత ఏడాది 7. 3 శాతం, ఈ సంవత్సరం కూడ 7. 57 శాతం ఇచ్చి విద్యార్థులను మరో సారి మోసం చేసిందనీ బీఆర్ఎస్వి రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ మండిపడ్డారు.

## స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి.



కోదాడ రూరల్ మార్చి 19(వుదయం) మండల పరిధి లోని కాపుగల్లు గ్రామ క్రాస్ రోడ్ వద్ద కోదాడ మేళ్లచెరువు ప్రధాన రహదారిపై ఇటీవల కాలంలో అనేక ప్రమాదాలు జరిగి వాహనదారులు ప్రాణాలు కోల్పోయారని, ప్రమాదాల నివారణకు కాపుగల్లు సర్వీస్ రోడ్లను కోదాడ మీద ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకప్ ఏర్పాటు చేయాలని కాపుగల్లు బీ ఆర్ఎస్ పార్టీ నాయకులు దొంతగాని అప్పారావు బుధవారం ఆర్ అండ్ బి ఏ ఈ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బోసు బాబు, ఓర్సు గోపి, ఎం సతీస్ ,కే వీరబాబు, కే నాగరాజు, కే సాయి, కె వెంకటేశ్వర్లు, కే సతీష్ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కి అభినందనలు తెలిపిన డాక్టర్ రామనాథం



మధిర,మార్చి19(వుదయం ప్రతినిధి) చారిత్రాత్మక బిల్లులను చట్ట సభలు ఆమోదించటం పట్ల టీడీపీ హర్షం వ్యక్తం చేస్తున్నది. డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ కన్వీనర్ బడుగు బలహీనవర్గాలకు (ఓబిసి లకు)42 శాతం రిజర్వేషన్ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లులను శాసనసభ శాసనమండలిలో ఏకగ్రీవంగా ఆమోదం పొందుటకు సారథ్యం వహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కి టీడీపీ అభినందనలు తెలియజేస్తున్నది. ఈ రెండు కీలక బిల్లులకు ఆమోదం లభించుటకు సహకరించిన వారందరికీ టీడీపీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నది. ఈ అంశాల పరిష్కారం కోసం నాయకత్వం వహించిన వారికి క్రుషి చేసినవారికి టీడీపీ జే జే లు పలుకుతున్నదన్నారు.

## రాజాపేటలో టిఆర్ఎస్ నాయకులు అరెస్ట్.



యాదాద్రి భువనగిరి/రాజాపేట, మార్చి 18 19 వుదయం ప్రతినిధి: అసెంబ్లీ కొనసాగుతున్న సందర్భంగా ముందస్తుగా బుధవారం రాజపేట మండలంలోని పలువురు టిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.
నరసాపురం తాజా మాజీ సర్పంచ్ నాగిరెడ్డి గోపాల్ రెడ్డి, కొత్తజాల మాజీ సర్పంచ్ ఠాగూర్ ధర్మేందర్ సింగ్, కొండేర్ చెరువు మాజీ సర్పంచ్ విజయ కనకయ్య లను అరెస్టు చేశారు.

### కొడకండ్ల మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి19(వుదయం ప్రతినిధి): జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కొడకండ్ల మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద బీసీల రిజర్వేషన్ 42 శాతానికి శాసనసభలో అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి బడ్జెట్ సమావేశంలో తీర్మానం అమలు చేశారు. అందుకు గాను మండల పార్టీ అధ్యక్షుడు ధరావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండలంలోని ముఖ్య నాయకులు అందరూ పాల్గొని పాలాభిషేకం చేశారు.

## మడుపల్లి పాఠశాల విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించిన ఎల్ఐసి రంగారావు



మధిర,మార్చి19(వుదయం ప్రతినిధి) జడ్.పి.హెచ్.ఎస్ ,మడుపల్లి పాఠశాలలో చదివే 62 మంది పదవ తరగతి విద్యార్థులకు గెలాక్సీ క్లబ్ నెంబర్ (ఎల్ఐసి) ఏజెంట్ శాఖమూడి రంగారావు పరీక్ష రాయు విద్యార్థులకు అవసరమగు సామాగ్రి పెన్నులు, స్కేల్స్, ఫ్యాడ్స్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట నరసింహారావు, అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ సంవత్సరం మన పాఠశాల నుంచి 10వ తరగతి పరీక్షలు రాస్తున్నటువంటి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణుల కావాలని మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు, అనంతరం గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఇలాంటి మంచి కార్యక్రమం ద్వారా తోడ్పాటు అందిస్తున్న శాఖమూరి రంగారావు కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసినారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా కోర్టు ఏపీపీగా సూర్యప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కామారెడ్డి, మార్చి19(వుదయం ప్రతినిధి): కామారెడ్డి జిల్లా కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా దేవుని సూర్య ప్రసాద్ బుధవారం కొత్తగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు కైలాస శ్రీనివాస్ రావు, సీనియర్ న్యాయవాదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, రాజాగౌడ్, వలపిశెట్టి లక్ష్మీరాజం, దోమకొండ శ్రీనివాస్, అడ్వకేట్ కిరణ్ లు శాలువతో సత్కరించి పుష్పగుచ్చాలు అందించారు.

# వరి పంట కాకుండా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**
**ఆదర్శ రైతు కొనతం సత్తిరెడ్డి వ్యవసాయ క్షేత్రం సందర్శన**
**బిందు సేద్యం ద్వారా వ్యవసాయం చేసే విధంగా రైతులు సమాయత్తం కావాలి**





చిట్యాల మార్చి 19(వుదయం ప్రతినిధి)బీ నల్గొండ జిల్లా, నకిరేకల్ నియోజకవర్గం, చిట్యాల పట్టణంలోని ఆదర్శ రైతు కొనతం సత్తిరెడ్డి వ్యవసాయ క్షేత్రం ను సందర్శించిన నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతు సాగు చేస్తున్నటువంటి పంటల వివరాలను నీటి వనరుల సంరక్షణ రైతు తీసుకున్నటువంటి జాగ్రత్తల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరము రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం భూగర్భ జలాలు తగ్గడంతో వరి పంట వేసిన రైతులు ఇబ్బంది పడుతున్నారు దీనిని దృష్టిలో పెట్టుకుని వరి పంట కాకుండా ప్రత్యామ్నాయ తక్కువ నీటి వినియోగించుకునే మెట్ట పంటలను పండ్లు కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలియజేయడం జరిగింది. అదేవిధంగా నీటి వనరులను కాపాడుకోవడానికి ఫామ్ ఫాండ్స్ ఏర్పాటు చేసుకొని సూక్ష్మ,బిందు సేద్యం ద్వారా పంటలను సాగు చేసుకునే విధంగా రైతులు సమాయత్తం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి అనంతరెడ్డి, ఎంపీడీవో ఎస్సీ జయలక్ష్మి, ఉపతహసిల్దార్ విజయ, మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు,అర్ ఐ జానీ షరీఫ్, ఏపీఓ శ్రీలత, హార్టికల్చర్ అధికారి శ్వేత, కృష్ణ, కుమారి, మనిషా, వాసుదేవ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రార్థన నిర్వహించని ఉపాధ్యాయులు

**సమయానికి తెరుచుకొని పాఠశాల - సమయపాలన పాటించని అధికారులు**
**- 9 మంది ఉపాధ్యాయులకు 2 హాజరు**





మెదక్, ( 2025 మార్చ్ 19 వుదయం ప్రతినిధి : ప్రభుత్వ పాఠశాలల ద్వారా మెరుగైన విద్యా బోధన చేసి విద్యార్థులను ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో లక్షల రూపాయలు వెచ్చిస్తున్న కార్యరూపం దాల్చే సంఘటనలు కనుచూపమేరలో కానరావడం లేదు ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం ఈనెల 15వ తారీకు నుండి వేసవికాలం కావడంతోని విద్యార్థులు ఎండవేడిమికి గురై అస్వస్థత కాకుండా ఒంటి పూట బడులు ప్రారంభించిన సంగతి అందరికీ తెలిసిన విషయమే... ఉపాధ్యాయులు ఉదయం 7.30 గంటలకే పాఠశాలలకు చేరుకొని 7:45 కు మొదటి బెల్ 7:50 కు రెండవ బెల్ మోగించి విద్యార్థులచే ప్రార్థన ముగించుకొని 8:00 గంటలకు తరగతులు ప్రారంభించవలసి ఉండగా మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8 గంటల వరకు కూడా ఉపాధ్యాయులు రాని పరిస్థితి నెలకొంది. పాత్రికేయులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించగా 9 మంది ఉపాధ్యాయులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరయ్యారు. మిగతా ఏడుగురు ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కాలేదు. ఇదే విషయమై హాజరైన ఇంగ్లీష్ ఉపాధ్యాయులు నరసింహారావు, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు శ్యామల పాత్రికేయులతో మాట్లాడుతూ.... మంగళవారం రోజున పాఠశాల అన్వర్సీ డే జరిగినందున మిగతా ఉపాధ్యాయులు హాజరు కాలేదని తెలిపారు. ఒకవైపు శనివారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యపై విద్యార్థులపై మెరుగైన ఫలితాల పై దృష్టి సారించాల్సిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రిన్సిపల్ వివరణ :-



ఇదే విషయమై ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ నిర్మలను ఫోన్ లో వివరణ అడగగా తన ఆరోగ్యం బాగాలేదని లీవ్ తీసుకున్నానని తెలిపారు. సమయపాలనకు రాని ఉపాధ్యాయుల గురించి ఇన్చార్జి ప్రిన్సిపాల్ ను అడగాలని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

మెదక్ జిల్లా విద్యాధికారి వివరణ :

సమయపాలన పాటించని ఉపాధ్యాయుల విషయమై జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ ను వివరణ కోరగా బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రిన్సిపల్ జయ నిర్మల లీవ్ పెట్టిన విషయం తమ దృష్టికి రాలేదని, తమకు లెటర్ కూడా అందలేదని తెలిపారు. ఈ విషయమై స్థానిక మండల విద్యాధికారితో విచారణ జరిపిస్తామని ఆయన తెలిపారు.

# ఘనంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు...










కుత్బుల్లాపూర్, మార్చి 19,(వుదయం ప్రతినిధి ),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో ఎన్ఎంసి మాజీ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాల వార్షికోత్సవ దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు, సిబ్బందికి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల గౌరవ వందనం అందుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించి అభినందించారు. మాజీ మేయర్ ను విశ్రాంత ఉపాధ్యాయులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అనంతరం మాజీ మేయర్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చక్కటి చదువులను, ఎన్నో విద్యా బుద్ధులను కలిగి భవిష్యత్ లో ఉన్నత స్థానాలకు ఎదిగి నిజాంపేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని, అదే విధంగా మన రాష్ట్ర ఖ్యాతిని పెంపొందించాలని కోరుతూ చక్కటి కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మాజీ మేయర్ కోలన్ నీలాగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి, విద్యార్థుల తల్లిదండ్రులకు స్వీట్స్, స్నాక్స్, సాఫ్ట్ డ్రింక్ తో కూడిన బాక్స్ లను దాదాపు 900 బాక్స్ లను అందించారు. పదవ తరగతి పరీక్షల సందర్భంగా అందరూ పరీక్షలు చాలా బాగా రాసి ఉత్తీర్ణతలో మంచి ఫలితాలను రాబట్టాలని విద్యార్థి, విద్యార్థినిలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఆవుల పావని జగన్ యాదవ్, జెడ్ పి హెచ్ ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు రఘునాథ్, విజయ్ భాస్కర్, రామకృష్ణ, జిల్లా మండల ఉన్నత విద్యాధికారులు, రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు ముక్కర్ల లాలయ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.




# బిజినెస్





## ఎడ్యుకేషన్ లోన్ లేటుగా చెల్లిస్తే ఇంత పెద్ద ప్రయోజనం ఉందా..

ఒక ఎంబీఏ గ్రాడ్యుయేట్ రెడిట్ లో పంచుకున్న పోస్ట్ ఇప్పుడు వైరలవుతోంది. తన ఎడ్యుకేషన్ లోన్ ను చెల్లించడంలో అతడు తీసుకున్న కాల వ్యవధే ఇందుకు కారణం. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ బెంగుళూరు పూర్వ విద్యార్థి అయిన తాను తన లోన్ విషయంలో చేసిన పనిని తెలివైనదిగా చెప్పుకుంటున్నాడు. మూడు నుంచి నాలుగేళ్లు పట్టే లోన్ ను తాను ఏకంగా ఎనిమిదేళ్ల పాటు చెల్లించినట్టు చెప్పాడు. ఇతగాడి ఆర్థిక విశ్లేషణ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఐఐఎం బెంగళూరు నుండి పట్టభద్రుడినయ్యాక కూర్చుని ఎంబీఏ తరహా ఆర్థిక విశ్లేషణ చేసాను. తీసుకున్న ఎడ్యుకేషన్ లోన్ ను తిరిగి చెల్లించడానికి తొందరపడటం ఎందుకని అనిపించింది. నేను తీసుకున్న నిర్ణయాల్లో ఇది అతిపెద్దది. చాలా మంది దీని ట్యాక్స్ ప్రయోజనాలను పట్టించుకోరు. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80ఇ కింద, పన్ను చెల్లింపుదారులు ఎనిమిది సంవత్సరాల వరకు చెల్లించే వడ్డీపై 100% పన్ను మినహాయింపు పొందుతారు. అదే మీరు ఒక వేళ రెండు నుంచి మూడేళ్ల లోపు లోన్ తిరిగి చెల్లించేస్తే ఈ ముఖ్యమైన బెనిఫిట్ ను నష్టపోతారు. మనకున్న పూర్తి పీరియడ్ ను ఉపయోగించుకుని ట్యాక్స్ పేయబుల్ ఆదాయాన్ని మనమెందుకు ఆదా చేసుకోకూడదు? అంటూ అతడు ప్రశ్నించాడు. ఇక రెండో కారణం విషయానికొస్తే.. ఈ రెడిట్ యూజర్ రూ. 20 లక్షల రుణం తీసుకున్న రుణగ్రహీత కేసును ఉదాహరణగా చూపించాడు. 9 శాతం వడ్డీతో, రూ. 20 లక్షల అసలు మొత్తం అలాగే ఉండదు. మీరు తిరిగి చెల్లించడం ప్రారంభించే సమయానికి, పెరిగిన వడ్డీ కారణంగా అది రూ. 25-27 లక్షలకు పెరగవచ్చు అని తెలిపాడు. రుణం వడ్డీ విభాగంలో ఎక్కువ భాగాన్ని మొదటి కొన్ని సంవత్సరాలలో బ్యాంకు సేకరిస్తుందని వివరించాడు. ఎందుకంటే ఈఎంఐ వడ్డీ భాగం మొదటి కొన్ని సంవత్సరాలలో ఈ ఎంఐ ప్రధానంగా తిరిగి చెల్లించే భాగం కంటే చాలా ఎక్కువగా ఉంటుంది. "నా డబ్బునంతా త్వరగా తిరిగి చెల్లించడానికి బదులుగా, నేను దానిని పొదుపులు పెట్టుబడులతో బ్యాలెన్స్ చేసుకున్నాను" అని అతడు తెలిపాడు.

## ఆధార్‌తో ఓటరు కార్డు అనుసంధానం..

త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. ఈ అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది. ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై ఢిల్లీలో జరిగిన సమావేశంలో చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషీ, కేంద్ర హెూంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం.. భారతీయ పౌరులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని.. ఓటర్ల గుర్తింపు కార్డుని ఆధార్‌తో అనుసంధానించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం-1950, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా చేయాలని ఈ భేటీలో నిర్ణయించారు. ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని.. సాంకేతిక అంశాలపై త్వరలో ఖ×ణూ× అధికారులతో సంప్రదింపులు చేయనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై




ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న క్రమంలో ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియ బలోపేతంపై సమావేశానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు,
చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిల్లో ఏవైనా పరిష్కారం కాని సమస్యలపై ఏప్రిల్ 30 నాటికి అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నట్లు ఈసీ తెలిపింది.

## మస్క్‌తో అంబానీ బిగ్ డీల్ ..!

ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఎలాన్ మస్క్‌కు చెందిన ఏరో స్పేస్ కంపెనీ స్పేస్ ఎక్స్‌తో.. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, భారత అపరకుబేరుడు ముకేశ్ అంబానీ డీల్ చేసుకున్నారు. రిలయన్స్ గ్రూప్ డిజిటల్ సంస్థ అయిన జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్.. స్పేస్ ఎక్స్‌కు పూర్తి స్థాయి అనుబంధ సంస్థగా ఉన్నటువంటి స్టార్ లింక్ సర్వీసెస్‌తో జట్టుకట్టింది. ఇది శాటిలైట్ ఆధారిత టెలికాం సేవలను అందిస్తుండగా ఇప్పుడు భారత్‌లో జియో కోసం పనిచేయనుంది. అయితే.. మార్చి 11 న భారతీ ఎయిర్‌టెల్ కూడా ఇదే స్టార్ లింక్‌తో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరుసటి రోజే జియో అలాంటి డీల్‌ను కుదుర్చుకోవడం విశేషం. దేశీయంగా ప్రత్యర్థులుగా ఉన్న జియో, ఎయిర్‌టెల్‌కు ఇప్పుడు ఒకే సంస్థ..



భారత్‌లో శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సర్వీసులను అందిస్తుందన్నమాట. భారత్‌లోనూ

స్టార్ లింక్ సంస్థకు అనుమతులు లభించిన తర్వాత.. ఈ రెండు సంస్థలు అంటే జియో, ఎయిర్‌టెల్ శాటిలైట్ హైస్పీడ్ ఇంటర్నెట్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నాయని చెప్పొచ్చు. ఈ మేరకు మార్చి 12న జియో.. ఈ ఒప్పందం గురించి వెల్లడించింది. తన అధికారిక ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో ఒప్పందం వివరాల్ని ప్రస్తావించింది. 'అందరికీ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందించేందుకు.. ఈ భాగస్వామ్యం ఒక కీలక అడుగు. జియో బ్రాడ్‌బ్యాండ్ సిస్టమ్‌తో స్టార్ లింక్‌ను లింక్ చేయడం ద్వారా మా పరిధి మరింత విస్తరించనున్నాం. ఈ డీల్ అనేది ఏఐ ఆధారిత యుగంలో కూడా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ విశ్వసనీయతను మరింత పెంచడంలో దోహదపడుతుంది.' అని జియో వెల్లడించింది. జియో తన రిటైల్ అవుట్‌లెట్స్ సహా ఆన్‌లైన్ వేదికగా స్టార్ లింక్ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించింది. పరస్పరం తమ ప్రయోజనాల్ని అందిపుచ్చుకొని రెండు కంపెనీలు ముందుకు సాగనున్నట్లు జియో.. తన ప్రకటనలో వెల్లడించింది. దీనికి ముందు రోజే.. ఎయిర్‌టెల్ స్టార్ లింక్ ఒప్పందం గురించి వివరించింది. స్టార్ లింక్‌తో ఒప్పందం ద్వారా.. దేశంలోని మారుమూల గ్రామాలకు కూడా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందించేందుకు కళషి చేస్తామని స్పష్టం చేసింది.

## వైద్య బీమాలోకి ఎల్ఐసి





ప్రభుత్వ రంగంలోని దిగ్గజ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) అతి త్వరలోనే వైద్య బీమా రంగంలోకి అడుగు పెట్టనుంది. ఇందుకోసం ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలుకు చర్చలు జరుపుతోంది. ఇదే విషయాన్ని ఎల్ఐసి ఛైర్మన్ సిద్దార్థ మోహంతి మంగళవారం వెల్లడించారు. వైద్య బీమా కంపెనీలో వాటాల కొనుగోలు అంశంపై మార్చి 31 కల్లా పూర్తి స్పష్టతను ఇవ్వనున్నామని చెప్పారు. అయితే ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేసే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. కాగా.. మెజారిటీ వాటా 51 శాతం లేదా అంతకంటే ఎక్కువ వాటాను మాత్రం కొనుగోలు చేయడం లేద న్నారు. దీంతో మైనార్టీ వాటాను కొనుగోలు చేసే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

ఎల్ఐసి విలువ, బోర్డు నిర్ణయాలు ఇతరత్రా అవకాశాల్ని పరిగణనలోకి తీసుకొని వైద్య బీమా సంస్థలో వాటా కొనుగోలు ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత బీమా సంస్థలు పాలసీ తీసుకున్న వ్యక్తులు ఏదైనా కారణంతో ఆసుపత్రిలో చేరితే ఎటుంటి ఆరోగ్య బీమా కవరేజ్‌లను అందించడం లేదు. ఇటీవల మణిపాల్‌సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్‌లో ఎల్ఐసి వాటాలను కొనుగోలు చేస్తోన్నట్లు రిపోర్టులు వచ్చాయి. బీమా రంగంలోకి ప్రవేశించడం ద్వారా తన ఉనికిని మరింత విస్తరించుకోవాలని ఎల్ఐసి లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తి స్పష్టత కోసం రెండు వారాలు ఆగాలి. మోహంతి ప్రకటనతో మంగళవారం బిఎస్ఇలో ఎల్ఐసి షేర్ విలువ 1.70 శాతం పెరిగి రూ.757.65 వద్ద ముగిసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

## ఇన్వెస్టర్లకు శుభవార్త..

### త్వరలో అమెజాన్ ఐపీఓ కూడా..




ఇన్వెస్టర్లకు గుడ్ న్యూస్ రాబోతుంది. ఎందుకంటే అమెరికాకు చెందిన ప్రముఖ ఈ కామర్స్ సంస్థ అమెజాన్ కూడా ఇండియాలో తన భారతీయ విభాగాన్ని సపరేట్ చేసి స్టాక్ మార్కెట్లో ఐపీఓకు రావాలని చూస్తోంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ వర్గాలు చర్చలు ప్రారంభించినట్లు తెలిసింది.ఈ క్రమంలో అమెజాన్ తన వాల్ స్ట్రీట్ బ్యాంకింగ్ భాగస్వామి జేపీ మోర్గాన్‌తోపాటు భారతదేశంలోని పెట్టుబడి బ్యాంకులతో చర్చలు ప్రారంభించిందని ఓ నివేదిక తెలిపింది. ఈ నేపథ్యంలో గత వారం అమెజాన్ ఇండియా దీని కోసం 8 నుంచి 10 పెట్టుబడి బ్యాంకులను ఆహ్వానించింది. భారత నిబంధనల ప్రకారం, దేశీయ కంపెనీలు మాత్రమే ఇన్వెంటరీ ఆధారిత ఇ-కామర్స్ మోడల్ కింద పనిచేస్తాయి. తద్వారా వేగవంతమైన డెలివరీలు, షిప్పింగ్ ఖర్చులను తగ్గించుకోవడానికి అవకాశం ఉంటుంది. అయితే, విదేశీ సంస్థలు కొనుగోలుదారులు, విక్రేతల మధ్య మధ్యవర్తిగా పనిచేసే మార్కెట్ ప్లేస్ మోడల్ విధానాన్ని అనుసరించాలి. ఈ నియంత్రణ అంతరం చాలా కాలంగా అమెజాన్‌కు సవాలుగా మారింది. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ జియోమార్ట్ వంటి స్వదేశీ కంపెనీలతో సమర్థవంతంగా పోటీ పడే సామర్థ్యాన్ని పరిమితం చేస్తుంది. ఈ నిర్ణయం ద్వారా అమెజాన్ ప్రధానంగా స్థానిక డేటా అవసరాలు, భారతదేశంలో ప్రత్యక్ష జాబితాను నిర్వహించగల సామర్థ్యాన్ని కల్గి ఉంటుందని నివేదిక తెలిపింది. ఈ క్రమంలో మార్కెట్లో ఖర్చులు తగ్గిపోయి, వ్యాపారం పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటికే భారతదేశంలో ఈ-కామర్స్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇంటర్నెట్ వ్యాప్తి, డిజిటల్ చెల్లింపు పరిష్కారాలు పెరుగుతున్నాయి. దీంతో ఈ పరిశ్రమ 2030 నాటికి 350 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ఈ విభాగంలో అపారమైన వృద్ధి అవకాశం ఉందని చెబుతున్నారు.

## ఎట్టకేలకు మురిసిన దలాల్ స్ట్రీట్

చాలా రోజులుగా తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న దలాల్ స్ట్రీట్ ఎట్టకేలకు మురిపించింది. పలు సానుకూల సంకేతాలతో మంగళవారం భారత మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేశాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 1131 పాయింట్లు లేదా 1.53 శాతం పెరిగి 75,301కి చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 326 పాయింట్లు లేదా 1.45 శాతం లాభపడి 22,834 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1200 పాయింట్ల మేర ర్యాలీ చేసి 75,385 గరిష్టాన్ని తాకింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల విలువ రూ.6.85 లక్షల కోట్లు పెరిగి రూ.400.03 లక్షల కోట్లకు చేరింది. డాలరుతో రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి 86.54గా నమోదయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో జొమాటో, ఐసిఐసిఐ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఫిన్‌సర్వ్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిక నష్టాలు చవి చూశాయి. అమెరికా, ఆసియా మార్కెట్లలో లాభాలు చోటు చేసుకోవడం భారత మార్కెట్లలోనూ విశ్వాసాన్ని నింపాయి. చైనా ఆర్థికాభివృద్ధి చర్యల కారణంగా హాంకాంగ్ హాంగ్‌సెంగ్ ఏకంగా 2 శాతం మేర పెరిగి మూడేళ్ల గరిష్ఠానికి ఎగిసింది. అమెరికాతో కొనసాగుతున్న వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో చైనా దేశీయంగా వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టింది. దీంతో ఆ దేశ మార్కెట్లు పరుగులు పెట్టాయి. వాణిజ్య యుద్ధ భయాలతో ఇటీవల భారీగా పడిపోయిన షేర్ల విలువలు కొనుగోళ్లకు ఆకర్షణీయంగా ఉండటంతో మార్కెట్లకు మద్దతు లభించిందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎన్ఎస్ఇలో అన్ని రంగాల సూచీలు లాభపడ్డాయి. రియాల్టీ, మీడియా రంగాలు 3 శాతం చొప్పున పెరిగాయి. ఆటో, పిఎస్‌యు బ్యాంక్, లోహ, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు 2 శాతం చొప్పున లాభపడ్డాయి.



# జాతీయం – అంతర్జాతీయం

## పక్క దేశాల కన్నా మన దగ్గరే రైలు చార్జీలు బాగా తక్కువ



భారత్‌లో రైల్వే చార్జీలు పాకిస్తాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాల్లో కన్నా బాగా తక్కువ అని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మంగళవారం లోక్‌సభలో స్పష్టం చేశారు. కాగా, రైల్వే శాఖ మంత్రిగా ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఉన్నప్పటి కన్నా రైలు ప్రమాదాలు 90 శాతం మేర తగ్గాయని ఆయన నొక్కిచెప్పారు. 202526 సంవత్సరానికి రైల్వే మంత్రిత్వశాఖ కింద బడ్జెట్ పద్దులపై చర్చకు మంత్రి సమాధానం ఇస్తూ, జాతీయ రవాణా సంస్థ రైల్వేలు తన ఖర్చులు భరించేందుకు కొవిడ్ మహమ్మారి నాటి ఇబ్బందుల నుంచి బయటపడిందని తెలియజేశారు. మహా కుంభమేళాపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటనపై మాట్లాడేందుకు తమను అనుమతించకపోవడంపై ప్రతిపక్షాలు పెద్ద పెట్టున నిరసనలు వ్యక్తం చేస్తుండగానే మంత్రి మాట్లాడుతూ, స్టేషన్లలో జన సమూహం నియంత్రణకు రైల్వే శాఖ పలు చర్యలు తీసుకున్నదని, పండుగల సీజన్లలో పలు ప్రత్యేక రైళ్లు నడుపుతోందని తెలిపారు. భద్రతపై ప్రధాని నరేంద్ర మోదీ దృష్టి కేంద్రీకరించడంతో రైలు ప్రమాదాల సంఖ్య లాలూ యాదవ్ కాలంలో కన్నా 90 శాతం మేర తగ్గినట్లు వైష్ణవ్ తెలియజేశారు. 'లాలూ యాదవ్ కాలంలో ఒక సంవత్సరంలో దాదాపు 234 ప్రమాదాలు, 464 రైళ్లు పట్టాలు తప్పిన సంఘటనలు, ఏడాదికి దాదాపు 700 జరిగాయని వైష్ణవ్ తెలిపారు.

ప్రధాని మోదీ భద్రతపై దృష్టి కేంద్రీకరించి, కొత్త టెక్నాలజీని, పెట్టుబడులను తెచ్చారని, ఇప్పుడు దుర్ఘటనల సంఖ్య 33 ప్రమాదాలకు, 43 పట్టాలు తప్పిన ఘటనలకు తగ్గిందని ఆయన చెప్పారు. పది వేల లోకోమోటివ్‌లపైన, 15 వేల కిమీ మేర కవచ్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి తెలియజేశారు. రైల్వే శాఖ 2020 తరువాత చార్జీలను పెంచలేదని, అప్పటి నుంచి స్థిరంగానే ఉన్నాయని ఆయన చెప్పారు. రైల్వే శాఖకు బడ్జెట్‌ను 'చరిత్రాత్మకమైనది'గా వైష్ణవ్ శ్లాఘిస్తూ, తమ శాఖ సొంత ఆదాయంలో నుంచే ఖర్చులు అన్నీ భరిస్తోందని తెలిపారు. లోక్‌సభ ఆ తరువాత రైల్వే మంత్రిత్వశాఖ బడ్జెట్ పద్దులను ఆమోదించింది.

## భూమికి చేరిన సునీతా, విల్మోర్

భూమి మీదకు సునీతా విలియమ్స్, విల్మోర్ సురక్షితంగా అడుగుపెట్టారు. బుధవారం తెల్లవారుజామున ఉదయం 3.27 గంటలకు క్రూ డ్రాగన్ వ్యోమనౌక ఫ్లోరిడాలోని సముద్ర తీరంలో దిగింది. సునీతా విలియమ్స్ 9 నెలల తర్వాత అంతరిక్షం నుంచి భూమ్మీద చేరుకున్నారు. క్రూ డ్రాగన్ వ్యామనౌక ల్యాండింగ్ సక్సెస్ తో నాసా శాస్త్రవేత్తల సంబరాలు చేసుకున్నారు. సునీతా, విల్మోర్ లతో పాటు నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలగ్జెండర్ గుర్బునోవ్ అంతరిక్షం నుంచి భూమి మీదకు చేరుకున్నారు. 2024 జూన్ 5న స్టార్ లైనర్ వ్యోమనౌకలో సునీత, విల్మోర్ అంతరిక్షానికి వెళ్లారు. ఆ సమయంలో వారం రోజుల్లో తిరిగి రావాల్సి ఉన్న సాంకేతిక సమస్యతో గతంలో వ్యోమనౌక స్టార్ లైనర్ ఖాళీగా తిరిగొచ్చింది. సునీత, బుచ్ విల్మోర్ 288 రోజులు అంతరిక్ష కేంద్రంలోనే ఉండిపోయారు. సునీత మూడో అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేశారు. 2006, 2012లోనూ అంతరిక్ష యాత్రను విజయవంతంగా పూర్తి చేసిన ఘనత ఆమెకే దక్కుతుంది. వ్యోమగాములు సురక్షితంగా, ఆరోగ్యంగా ఉన్నారని నాసా ప్రకటించింది. ప్రశాంత వాతావరణం వల్ల డ్రాగన్ క్యాప్సుల్స్, ల్యాండింగ్ ఇబ్బంది కాలేదని వివరించింది. ల్యాండింగ్ సమయంలో భద్రతాపరంగా



అమెరికా కోస్ట్ గార్డ్ అన్ని చర్యలు తీసుకుందని, అన్ డాకింగ్ నుంచి సాఫ్ట్ ల్యాండింగ్ వరకు అన్నీ అనుకున్నట్లు జరిగాయని సంతోషం వ్యక్తం చేసింది. స్పెస్ ఎక్స్ సంస్థ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యతో శక్తిని చాటిందని కొనియాడింది. భవిష్యత్ అంతరిక్ష ప్రయోగాలు, ప్రైవేట్ భాగస్వామ్యాలకు ఇదో సరికొత్త పద్ధతి నాంది పలికిందని మెచ్చుకుంది. క్యూ-9 వ్యోమగాములు 150కి పైగా ప్రయోగాలు నిర్వహించారని, క్యాన్సర్లకు పరిష్కారాలు చూపే మార్గాలపైనా పరిశోధనలు చేశారని పేర్కొంది. వ్యోమగాముల కృషి, పరిశోధనలు భవిష్యత్ కు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించింది.

## ఆధార్‌తో ఓటర్‌కార్డు లింక్!

న్యూఢిల్లీ : విశిష్ట గుర్తింపు సంఖ్య గల కార్డు ఆధార్‌తో వోటర్ కార్డు అనుసంధానానికి ఎన్నికల కమిషన్ (ఇసి) మొగ్గు చూపింది. ప్రస్తుత చట్టం, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం ఆధార్‌తో వోటర్ కార్డును అనుసంధానిస్తామని ఇసి మంగళవారం ప్రకటించింది. ఈ ప్రక్రియ నిమిత్తం యుఐడిఎఐ, దాని నిపుణులతో సాంకేతికపరమైన సంప్రదింపులను 'త్వరలో ప్రారంభించగలం' అని ఇసి తెలియజేసింది. వోటర్ కార్డు, ఆధార్ అనుసంధానం విషయమై ఇసి మంగళవారం కేంద్ర హోమ్ కార్యదర్శి, (న్యాయ మంత్రిత్వశాఖలోని) శాసన వ్యవహారాల కార్యదరి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ కార్యదర్శి, యుఐడిఎ ఐ సిఇఒలతో సమావేశం నిర్వహించింది. వోటింగ్ హక్కులు భారత పౌరునికి మాత్రమే మంజూరు చే స్తుండగా, రాజ్యాంగంలోని 326 అధికరణం ప్రకా రం ఆధార్ ఒక వ్యక్తి గుర్తింపును నిర్ధారిస్తుందని ఇసి ఒక ప్రకటనలో తెలియజేసింది.'అందువల్ల రాజ్యాంగం 326




అధికరణం, 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్లు 23(4), 23(5), 23(6) నిబంధనల ప్రకారం, (2023 నాటి) సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఆధార్‌తో వోటర్ ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్)ను అనుసంధానించాలని నిర్ణయించడమైంది' అని ఇసి వివరించింది. తదనుగుణంగా యుఐడిఎఐ, ఇసి సాంకేతిక నిపుణుల మధ్య సాంకేతికపరమైన సంప్రదింపులు 'త్వరలో ప్రారంభం కానున్నాయి' అని ఇసి తెలియజేసింది. ఆధార్ డేటాబేస్‌తో వోటర్ల జాబితాల ఐచ్ఛిక అనుసంధానాన్ని చట్టం అనుమతిస్తున్నది. కాగా, ఆధార్ వోటర్ కార్డు అనుసంధానం ప్రక్రియకు ఎటువంటి లక్ష్యాన్ని లేదా కాలపరిమితులను నిర్దేశించలేదరి ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. తమ ఆధార్ వివరాలను వోటర్ల జాబితాతో అనుసంధానం చేయనివారి పేర్లను వోటర్ల జాబితాల్లో నుంచి తొలగించడం జరగదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎన్నికల శాసనాలు (సవరణ) చట్టం 2021 ద్వారార సవరించిన ప్రకారం 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 23 కింద ఐచ్ఛికంగా గుర్తింపును నిర్ధారించేందుకు ఆధార్ కార్డు చూపాలని ప్రస్తుత లేదా రాబోయే వోటర్‌ను వోటర్ల నమోదు అధికారులు కోరడానికి వీలు కల్పిస్తోంది.

## గాజాపై మరో సారి విరుచుకుపడ్డ ఇజ్రాయిల్



పాలస్తీనా గాజాపై ఇజ్రాయిల్ యుద్ధవిమానాలు మరో సారి బాంబులవర్షం కురిపించడంతో దాదాపు 400 మంది చనిపోయారు. కాల్పుల విరమణ ముగిసిన తర్వాత ఇంత భారీ ఎత్తున ఇజ్రాయిల్ విరుచుకుపడడం ఇదే ప్రథమం. జనవరిలో అమలులోకి వచ్చిన కాల్పుల విరమణ ముగిసింది. దీంతో ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు, గాజా సిటీ, దేర్ అల్ -బలా, ఖాన్ యూనిస, రఫా నగరాలలో బాంబుల వర్షం కురిపించాయి. జనం అప్రమత్తం అయ్యేలోగానే వందలాదిమంది చనిపోయారు. జనావాసాలపై బాంబుల వర్షం కురవడంతో పిల్లలతో సహా చాలామంది చనిపోయినట్లు పాలస్తీనా వైద్యశాఖ అధికారులు తెలిపారు. చాలా మంది నిరాశ్రయులయ్యారు.దాడులు చేసేందుకు ముందు ఇజ్రాయెల్ అధికారులు అమెరికా ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ కు సమాచారం ఇచ్చినట్లు వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తెలిపారు. అంతకు ముందే.. టెర్రరిస్ట్ చర్యలను పూర్తిగా మానుకోవాలని లేని పక్షంలో భారీ నష్టం తప్పదని డోనాల్డ్ ట్రంప్ హమాస్, ఇతర టెర్రరిస్ట్ గ్రూప్ లను, ఇరాన్ మద్దతు గల హౌతీలను హెచ్చరించారని వైట్ హౌస్ ప్రతినిధి వివరించారు. కాల్పుల విరమణ ముగియడానికి ముందే గాజాలో బందీలుగా ఉన్న 59 మంది ఇజ్రాయిలీలను విడిపించేందుకు ఇజ్రాయెల్ , హమాస్ మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు నిప్పులు కక్కాయి. ఈజిప్ట్, ఖతార్ నేతృత్వంలో అమెరికా మద్దతుతో హమాస్ తో చర్చలు జరిగినా హమాస్ బందీలవిడుదలకు ససేమిరా అందని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఆరోపించారు. నెతన్యాహూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి, పదేపదే సైనిక దాడులు తప్పవని హెచ్చరిస్తూ, ఉద్దేశ పూర్వకంగానే బందీలను ప్రమాదంలోకి నెట్టారని హమాస్ ఆరోపించింది. తిరిగి దాడులకు తెగపడాలన్న ఇజ్రాయిల్ ప్రధాని నిర్ణయం.. హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారికి మరణశాసనం కాగలదని హమాస్ తీవ్రంగా హెచ్చరించింది.

## పార్లమెంటు ఎదుట డిఎంకె నిరసన




న్యూఢిల్లీ : డీలిమిటేషన్ అంశంపై ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె) పార్లమెంటు ఎదుట బుధవారం ఆందోళన చేపట్టింది. డిఎంకె ఎంపిలు కనిమొళి, టి.శివ, దయానిధి మారన్‌లు ఆందోళనలో పాల్గొన్నారు. న్యాయమైన డీలిమిటేషన్ అని రాసిన బ్యానర్‌ను ప్రదర్శించారు. డీలిమిటేషన్‌ను డిఎంకె తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. పార్లమెంటు వేదికగా గత కొన్ని రోజులుగా ఈ అంశంపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. మార్చి 10న ప్రారంభమైన పార్లమెంట్ బడ్జెట్ సెషన్ ఏప్రిల్ 14 వరకు కొనసాగనుంది. డీలిమిటేషన్ 'సమాఖ్యవాదంపై బహిరంగ దాడి'గా తమిళనాడు సిఎం స్టాలిన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈచర్యకు వ్యతిరేకంగా ఐక్య రాజకీయ ఫ్రంట్‌కు పిలుపునిచ్చారు. మార్చి 8న స్టాలిన్ ఎన్‌డిఎ పాలిత రాష్ట్రాలు సహా ఏడు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు రాశారు. ఈ అన్యాయమైన చర్యకు వ్యతిరేకంగా పోరాటంలో తనతో చేరాలని లేఖలో పేర్కొన్నారు. కేరళ సిఎం పినరయి విజయన్, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ, ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాంఝీ సహా ఆయా రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కోరారు.

## పెరూలో నెలరోజుల పాటు అత్యయిక పరిస్థితి

లిమా : పెరూ రాజధాని లిమాలో నెలరోజుల పాటు అత్యయిక పరిస్థితి విధించినట్లు అధ్యక్షులు డినా బోలువార్టే ప్రకటించారు. ఆదివారం ప్రముఖ గాయకుని హత్యకు నిరసనగా చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. రాజధాని సహా పలు ప్రాంతాల్లో పోలీసులతో పాటు అదనపు బలగాలను మోహరించాల్సిందిగా ఆదేశించింది. సెప్టెంబర్, డిసెంబర్ మధ్య హింసను అరికట్టేందుకు బోలువార్టే ప్రభుత్వం అత్యయిక పరిస్థితిని విధించిన సంగతి తెలిసిందే. అత్యయిక పరిస్థితి 30 రోజులు కొనసాగుతుందని అధ్యక్షులు డినా బోలువార్టే సోమవారం జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. ప్రభుత్వ అధికారుల సమావేశం, అసెంబ్లీ నిర్వహణ స్వేచ్ఛ సహా ఇతర హక్కులపై ఆంక్షలు విధించినట్లు తెలిపింది. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా పోలీసులు మరియు సైన్యం ప్రజలను అదుపులోకి



తీసుకోవచ్చని పేర్కొంది. ఇటీవలి కాలంలో పెరూలో హత్యలు, హింసాత్మక దోపిడీలు, బహిరంగ ప్రదేశాలపై దాడులు పెరిగాయి. జనవరి 1 నుండి మార్చి 16 వరకు 459 హత్యలు జరిగినట్లు పోలీసులు ఒక నివేదికలో పేర్కొన్నారు. ఒక్క జనవరి నెలలోనే 1,909 దోపిడీలు జరిగినట్లు తెలిపింది. గత శనివారం లిమాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన పేలుడులో 11 మంది గాయపడ్డారు. కుంబియా బ్యాండ్ అర్మోనియా 10 ప్రధాన గాయకుడు పాల్‌ఫ్లోర్స్ మార్చి 16 (ఆదివారం) హత్యకు గురయ్యారు. లిమాలో కచేరీ తర్వాత పాల్‌ఫ్లోర్స్, అతని బ్యాండ్ ప్రయాణిస్తున్న బస్సుపై దుండగులు కాల్పులు జరిపారు.

ఈ కాల్పుల్లో పాల్‌ఫ్లోర్స్ మరణించారు. హింసాత్మక ఘటనలను అరికట్టడంలో విఫలమయ్యారంటూ అంతర్గత మంత్రి జువాన్ జోస్ శాంటివానెజ్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కాంగ్రెస్‌లో ప్రతిపక్ష సభ్యులు నిర్ణయించారు ఈ వారం చివర్లో జరిగే కాంగ్రెస్ ప్లీనరీలో ఓటింగ్ గురించి చర్చించే అవకాశం ఉంది.

### మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె

మే 20న దేశ వ్యాప్త సమ్మెకు అనేక కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. లేబర్ కోడ్ రద్దు చేయడం, ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపాలనే డిమాండ్లతో ఈ సమ్మె నిర్వహించనున్నాయి. నెలవారీ కనీస వేతనం రూ .26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ పెన్షన్ రూ. 9000 అందించడం కూడా ఈ సంఘాల డిమాండ్లలో ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రాని వారికి నెలకు రూ. 6000 ఇవ్వాలని కూడా యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు , స్వతంత్ర రంగాల సమాఖ్యలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జాతీయ సమావేశం నిర్వహించాయి. రెండు నెలల పాటు ప్రచారం జరపాలని కార్మిక సంఘాలన్నీ కలిపి ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సమ్మె భవిష్యత్తులో కార్మికులు, రైతుల దేశవ్యాప్త నిర్ణయాత్మక పోరాటాలకు నాంది పలుకుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలకు వ్యతిరేకంగా ఈ పోరాటం కొనసాగిస్తున్నట్టు కార్మిక సంఘాలు తెలిపాయి.

## ఎంజిఎన్ఆర్ఈజిఏ పథకాన్ని కేంద్రం బలహీనపరుస్తోంది:

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఓ పద్ధతి ప్రకారం గ్రామీణ ఉపాధి హామీ పథకం అయిన 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(ఎంజిఎన్‌ఆర్‌ఈజిఏ)2005ను బలహీనపరుస్తోందని కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ మంగళవారం రాజ్యసభలో అన్నారు. శూన్యకాలంలో ఈ ప్రస్తావనను లేవనెత్తి ఈ పథకం కింద కనీస వేతనాన్ని రోజుకు రూ. 400 చేయాలని, 150 రోజుల పనిదినాలు కల్పించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ పథకానికి కేటాయిస్తున్న మొత్తం రూ. 86,000 కోట్ల వద్దే స్తబ్ధుగా



ఉండిపోయిందన్నారు. ఇది జిడిపిలో 10 ఏళ్ల కనిష్ఠ శాతంలో ఉందని పేర్కొన్నారు. ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసినప్పుడు ఈ మొత్తం రూ. 4000 కోట్లు పడిపోయిందన్నారు. ఎంజిఎన్‌ఆర్‌ఈజిఏ పథకం వేతనాలు రాష్ట్రానికి రాష్ట్రానికి మధ్య తేడా కలిగి ఉందన్నారు. ఉత్తరాఖండ్‌లో రోజుకు రూ. 237గా ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో రోజుకు రూ. 300గా ఉందన్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే సోనియా గాంధీ జీరో అవర్‌లో ఓ అంశాన్ని లేవనెత్తడం అన్నది గత ఏడాది ఫిబ్రవరిలో రాజ్యసభకు ఎన్నికయ్యాక ఇది రెండోసారి. జీరో అవర్‌లో ఓ అంశాన్ని లేవనెత్తాలంటే సభాధ్యక్షుడి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

## సమాచార సమన్వయంతో పోరాటాలకు స్ఫూర్తి

హవానా : ప్రపంచంలోని వివిధ దేశాల్లో పోరాడే ప్రజల మధ్య జరిగే సమాచార సమన్వయం పోరాటాలకు మరింత స్ఫూర్తి నిస్తుందని లాటిన్ అమెరికా దేశాల ప్రత్యామ్నాయ టెలివిజన్ ఛానల్ 'టెలిసూర్' ప్రెసిడెంట్ పట్టిసియా విజగ అన్నారు. క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా (యుపిఇసి)'పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్యూమ్ 4వ ఏడిషన్ 'అంతర్జాతీయ సదస్సును సోమవారం హవానాలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు 46 దేశాల నుండి 300మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన పట్టిసియా విజగ పోరాడే ప్రజల మధ్య పరస్పర సమాచార మార్పిడి అత్యంత కీలకమని చెప్పారు. టెలిసూర్ ప్రారంభం నుండి ఈ లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. వెనిజులా మాజీ అధ్యక్షుడు ఛావెజ్ చొరవతో 2000 సంవత్సరంలో ప్రారంభమైన తమ సంస్థ 2005 నుండి కార్పొరేట్ మీడియా సంస్థల కట్టుకథలపై విస్తృతమైన పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వెనిజులాతో పాటు లాటిన్ అమెరికా అంతా విస్తరించి పోరాడే ప్రజలకు సంఘీభావంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్‌లో చోటుచేసుకున్న అకృత్యాలను, అమానుష హింసాకాండను వెలికితీసే క్రయంలో భద్రతకు



సంబంధించి తీవ్రమైన సమస్యలు ఎదుర్కొన్నట్లు చెప్పారు. భాషా సంబంధిత సమస్యలు వీటికి అదనమని చెప్పారు. అటువంటి అవాంతరాలు ఎన్ని ఉన్నా అధిగమించి ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. అంతర్జాతీయంగా ఈ కృషిని మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన బాధ్యత వివిధ దేశాల్లో ఉన్న ప్రత్యామ్నాయ మీడియా సంస్థలపై ఉందని చెప్పారు. తాము ప్రారంభించిన కాలంలో సాంకేతికతకు పరిమితులుండేవని, ఇప్పుడు ఎఐతో సహా ఆధునిక సాకేతికత అందుబాటులోకి వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని చెప్పారు. ఆమె ప్రసంగాన్ని హవానా విశ్వవిద్యాలయంకు చెందిన కమీల అనే జర్నలిజం విద్యార్థిని అంగ్లంలోకి అనువదించారు.

# చక్కని ఆరోగ్యం



## బెల్లం వర్సెస్ పంచదార ఏది ఆరోగ్యానికి మంచిది..?

బెల్లం మన సంప్రదాయ ఆహారంలో చాలా ముఖ్యమైనది. ఇది సహజంగా తీయగా ఉండి ఆరోగ్యానికి కూడా మంచిదని చాలా మంది నమ్ముతారు. అయితే ఇటీవల బెల్లం తింటే కిడ్నీలు దెబ్బతింటాయి అనే మాట ప్రచారం అవుతోంది. ఇది నిజమేనా..? లేక ఇది కేవలం అపోహ మాత్రమేనా..? బెల్లం చెరకు రసం లేదా తాటి రసం నుండి తయారవుతుంది. ఇది శుద్ధి చేయని సహజ తీపి పదార్థం కాబట్టి ఇందులో ఖనిజాలు, విటమిన్లు సహజంగా ఉంటాయి. బెల్లంలో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి అనేక ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. శరీరానికి తక్షణ శక్తిని అందించడంతో పాటు, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇది సహాయపడుతుంది. జీర్ణ వ్యవస్థకు మేలు.. బెల్లం తినడం వల్ల జీర్ణక్రియ మెరుగవుతుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌లను ఉత్తేజపరచి మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. శక్తిని అందించే సహజమైన మూలం.. దీంట్లో గ్లూకోజ్, సుక్రోజ్ ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. అలసటగా ఉన్నప్పుడు కొద్దిగా బెల్లం తింటే శరీరానికి ఉత్సాహం వస్తుంది. రక్తహీనత నివారణ.. బెల్లంలో ఐరన్ ఎక్కువగా ఉండటం వల్ల ఇది హీమోగ్లోబిన్ స్థాయిని పెంచి రక్తహీనత సమస్యను తగ్గించడంలో సహాయపడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. దీంట్లో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల శరీరాన్ని హానికరమైన టాక్సిన్స్ నుంచి రక్షిస్తుంది. కాలేయాన్ని శుభ్రపరుస్తుంది.. బెల్లం నేచురల్ డిటాక్సిఫైయింగ్ ఏజెంట్‌గా పని చేస్తుంది. ఇది కాలేయాన్ని శుభ్రపరచి ఆరోగ్యంగా ఉంచుతుంది.

బెల్లం అధికంగా తీసుకోవడం వల్ల సమస్యలు ఏర్పడే అవకాశం ఉంది. బెల్లంలో సహజంగా చక్కెర ఉండటంతో దీన్ని అధికంగా తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరిగే అవకాశం ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు బెల్లం ఎక్కువగా తింటే అది కిడ్నీలపై ఒత్తిడిని పెంచి దీర్ఘకాలికంగా సమస్యలను పెంచొచ్చు. బెల్లంలో పొటాషియం ఉంటుంది. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వారిలో పొటాషియం స్థాయిలు పెరిగితే అది హానికరం కావచ్చు. లిమిటెడ్ గా తీసుకోవడం ఏ ఆహారమైనా మితంగా తీసుకుంటే మంచిది. రోజుకు 1-2 టేబుల్ స్పూన్ల బెల్లం తీసుకోవడం సాధారణంగా సురక్షితం. అయితే డయాబెటిస్ ఉన్నవారు లేదా కిడ్నీ సమస్యలు ఉన్నవారు డాక్టర్‌ను సంప్రదించాకే దీన్ని తీసుకోవడం మంచిది.

## పొద్దుతిరుగుడు విత్తనాలు తింటే ఏం జరుగుతుంది?

పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి ఎన్నో లాభాలను అందిస్తాయి. వీటిలో ప్రోటీన్, కాల్షియం, ఐరన్, జింక్ వంటి పోషకాలు ఎక్కువగా ఉంటాయి. రోజూ కొంతమేర తింటే శరీరానికి అవసరమైన ఎన్నో పోషకాలు అందుతాయి. వీటిని కాల్చి తింటే మరింత ప్రయోజనం పొందొచ్చు. పొద్దుతిరుగుడు విత్తనాల్లో మెగ్నీషియం, ఫాస్ఫరస్, కాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచి దృఢంగా మారేలా చేస్తాయి. ముఖ్యంగా వయసు పెరిగే కొద్దీ ఎముకల బలహీనత సమస్యలు రావచ్చు. అలాంటి సమయంలో ఈ విత్తనాలను ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. ఫోలేట్ ఎక్కువగా ఉండే పొద్దుతిరుగుడు విత్తనాలు పురుషులు, మహిళలకు పునరుత్పత్తి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడతాయి. ఫోలేట్ శిశువులలో నాడీ గొట్టపు లోపాలను తగ్గించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉన్న జింక్ పురుషులలో



స్పెర్మ్ నాణ్యతను మెరుగుపరిచే లక్షణాలను కలిగి ఉంది. విటమిన్ E సమృద్ధిగా ఉండటంతో పొద్దుతిరుగుడు విత్తనాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇవి చర్మాన్ని కాంతివంతంగా తేమతో నిండినట్లు ఉంచుతాయి. జుట్టు ఆరోగ్యంగా దృఢంగా మారేందుకు ఈ విత్తనాలు ఉపయోగపడతాయి. కాలుష్యం, వయసు పెరిగే కొద్దీ వచ్చే చర్మ సమస్యలను తగ్గించేందుకు సహాయపడతాయి.పొద్దుతిరుగుడు విత్తనాల్లో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, హృదయ సంబంధిత వ్యాధుల రిస్క్‌ను తగ్గిస్తాయి. రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇవి సహాయపడతాయి. పొద్దుతిరుగుడు విత్తనాల్లో మెగ్నీషియం, ఫైబర్, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్సులిన్ లెవల్స్‌ను క్రమబద్ధీకరించడానికి సహాయపడతాయి. మధుమేహం ఉన్నవారు ఇవి తింటే రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. విటమిన్ E, ఫ్లేవనాయిడ్లు వంటి యాంటీఆక్సిడెంట్లు పొద్దుతిరుగుడు విత్తనాల్లో అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించి క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడతాయి. బీటా-సిటోస్టెరాల్ సమృద్ధిగా ఉండటంతో రొమ్ము క్యాన్సర్‌ను నివారించేందుకు వీటివల్ల ప్రయోజనం కలుగుతుంది. పొద్దుతిరుగుడు విత్తనాల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్ అధికంగా ఉంటాయి. ఇవి తిన్న వెంటనే శరీరానికి తృప్తిని ఇచ్చే ఆహారంగా పనిచేస్తాయి. కరిగే ఫైబర్ అధికంగా ఉండటంతో జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. ఆకలి నియంత్రణలో ఉండేలా సహాయపడటంతో బరువు పెరగకుండా ఉంటారు. పొద్దుతిరుగుడు విత్తనాలు ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి శరీరానికి పోషకాలను అందించి, రోగనిరోధక శక్తిని పెంచుతాయి. చిన్న పిల్లలు, పెద్దవారు అందరూ తినేందుకు అనువైనవి. రోజూ కొంత పరిమాణంలో తింటే శరీరానికి కావాల్సిన అనేక ప్రయోజనాలను అందించగలవు.

## డయాబెటీస్ ఉన్న వారు బ్లాక్ బెర్రీస్ తింటే...

అలాంటి ఆరోగ్యకరమైన పండ్లలో బ్లాక్ బెర్రీస్ ఒకటి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ బెర్రీస్ తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఇక్కడ తెలుసుకుందాం.. బ్లాక్ బెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. మనం



రోజు తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకున్నట్లయితే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అంటున్నారు వైద్య నిపుణులు. మన రోజు వారి డైట్‌లో కొన్ని రకాల పండ్లను చేర్చుకుంటే చాలా వరకు అనారోగ్య సమస్యల బారిన పడకుండా కాపాడుకోవచ్చునని సూచిస్తున్నారు. అలాంటి ఆరోగ్యకరమైన పండ్లలో బ్లాక్ బెర్రీస్ ఒకటి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు అనేకం ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ బెర్రీస్ లో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్, పాలీఫినాల్స్ అధికంగా ఉండటం వల్ల ఒత్తిడిని తట్టుకునే శక్తి ఉంటుంది. వీటిని ప్రతిరోజూ తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బ్లాక్ బెర్రీలో వైద్య పరంగా ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. వీటిలో విటమిన్ సి అధికం. ఆరోగ్యానికి చాలా మంచిది. ఎముకల ఆరోగ్యానికి, చర్మ సౌదర్యానికి సహాయపడుతుంది. బ్లాక్ బెర్రీలో తక్కువ కార్బోహైడ్రేట్స్, యాంటీఆక్సిడెంట్లు అధికం. ఈ పండ్లు డయాబెటీస్ వ్యాధి గ్రస్తులకు అద్భుతంగా పనిచేస్తాయి. బ్లాక్ బెర్రీస్‌లో ఫైబర్ తగిన మోతాదులో ఉంటుంది. బ్లాక్ బెర్రీస్‌లో ఫైబర్ తగిన మోతాదులో ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. ఒత్తిడి తగ్గించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. బ్లాక్ బెర్రీస్‌ను తరచూ తీసుకోవడం వల్ల మతిమరుపు సమస్యను తగ్గిస్తుంది. బ్లాక్ బెర్రీస్ తింటే చర్మ సంరక్షణకు తోడ్పడుతుంది. మెదడు ఆరోగ్యం పనితీరును మెరుగుపరుస్తుంది. ఎముకల ఆరోగ్యానికి చాలా మంచిది.

## పుదీనా తింటే ఇన్ని లాభాలా..?

పుదీనా వాసన చూస్తేనే మూడ్ రిఫ్రెష్ అవుతుంది. వంటల్లో మంచి రుచి, వాసన కోసం చాలా మంది పుదీనాను ఎక్కువగా వాడుతుంటారు. పుదీనా వంటల రుచిని పెంచడానికే కాదు..పుష్కలమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. రోజూ కొన్ని పుదీనా ఆకులు తినటం వల్ల పుట్టెడు లాభాలు ఉన్నాయని చెబుతున్నారు. అందుకే పుదీనాను ఆయుర్వేదంలో ఔషధ మూలికగా పిలుస్తారు. ఉబ్బసం, తలనొప్పి, నోటికి సంబంధించిన సమస్యలకు పుదీనా బెస్ట్ హోం రెమిడీగా పనిచేస్తుంది. పుదీనా ఆకులు జీర్ణక్రియను మెరుగుపరచి అజీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. పుదీనాలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. పుదీనా ఆకులలో ఉండే యాంటీబాక్టీరియల్ గుణాలు



చర్మ సమస్యలను తగ్గించేందుకు సహాయపడతాయి. పుదీనా ఆకులు కొవ్వు కరిగించేందుకు ఉపయోగపడతాయి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. రోజూ పుదీనా తినడం వల్ల నోటి దుర్వాసన తగ్గుతుంది, నోటిని తాజాగా ఉంచుతుంది. పుదీనా వాసన మెదడుకు శాంతిని కలిగించి ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ పుదీనా ఆకులు తినడం శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కాబట్టి ఏదో ఒక విధంగా దీన్ని ఆహారంలో చేర్చుకోవడం మంచిది. పుదీనాలో యాంటీఆక్సిడెంట్లు, మెంథాల్, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఎంజైమ్‌లు ఆహారాన్ని జీర్ణం చేయడంలో ఇవి సహాయపడతాయి. పుదీనా ఆకులను నమలడం వల్ల నోరు శుభ్రపడుతుంది. దంతాలు ఆరోగ్యంగా ఉంటాయి.పుదీనాలో ఉన్న నూనెలు యాంటీ బ్యాక్టీరియల్, క్రిమినాశక ప్రభావాలను కలిగి ఉండటం వల్ల జీర్ణాశయాన్ని శాంతపరుస్తూ ఆమ్లత్వం, అపానవాయువులను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది ఊపిరితిత్తులలో ఉన్న శ్లేష్మాన్ని బయటకు పంపి సులభంగా ఊపిరి పీల్చుకోవాటానికి దోహదం చేస్తుంది. అయితే పుదీనాను అధిక మోతాదులో తీసుకుంటే ఊపిరితిత్తుల వాయు మార్గాల్లో మంట పుట్టవచ్చు. పుదీనాను తరచూ తీసుకోవడం వల్ల ఏకాగ్రత పెరుగుతుంది. పుదీనాలో ఉండే బ్యాక్టీరియాలను సంహరించి, శోథను తగ్గించే పదార్థాలు చర్మంపై ఉన్న మొటిమలను నివారించడంలో సహాయపడతాయి. దీనితో పాటు అధిక మొత్తంలో ఉన్న సలిసిలిక్ ఆమ్లం చర్మాన్ని లోపలి నుంచి శుభ్రపరుస్తుంది. అలాగే, ఇందులో ఉన్న యాంటీఆక్సిడెంట్లు మలిన పదార్థాలను తొలగిస్తాయి. పుదీనా చర్మంలోని తేమను సంరక్షించి, మృత కణాలను తొలగించి, స్వేద రంధ్రాల నుంచి మలినాలను బయటకు పంపడం వల్ల చర్మం ప్రకాశవంతంగా, బిగుతుగా మారుతుంది.

## తమలపాకులో దాగివున్న హెల్త్ సీక్రెట్స్..!



ఈ ఆకు వల్ల కడుపులో అజీర్తి, గ్యాస్ సమస్య రాదు. తమలపాకు వల్ల రొంప సమస్యలు త్వరగా తగ్గిపోతాయి. శ్వాసనాళాలు క్లియర్ అవుతాయి. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తుంది. అంతేకాదు తమలపాకు షుగర్ కూడా నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటీవ్ మెరుగు చేస్తుంది. తమలపాకుల్ని మనం జ్యూస్‌లా చేసుకుని తాగొచ్చు. దీని వల్ల మనకి శ్వాస సమస్యలు దూరమవుతాయి.తమలపాకులో దాగివున్న ఆరోగ్య ప్రయోజనాలు దాదాపు చాలా మందకి తెలియదు.. ఇందులో ఉండే విటమిన్స్ అన్నీ ఇన్నీ కావు. తమలపాకులో విటమిన్ ఎ, బి కాంప్లెక్స్, విటమిన్ ఈలు ఉంటాయి. వీటితో పాటు పొటాషియం, కాల్షియం, అయోడిన్, పాస్ఫరస్, ఐరన్, అమైనోయాసిడ్స్, ఎంజైమ్స్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ అన్నీ ఉంటాయి. ఇవన్నీ కూడా మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకంగా పనిచేస్తాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, ఈ ఆకుల్ని మనం సరైన విధంగా తీసుకుంటే షుగర్ దగ్గర్నుంచీ చాలా సమస్యలకి చెక్ పెట్టొచ్చు అంటున్నారు నిపుణులు. తమలపాకు తీసుకోవడం వల్ల మలబద్ధక సమస్య తగ్గిపోతుంది. ఈ ఆకు వల్ల కడుపులో అజీర్తి, గ్యాస్ సమస్య రాదు. తమలపాకు వల్ల రొంప సమస్యలు త్వరగా తగ్గిపోతాయి. శ్వాసనాళాలు క్లియర్ అవుతాయి. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇది ఇన్‌ఫ్లమేషన్ తగ్గిస్తుంది. అంతేకాదు తమలపాకు షుగర్ కూడా నియంత్రిస్తుంది. ఇన్సులిన్ సెన్సిటీవ్ మెరుగు చేస్తుంది. తమలపాకుల్ని మనం జ్యూస్‌లా చేసుకుని తాగొచ్చు. దీని వల్ల మనకి శ్వాస సమస్యలు దూరమవుతాయి. పంటి సమస్యతో బాధపడుతున్న వారు తమలపాకు తీసుకోవాలి. ఇందులో యాంటీ మైక్రోబియల్ గుణాలు ఉంటాయి. ఇది పళ్లలో బ్యాక్టీరియా పెరగకుండా చిగుళ్లను పంటిని కాపాడుతుంది.

అంతేకాదు తమలపాకు తీసుకోవడం వల్ల జీర్ణ ఆరోగ్యానికి ప్రేరేపిస్తుంది. ఇది డైజెస్టివ్ ఎంజైమ్‌లను వేరు చేయడంలో సహాయపడుతుంది. తమలపాకులో గాయాలు నయం చేసే గుణాలు కూడా ఉంటాయి. తమలపాకు తీసుకోవడం వల్ల నిద్రలేమి సమస్యకు చెక్ పెట్టొచ్చు.

## పచ్చి ఉల్లి తినే అలవాటు ఉందా?

సాధారణంగా ఉల్లిపాయలను వంటల్లో ఉడికించి తింటుంటారు. ఇవి వంటలకు రుచిని జోడించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. అయితే కొంత మందికి పచ్చి ఉల్లి తినే అలవాటు ఉంటుంది. చాలా మంది రోజూ వంటల్లో ఉల్లిపాయలను ఉపయోగిస్తుంటారు. ఇవి వంటలకు రుచిని జోడించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తాయి. సాధారణంగా వంటలలో వీటిని ఉపయోగించేముందు ఉల్లిపాయలను ఉడికించి లేదా వేయించి వంటలో ఉపయోగిస్తారు. కానీ పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మీకు తెలుసా? పచ్చి ఉల్లిపాయలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయి. ఉల్లిపాయలను రోజూ తీసుకోవడం వల్ల డయాబెటిస్ లేదా ప్రీ-డయాబెటిస్‌ను తగ్గించవచ్చు. ఉల్లిపాయల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి చాలా మంచివి. పచ్చి ఉల్లిపాయల్లోని శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడతాయి. అంతేకాకుండా ఇందులో ఫ్లేవనాయిడ్ అనే యాంటీఆక్సిడెంట్ కూడా ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. పచ్చి ఉల్లిపాయల్లో ఫైబర్, ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఉల్లిపాయల్లో ఫైబర్, ప్రీబయోటిక్స్ అధికంగా ఉంటాయి. ఇవి పేగుల ఆరోగ్యానికి చాలా అవసరం. పచ్చి ఉల్లిపాయలు ఆరోగ్యానికి చాలా మంచివి. జీర్ణక్రియను మెరుగుపరచడంలో చాలా సహాయపడతాయి. పచ్చి ఉల్లిపాయలు తినడం వల్ల శరీరంలో జీర్ణక్రియ మెరుగుపడి మలబద్ధకం తగ్గుతుంది.

## గుమ్మడికాయ జ్యూస్ తాగితే ఏమవుతుంది?



గుమ్మడి కాయ జ్యూస్ తయారీ కోసం ముందుగా గుమ్మడికాయ ముక్కలను చిన్నగా కట్ చేసి మిక్సీలో వేసుకోవాలి. అర గ్లాసు నీరు కలిపి బాగా మిక్స్ చేయాలి. అవసరమైతే తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. గుమ్మడికాయ జ్యూస్ తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలును చేస్తుంది. ఉదయాన్నే తాగితే శరీరం శుద్ధి అవుతుంది. బరువు తగ్గించుకోవాలనుకునే వారు దీన్ని తప్పకుండా ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడికాయ పోషకగుణాలు ఎక్కువగా కలిగిన కాయలలో ఒకటి. దీని నుంచి తీసే రసం ఆరోగ్యానికి చాలా మంచిదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గుమ్మడికాయ జ్యూస్‌లో విటమిన్ A, C ఎక్కువగా ఉంటాయి. ఇది శరీరాన్ని రోగనిరోధకంగా మారుస్తుంది. తరచుగా జలుబు, దగ్గు సమస్యలు రాకుండా కాపాడుతుంది. తక్కువ క్యాలరీలు, ఎక్కువ ఫైబర్ కలిగి ఉంటుంది. కడుపునిండిన అనుభూతిని కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థను మెరుగుపరిచి కొవ్వును తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణసంబంధ సమస్యలు ఉన్నవారికి ఇది ఎంతో మంచిది. కడుపు మంట, అజీర్ణం వంటి సమస్యలు తగ్గుతాయి.


లివర్, కిడ్నీలను శుభ్రం చేసే గుణాలు ఇందులో ఉంటాయి. గుమ్మడికాయ రసం చర్మాన్ని ప్రకాశవంతంగా ఉంచుతుంది. ముడతలు, మచ్చలు రాకుండా చేస్తుంది.చర్మాన్ని హైడ్రేట్ చేసి తేమను ఇస్తుంది. గుమ్మడికాయలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది.హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. గుమ్మడి కాయ జ్యూస్ తయారీ కోసం ముందుగా గుమ్మడికాయ ముక్కలను చిన్నగా కట్ చేసి మిక్సీలో వేసుకోవాలి. అర గ్లాసు నీరు కలిపి బాగా మిక్స్ చేయాలి. అవసరమైతే తేనె, నిమ్మరసం కలిపి తాగవచ్చు. గుమ్మడికాయ జ్యూస్ తాగడం ఆరోగ్యానికి ఎంతో మేలును చేస్తుంది. ఉదయాన్నే తాగితే శరీరం శుద్ధి అవుతుంది. బరువు తగ్గించుకోవాలనుకునే వారు దీన్ని తప్పకుండా ప్రయత్నించాలని నిపుణులు చెబుతున్నారు.



# సినిమా



## దిల్ రుబా దెబ్బకు 'కె ర్యాంప్' చెకింగ్



ఇటీవలే విడుదలైన దిల్ రుబా కిరణ్ అబ్బవరంకు పెద్ద షాకే ఇచ్చింది. ముందు రోజు సాయంత్రం ప్రీమియర్ షో నుంచే నెగటివ్ టాక్ బయటికి వచ్చేయడంతో వాస్తవాన్ని అర్థం చేసుకున్న టీమ్ ఆ తర్వాత అనవసర ఆర్భాటాలు, బాణాసంచా కాల్చుడాలు లాంటివి చేయకుండా సైలెంట్ అయిపోయింది. కనీసం పది కోట్లయినా వసూలు చేస్తుందనుకుంటే అందులో సగం కూడా తేలేని పరిస్థితి ఉండటంతో దాని ప్రభావం మార్కెట్ మీద ఎంత ఉంటుందనే దాని గురించి తర్వాతి నిర్మాతలు ఆందోళన చెందడం సహజం. నెక్స్ట్ నిర్మాణంలో ఉన్నది కె ర్యాంప్. ఇటీవలే అఫీషియల్ గా ప్రకటించారు. కేరళ కాలేజీ బ్యాక్ డ్రాప్ లో మంచి యూత్ ఫుల్ కంటెంట్ తో క్రేజీ రొమాన్స్ కూడా దట్టించారని దీని గురించి ఇన్ సైడ్ టాక్ ఉంది. రెగ్యులర్ షూటింగ్ ఇంకా వెళ్ళలేదు కానీ డిస్కషన్స్ లో ఉన్నవాళ్లు చెప్పిన దాని ప్రకారం ఓ రేంజ్ హాస్యం రాసుకున్నారట. లిప్ లాక్ కిస్సులు వగైరాలు కూడా ఉన్నాయట. అయితే దిల్ రుబా ఫలితం చూసిన కె ర్యాంప్ మరోసారి స్క్రిప్ట్ ని వడబోసి ఏమైనా పొరపాట్లు ఉన్నాయేమో సరిచూసుకునే పనిలో పడ్డట్టు సమాచారం. ఎంత యూత్ ని టార్గెట్ చేసుకున్నా వాళ్లకు నచ్చే విధంగా నెరేషన్ లేకపోతే ఏమవుతుందో దిల్ రుబా నిరూపించేసింది కాబట్టే ఈ జాగ్రత్త అవసరం.

## ఓటీటీలోకి లేటెస్ట్ సూపర్ హిట్ సినిమా..

లవ్ టుడే ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ నటించిన తాజా చిత్రం 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్'. అశ్వత్ మారిముత్తు తెరకెక్కించిన ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ లో . అనుపమ పరమేశ్వరన్, కయాదు లోహర్ హీరోయిన్లుగా నటించారు. ఫిబ్రవరి 21న తమిళంతో పాటు తెలుగులోనూ ఒకే సారి థియేటర్లలో విడుదలైన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ముఖ్యంగా యూత్ ను ఈ మూవీ బాగా ఆకట్టుకుంది. ప్రదీప్ రంగనాథన్ తన యాక్టింగ్ తో మరోసారి అదరగొట్టాడు. అనుపమా గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తన స్క్రీన్ ప్రజెన్స్ తో మరోసారి ఆడియెన్స్ ను ఆకట్టుకుంది. ఇక ఈ సినిమాతో కుర్రకారు కొత్త క్రష్ గా మారిపోయింది కయాదు లోహర్. డైరెక్టర్ శంకర్, బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ లాంటి ప్రముఖులు సైతం రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ మూవీపై ప్రశంసలు కురిపించారు.





## బోల్డ్ హీరోయిన్‌గా సూపర్ క్రేజ్

ఈ క్యూటీ ఒకప్పుడు టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్. ఇప్పుడు కూడా సినిమాల్లో నటిస్తుందనుకోండి.. కానీ.. ఆ క్రేజ్ లేదు. అందం, ట్యాలెంట్ ఉన్న ఈ అమ్మడు ఒకప్పుడు బాగా సెన్సేషన్ అయ్యింది. కానీ రాను రాను సినిమా అవకాశాలు తగ్గిపోయాయి. ఒకప్పుడు తన సినిమాలతో అరకోటికి పైగా సంపాదించిన ఈ అందాల తార ఇప్పుడు కేవలం టాక్ షోలకే పరిమితమైంది. అప్పట్లో బోల్డ్ పాత్రలతో అలరించిన ఈ అందాల తార ఇప్పుడు బోల్డ్ కామెంట్స్ తో తరచూ వార్తల్లో నిలుస్తోంది. తెలుగు రియాలిటీ షో బిగ్ బాస్ లోనూ సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ మరెవరో కాదు తేజస్వి మదివాడ. ఇది ఆమె చిన్ననాటి ఫొటో. సినిమాల్లో ఎప్పుడు అల్లరిగా, చలాకీగా కనిపించే ఈ అందాల తార జీవితంలో ఎన్నో కష్టాలున్నాయి. తల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి మందుకు బానిసయ్యాడు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చి అనాథాశ్రమంలో పెరిగింది. ఎన్నో ఇబ్బందులు పడి చదువు కొనసాగింది. రెండేళ్లపాటు లంచ్ టైంలో పానీపూరి తిని కడుపు నింపుకున్నానంటూ ఓ సందర్భంలో చెప్పుకొచ్చింది తేజస్వి. కాగా జర్నలిజం చదివిన ఈ ముద్దుగుమ్మ నటనపట్ల ఆసక్తితో ఇండస్ట్రీలో అడుగుపెట్టింది.మహేశ్ బాబు నటించిన సీతమ్మవాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాతో ఈ భామకు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత ఆర్జీవీ తెరకెక్కించిన ఐస్ క్రీమ్ సినిమాలో సోలో హీరోయిన్ గా నటించింది. అయితే తన కెరీర్ లో ఎక్కువగా సెకెండ్ లీడ్ పాత్రలనే పోషించింది తేజస్వి. అందులోనూ చాలా వరకు బోల్డ్ పాత్రలే. అలాగనీ ఈ సొగసరి ఆదాయం తక్కువేమీ కాదు. ఇన్ స్టాగ్రామ్ లో ఒక పోస్ట్ పెడితే లక్షల రూపాయలు వచ్చేవని ఒక సందర్భంలో చెప్పుకొచ్చింది తేజస్వి. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. అంతా తలకిందులైంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ కేవలం టాక్ షోలకే పరిమితమైంది.



## చిరంజీవితో అనిల్ రావిపూడి మాస్టర్ ప్లాన్!

సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నాడు దర్శకుడు అనిల్ రావిపూడి విక్టరీ వెంకటేశ్ హీరోగా నటించిన ఈ చిత్రం రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ మూవీ ఇంకా సెట్‌పైకి వెల్లలేదు కానీ.. అనిల్ మాత్రం అప్పుడే ప్రమోషన్స్ మొదలెట్టేశాడు. సంక్రాంతికి వస్తున్నాం ప్రమోషన్స్‌లోనే చిరు సినిమాను అధికారికంగా ప్రకటించాడు. ఈ కథ కూడా కామెడీ పంథాలోనే సాగుతుందని హింట్ ఇచ్చేశాడు. అనిల్ రావిపూడి బలమే కామెడీ.. ఇక చిరంజీవి కామెడి టైమింగ్ గురించి అందరికి తెలిసిందే. వీరిద్దరు కలిసి ఓ కామెడీ సినిమా చేస్తున్నారంటే..దానిపై కచ్చితంగా భారీ అంచనాలు ఉంటాయి. ఆ అంచనాలకు తగ్గట్టే స్క్రిప్ట్ రెడీ చేస్తున్నాడట అనిల్. ఈ సినిమాలో చిరంజీవిని సరికొత్తగా చూపించబోతున్నారట. అలాగే కథలో కూడా కొత్తదనం ఉండేలా ప్లాన్ చేస్తున్నాడట. చిరు మూవీ అనగానే.. డూయెట్లు, లవ్‌ట్రాక్ మస్ట్. కానీ అనిల్ వాటి జోలికి వెళ్లడం లేదట. చిరంజీవిని కంప్లీట్ ఫ్యామిలీమెన్‌గా చూపించబోతున్నారట. చిరంజీవి వయసు తగ్గట్టుగానే పాత్రను రాసుకున్నారట. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఇంద్ర తర్వాత చిరంజీవి రాయలసీమ నేపథ్యంలో సినిమా చేయలేదు. ఇంద్రలో కూడా సీమ యాసను పూర్తిగా వాడలేదు. కానీ ఈచిత్రంలో చిరంజీవి పూర్తిగా రాయలసీమ యాసలోనే మాట్లాడతారట. డైలాగుల విషయంలోనూ అనిల్ జాగ్రత్త పడుతున్నారట. ఇక ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఆ పాత్రలకు భూమిక, మృణాల్ ఠాకుర్‌లను ఎంపిక చేసినట్లు టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.

# మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా ఢిల్లీ



దేశ రాజధాని ఢిల్లీ నగరం మరోసారి మోస్ట్ పొల్యూటెడ్ సిటీగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో (అక్టోబర్ నుంచి జనవరి 31 వరకు) ఢిల్లీలో సగటు పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 715 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఇది ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే చాలా ఎక్కువగా. శుభవార్త ఏంటంటే.. ఢిల్లీలో గాలి నాణ్యత గతేడాదితో పోలిస్తే కాస్త మెరుగ్గా ఉన్నది. గతేడాది ఇదే సమయంలో 2023-24 శీతాకాలంలో పీఎం2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 189 మైక్రోగ్రాములుగా రికార్డయ్యింది. ఢిల్లీ తర్వాత పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతా నగరం దేశంలో రెండో అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది. 2024-25 శీతాకాలంలో పీఎం 2.5 సగటు స్థాయి క్యూబిక్ మీటర్‌కు 65 మైక్రోగ్రాములుగా నమోదైంది. ఢిల్లీతో పోలిస్తే భారీగా తక్కువ ఉన్నది. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ముంబయి, బెంగళూరు, కోల్‌కతాలో కాలుష్యం గత సంవత్సరంతో పోలిస్తే తగ్గిందని.. చెన్నై, హైదరాబాద్‌లో అలాగే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో పీఎం 2.5 సగటున క్యూబిక్ మీటర్‌కు 52 మైక్రోగ్రాములు, ముంబయిలో 50, బెంగళూరులో 37, చెన్నైలో 36 మైక్రోగ్రాములు ఉన్నట్లుగా నివేదిక తెలిపింది.

అయితే, ఢిల్లీలో కాలుష్యం తగ్గినప్పటికీ పరిస్థితి తీవ్రంగానే ఉందని డేటా పేర్కొంది. కాలుష్యం ఇప్పటికీ ఆరోగ్య ప్రమాణాల కంటే చాలా ఎక్కువగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం.. పీఎం 2.5 స్థాయి క్యూబిక్ మీటర్‌కు 15 మైక్రోగ్రాములకు మించకూడదు. ఢిల్లీలో కాలుష్య స్థాయి పదకొండు రెట్లు ఎక్కువగా ఉన్నది. ఢిల్లీతో పాటు ఇతర మెట్రో నగరాల్లో కాలుష్యం తగ్గించడంపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు. మొదట వాహనాల కాలుష్యాన్ని నియంత్రించాలని.. ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహించాలని.. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచిస్తున్నారు. పర్యావరణ అనుకూల పరిశ్రమలను స్థాపించేలా చూడాలని చెబుతున్నారు. కర్మాగాల నుంచి వచ్చే పొగపై కఠినమైన నియంత్రణ అవసరమని.. చెత్తను కాల్చడంపై నిషేధం విధించాలని చెబుతున్నారు. వాస్తవానికి పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున చెత్తను కాల్చివేస్తున్న విషయం తెలిసిందే. మొక్కలను నాటడం.. నగరాల్లో పచ్చదనం పెంపుపై దృష్టి సారించడం అవసరమని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.

# అంతా ఛావా వల్లే.. అసెంబ్లీలో సీఎం ఫడ్నవిస్ కీలక ప్రకటన



**ముంబై:** నాగపూర్‌లో గత రాత్రి నుంచి నెలకొన్న ఉద్రిక్తతలకు ఒక రకంగా 'ఛావా' సినిమానే కారణమని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ అన్నారు. మొఘలాయి చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలనే డిమాండ్‌తో మొదలైన ఆందోళన కాస్త హింసాత్మకంగా మారడం.. ఆపై నెలకొన్న కర్ఫ్యూ పరిస్థితులపై ఆయన ఇవాళ అసెంబ్లీలో కీలక విషయాలు వెల్లడించారు. ఇక్కడ నేను కేవలం ఒక సినిమాను మాత్రమే తప్పుపట్టాలని అనుకోవడం లేదు. కానీ, ఇలా మాట్లాడక తప్పడం లేదు. శంభాజీ మహరాజ్ చరిత్రను ఛావా చిత్రం ప్రజల ముందు ఉంచింది. అదే సమయంలో పలువురి మనోభావాలు రగిలిపోయాయి. అందుకే ఔరంగజేబు మీద వ్యతిరేకత అంశం ఒక్కసారిగా తెర మీదకు వచ్చింది. అయితే.. ఇదంతా పక్కా ప్రణాళిక బద్ధంగా జరిగిన కుట్ర అని అనుమానాలు వ్యక్తం చేశారు. ఔరంగజేబు సమాధి తొలగించాలనే డిమాండ్‌తో సోమవారం సాయంత్రం వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ ధర్నా చేపట్టాయి. కర్రలతో ఔరంగజేబు నకిలీ సమాధి ఒకదానిని ఏర్పాటు చేసి తగలపెట్టారు. కాసేపటికే మతపరమైన ప్రతులు తగలబెట్టారని ప్రచారం రేగింది. ఇది కాస్త తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. కాబట్టి ఇందులో కుట్రకోణం కూడా దాగి ఉండొచ్చు అని అన్నారాయన. అయితే చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకున్నా సహించేది లేదని.. కులం, మతం ఏదైనా సరే ప్రజలు తమ భావోద్వేగాలను నియంత్రించుకోవాలని సూచించారాయన. అదే సమయంలో ఉద్రిక్తతలకు కారణమయ్యే వాళ్లపైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలంతా సమన్వయంతో పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని అసెంబ్లీ వేదికగా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే.. గత రాత్రి నాగ్‌పూర్ లో భారీ ఎత్తున విధ్వంస కాండ జరిగింది. రాళ్లు రువ్వుకుంటూ.. పలు వాహనాలకు నిప్పు పెట్టిన ఆందోళనకారులు.. పోలీసుపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడుల్లో.. కేవలం పోలీసులకే 33 మందికి గాయాలైనట్లు సమాచారం. అయితే సాధారణ పౌరులు ఎంత మంది గాయపడ్డారనేదిపై అక్కడి మీడియా ఛానెల్స్ తలా ఓ ఫిగర్ చెబుతుండడం గమనార్హం. ఇదిలా ఉంటే.. దర్శకుడు లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన చిత్రంలో లీడ్ రోల్ శంభాజీగా విక్కీ కౌశల్ శంభాజీ భార్య యేసుబాయిగా రష్మిక, ఔరంగజేబుగా అక్షయ్ ఖన్నా తమ ఫెర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. అయితే సినిమా రిలీజ్ టైంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ ఈ చిత్రాన్ని ఆకాశానికి ఎత్తారు. మరాఠా యోధుడు శంభాజీ పోరాటాన్ని, త్యాగాన్ని ఇప్పటి తరానికి తెలియజేసిన ఈ చిత్రం నిజంగా ఓ అద్భుతమంటూ కొనియాడారు.

# 44 ఏళ్ల నాటి దళితుల ఊచకోత కేసు.. ముగ్గురు నిందితులకు ఉరిశిక్ష విధించిన ప్రత్యేక కోర్టు!

దాదాపు 44 ఏళ్లనాటి దళితుల ఊచకోత కేసులో ఉత్తరప్రదేశ్‌లోని ప్రత్యేక కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. సామూహిక హత్యల కేసులో ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధించింది. ఇద్దరు దోషులకు ఒక్కొక్కరికి రూ. 2లక్షలు, మరో దోషికి రూ.లక్ష జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. ఫిరోజాబాద్‌లోని జస్రానాలోని దిహులి గ్రామంలో 1981 నవంబర్ 24న జరిగిన 24 మంది దళితుల ఊచకోత కేసులో కోర్టు తీర్పును వెల్లడించింది. ఆ తర్వాత నిందితులను మైన్‌పురి జిల్లా జైలుకు తరలించారు.

**అప్పీల్‌కు అవకాశం..**

ఈ కేసులో నిందితులైన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంప్‌లను భారీ భద్రత మధ్య మెయిన్‌పురి జిల్లా నుంచి పోలీసులు ఉదయం 11.30 గంటలకు ఏడీజే స్పెషల్ రాబరీ ఇందిరా సింగ్ కోర్టులో హాజరు పరిచారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరపున రోహిత్ శుక్లా కోర్టు ఎదుట వాదనలు వినిపించారు. మారణహోమం కేసులో సాక్ష్యాలను పరిశీలించి.. నిందితులకు మరణశిక్ష విధించాలని కోర్టును కోరారు. కేసులో వాదనలు విన్న కోర్టు దోషులుగా తేలిన కెప్టెన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌కు మరణశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించింది. న్యాయమూర్తి తీర్పును ప్రకటించిన తర్వాత ముగ్గురు దోషులు కోర్టులోనే విలపించారు. వారి బంధువులు సైతం కంటతడిపెట్టారు. కోర్టు నిందితులకు 30 రోజుల్లోగా మరణశిక్షకు వ్యతిరేకంగా హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది. కోర్టు తీర్పు నేపథ్యంలో 14 రోజుల పాటు దోషులు జైలులోని క్వారంటైన్ బ్యారక్‌లో ఉండనున్నారు. సమయానికి ఆహారం తీసుకుంటున్నారా? నిద్రపోతున్నారా? అని పరిశీలిస్తారు.

**అసలు ఏం జరిగిందంటే..!**

ఫిరోజాబాద్ జిల్లాలోని జస్రానా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని



దిహులి గ్రామంలో 24 మంది దళితులను ఊచకోత కోశారు. ఈ సంఘటన 1981 నవంబర్ 18న సాయంత్రం 6 గంటలకు జరిగింది. దోపిడీ దొంగలు సంతోష్, రాధే ముఠా ఆయుధాలతో దిహులి గ్రామంలోకి ప్రవేశించి.. ఓ కేసులో మహిళల, పిల్లలతో పాటు పలువురిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. అంతే కాకుండా దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 24 మంది మరణించారు. ఈ ఘటనపై దిహులికి చెందిన లాయక్ సింగ్ 1981 నవంబర్ 19న జస్రానా పోలీస్ స్టేషన్‌లో దాఖలు చేశారు. రాధేశ్యామ్ అలియాస్ రాధే, సంతోష్ సింగ్‌తో పాటు 20 మందిపై జస్రానా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు మెయిన్‌పురి నుంచి అలహాబాద్ కోర్టులో కొనసాగింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. జిల్లా న్యాయమూర్తి ఆదేశాల మేరకు ప్రత్యేక రాబరీ కోర్టులో విచారణ జరిగింది. ఈ ఘటనలో 20 మందిపై కేసు నమోదవగా.. విచారణ సమయంలోనే 13 మంది మరణించారు.

**కేసు వివరాలు..**

మారణం హోమానికి పాల్పడ్డారంటూ గ్యాంగ్ లీడర్ సంతోష్, రాధేశ్యామ్.. ముఠా సభ్యులు కమ్రుద్దీన్, శ్యామ్‌వీర్, కున్వర్‌పాల్, రాజే, భూరా, ప్రమోద్ రాణా, మలా?న్ సింగ్, రవీంద్ర సింగ్, దుర్గ్‌పాల్ సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు యుధిష్ఠిర్, మాన్ని సింగ్ కుమారుడు పంచమ్, లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్‌పై కేసు నమోదైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, జ్ఞానచంద్ర అలియాస్ గిన్నా, కప్తాన్ సింగ్, రాంసేవక్, రాంపాల్ తప్ప అందరూ మరణించారు. కోర్టులో డెత్ రిపోర్ట్ సైతం దాఖలైంది. లక్ష్మీ, ఇందల్, రుఖ్న్, గిన్నా ఇప్పటికీ పరారీలో ఉన్నారు. ఈ కేసులో పలువురిని సాక్ష్యులుగా చేర్చారు. ఇందులో కుమార్ ప్రసాద్ సాక్ష్యం కీలకంగా మారింది. ఆయన ప్రత్యక్ష సాక్షిగా ఉన్నారు. మారణహోమంపై ఆయన ఊచకోత, దోపిడీపై సాక్ష్యం అందించారు. ఈ ఘటన 1981 నవంబర్ 18న జరిగింది. దిహులిలో 24 మందిని అదే రోజు రాత్రి జస్రానా కోర్టులో కేసు నమోదైంది. 1982 ఫిబ్రవరి 26 వరకు ప్రధాన నిందితులు రాధే, సంతోష్ సహా 15 మంది నిందితుల అరెస్టు అయ్యారు. 1982 ఫిబ్రవరి 26న కోర్టులో చార్జిషీట్ దాఖలైంది. 1982 మే 13న కోర్టులో నిందితులపై అభియోగాలు మోపారు. 1982 మే 13న హైకోర్టు ఆదేశాల మేరకు కేసు ప్రయాగ్‌రాజ్ సెషన్ కోర్టుకు బదిలీ అయ్యింది. 19 అక్టోబర్ 2024న కేసును మళ్లీ మెయిన్‌పురి సెషన్ కోర్టుకు బదిలీ చేశారు. తాజాగా ముగ్గురు దోషులకు కోర్టు మరణశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించింది.

## ఆమె క్షేమంగా వస్తే చాలూ.. మాకు పండుగే!



**ఢిల్లీ:** తొమ్మిది నెలలపాటు అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ బుచ్ విల్మోర్‌లు ఎట్టకేలకు భూమికి తిరుగు పయనమయ్యారు. వ్యోమగాములంతా సురక్షితంగా భూమ్మీద అడుగు మోపాలని కోట్ల మంది ప్రార్థిస్తున్నారు. అయితే ఒక ఊరు మాత్రం ప్రత్యేకంగా సునీత క్షేమం కోసం పూజలు, హోమాలు చేస్తోంది. ఆమె రాకను ఒక పండుగలా జరిపేందుకు సన్నాహాలు చేస్తోంది. సునీతా విలియమ్స్ భారత సంతతి అనే విషయం తెలిసిందే కదా. గుజరాత్‌లోని మెహసానా జిల్లా ఝూలాసన్ ఆమె పూర్వీకుల గ్రామం అక్కడ ఇప్పటికీ ఆమెకు బంధువులు ఉన్నారు. కిందటి ఏడాది.. సునీత అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయినప్పటి నుంచి వాళ్లంతా ఆందోళనతోనే ఉన్నారు. ఆమె క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పుడు.. ఆమె తిరిగి వస్తుండడంపై వాళ్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. "నా సోదరి సునీతా రాక కోసం మేమంతా ఎంతో ఎదురుచూస్తున్నాం. సునీత తల్లి, సోదరి, సోదరుడుతో సహా ఈ దేశంలోని కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. ఆమె సురక్షితంగా కిందకు దిగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. సునీత కోసం దేవాలయాలకు వెళ్లి పూజలు చేశాం. సునీతా కోసం యజ్ఞం నిర్వహిస్తున్నాం" అని ఆమె సోదరుడు దినేశ్ అంటున్నారు. మరోవైపు ఊరు ఊరంతా.. సునీత రాకను చిరస్మరణీయమైన రోజు.. దేశం గర్వించదగిన రోజుగా చెబుతోంది. దీపావళి పండుగలా ఆమె రాకను సంబురంగా జరిపేందుకు సిద్ధం అయ్యింది. సునీతా విలియమ్స్ గతంలో రెండుసార్లు భారత్ పర్యటనకు వచ్చారు. 2007లో తొలిసారి ఇండియాకు వచ్చిన ఆమె.. ఝూలాసన్‌తో పాటు సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. తిరిగి 2013లో పర్యటనకు వచ్చి.. కోల్‌కతా, న్యూఢిల్లీతో పాటు తన పూర్వీకుల గ్రామాన్ని సందర్శించారు. ఆ సమయంలో ఝూలాసన్ గడ్డకు ఆమె ప్రత్యేకంగా భావిస్తున్నట్లు చెప్పారు. ఇదిలా ఉంటే.. కిందటి వ్యోమగాములను భూమ్మీదకు తీసుకొచ్చేందుకు అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ లోకి వీరు చేరుకున్నారు. ఈ వ్యోమనౌక అంతరిక్ష కేంద్రం నుంచి విడిపోయి భూమ్మీదకు బయల్దేరింది. స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ ఐఎస్ఎస్‌ను వీడే అన్‌డాకింగ్ దృశ్యాలను ప్రపంచమంతా వీక్షించేందుకు నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది.

## వ్యోమగామి సునిత విలియమ్స్కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ





**న్యూఢిల్లీ :** దాదాపు 9 నెలలుగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో భారత సంతతికి చెందిన వ్యోమగామి సునిత విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు వీరిరువురు తిరిగి భూమికి వస్తున్నారు. బుధవారం తెల్లావరుజామున వీళ్లు భూమ్మీదకు రానున్నారు. ఈ సందర్భంగా సునీత విలియమ్స్‌కు ప్రధాని నరేంద్ర మోదీ లేఖ రాశారు. ఈ లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు.సునీత విలియమ్స్ సురక్షితంగా భూమ్మీదకు రావాలని మొత్తం ప్రపంచం ఎదురుచూస్తోందని.. ఆమె కొన్ని వేల మైళ్ల దూరంలో ఉన్నా.. మన హృదయాలకు దగ్గరగా ఉంటారని మోదీ పేర్కొన్నారు. ఆమె ఆరోగ్యం బాగుండాలని దేశ ప్రజలు ప్రార్థిస్తున్నారని అన్నారు. తను అమెరికా పర్యటనకు వెళ్లినప్పుడు ట్రంప్‌ని కలిసినా.. లేదా బైడన్‌ని కలిసినా.. ఆమె ఆరోగ్యం గురించి విచారించినట్లు పేర్కొన్నారు. 140 కోట్ల భారతీయులు ఆమె సాధించిన ఘనతకు గర్వపడుతున్నారని తెలిపారు. ఆమె భర్త మైఖెల్ విలియమ్స్‌కి సునీతతో పాటు బుచ్ విల్‌మోర్‌కి కూడా ఆయన బెస్ట్ విషెస్ తెలియజేశారు

## ఓటర్ ఐడీతో ఆధార్ లింక్



త్వరలోనే ఓటర్ ఐడీతో ఆధార్‌ను అనుసంధించనున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలోనే ఓటర్ ఐడీ, ఆధార్ అనుసంధానంపై చర్చించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నేతృత్వంలో ఈసీలు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో కేంద్ర హోంశాఖ కార్యదర్శి, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి, యూఐడీఏఐ సీఈవో, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 నిబంధనల ప్రకారం.. ఓటర్ ఐడీకార్డును ఆధార్‌తో అనుసంధానంపై చర్చించారు.

భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ, ఎన్నికల కమిషన్ సాంకేతిక నిపుణులు త్వరలో ఈ విషయంలో మరింత చర్చలు జరపాలని నిర్ణయించారు. ఇటీవల నకిలీ ఓటర్ కార్డ్ విషయంలో పార్లమెంట్‌తో పాటు బయట గందరగోళం నెలకొన్నది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ చట్టబద్ధతపై ప్రశ్నలు లేవనెత్తాయి. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సైతం ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తారు. ఇటీవల ఎన్నికల సంఘం దశాబ్దాల నాటి డూప్లికేట్ ఓటరు ఐడీ నెంబర్స్ సమస్యను రాబోయే మూడు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓటర్ ఐడీతో ఆధార్ అనుసంధానంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.